ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 09.07.2025 | సంపుటి :11 సంచిక : 351 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు

## బాంబు బెదిరింపులు

**పోలీసులు, అధికారులు అప్రమత్తం..**

**నగరమంతటా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్టు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. రాజ్‌భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్,

మిగతా 2లో..

## బీహార్‌లో మహిళలకు 35% రిజర్వేషన్

**నీతీశ్ ఎన్నికల వ్యూహం..**

**పాట్నా(జనంసాక్షి):** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటించడంలో పోటీ పడుతున్నాయి. తాజాగా బిహార్

మిగతా 2లో..

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి

# సహకరించండి

## వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయండి

**హైదరాబాద్ - విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీ అధ్యయన దశలో ఉంది**

**పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి మద్దతివ్వండి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిపీయూష్ గోయల్‌ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో ఆయనతో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రానికి సంబంధించి పలు కీలక ప్రాజెక్టుల విషయంపై చర్చించారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు కార్యక్రమం కింద ఆమోదించిన రూ. 596.61 కోట్లను సత్వరం విడుదల చేయాలని



న్యూఢిల్లీలో కేంద్రమంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవి, జితేందర్ రెడ్డి



## ఎరువులు సకాలంలో సరఫరా చేయండి

- లోటులేకుండా తెలంగాణకు కేటాయించిన పూర్తిస్థాయి కోటా అందించండి
- సరైన సమయంలో సరఫరా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు
- దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియాలో తెలంగాణకు కోటాను పెంచండి
- కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

2లో




మహబూబాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, కొమటిరెడ్డి, పొంగులేటి,సీతక్క

## నాలుగు కుటుంబాలే బాగుపడ్డాయ్

**రైతుల సంక్షేమానికి ఏడాదిలోనే రూ.70వేల కోట్లు ఖర్చు చేశాం**

- రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు
- మూడు నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ ..ఇది మా నిబద్ధత
- డిప్యూటీ సీఎం భట్టి , మంత్రులు తుమ్మల, సురేఖ, పొంగులేటి, కోమటి రెడ్డి
- మానుకోటలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

**మహబూబాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం నిర్మించి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, అసత్యాలు మానకపోతే.. బిఆర్ఎస్ కు డిపాజిట్లు రావని అన్నారు. నోరుందికదా అని కెటిఆర్ ఏది పడితే అది మాట్లాడమేనా? అని భట్టి ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఒకరికి సవాల్ విసిరితే మరొకరు బయటకు వచ్చారని అన్నారు. మహబూబాబాద్‌లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ. లక్ష రుణమాఫీ విషయంలో మాజీ సిఎం కెసిఆర్ రెండుసార్లు మోసం చేశారని మండిపడ్డారు. తొలిసారి రుణమాఫీ పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు పదేళ్లలో రూ.లక్ష కోట్లు- దోచుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం వాళ్ల సొత్తు అన్నట్లు

మిగతా 2లో..

భద్రాచలం ఆలయ ఈవోపై

## ఏపీలో దాడి



గ్రామస్తులు దాడి చేయడంతో సొమ్మసిల్లి పడిపోయిన ఈవో

**ఆలయ సిబ్బందిపైనా..**

**ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారిణిపై దౌర్జన్యం**

**ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఘటన**

**భద్రాచలం(జనంసాక్షి):** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై గ్రామస్థులు దాడి చేశారు. ఈవోతో పాటు ఆలయ సిబ్బందిపైనా ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్పృహ తప్పి పడిపోయిన ఈవోను ఆలయ సిబ్బంది భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమెతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వినీల్ అస్వస్థతకు గురికావడంతో అతడికి కూడా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వాళ్లిద్దరూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన 889

మిగతా 2లో..



## దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్

- భద్రాచలం ఇవోపై దాడి దుర్మార్గం
- దీనిపై చంద్రబాబు వెంటనే స్పందించాలి
- మంత్రి కొండా సురేఖ ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ఈవోలపై దాడి చేస్తే ఊరుకునేది లేదన్నారు. దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు.

3లో

## చర్చకు ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన కేటీఆర్

- మాట తప్పడం సీఎం రేవంత్‌కు అలవాటైంది
- ఆరు గ్యారెంటీలు..420 హామీలతో మోసం
- నీళ్లు ఆంధ్రాకు...నిధులు ఢిల్లీకి..
- నియామకాలు సొంతవారికని ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమం,పోరాటం నీళ్లు, నిధులు, నియామకాలకోసమే అన్నది అందరికీ తెలుసని, కాంగ్రెస్ కూడా ఇప్పుడు అదే అనుసరిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. నీళ్లేమో ఆంధ్రాకు, నిధులు రాహుల్‌కు, నియామ కాలు కొందరు తాబేదార్లకు అప్పగించారని మండిపడ్డారు. మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని కేటీఆర్ అన్నారు. రైతు సంక్షేమం తదితర అంవాలపై చర్చకు సిద్ధమంటూ ఇటీవల

మిగతా 2లో..




## చర్చ అక్కడెందుకుంటది.. అసెంబ్లీకి రా..

**కేటీఆర్ లెక్కలకు సమాధానం ఉంది**

- అసెంబ్లీలో ఏ అంశమైనా చర్చిస్తాం
- కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధమే
- అసత్యాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- కేటీఆర్ విమర్శలపై మంత్రుల కౌంటర్

**మహబూబాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సవాళ్లపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘాటుగా స్పందించారు. తాము చేసిన సవాల్‌కు సిద్ధమేనని, కాకపోతే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు వచ్చి చర్చకు సిద్ధంగా కావాలన్నారు. ప్రజల పట్ల ఏ మాత్రం నిబద్ధత ఉన్నా మాజీ సీఎం కేసీఆర్ శాసన సభకు రావాలని, తాము కూడా లెక్కలతో సహా వస్తామని, శాసనసభలోనే తేల్చుకుందామన్నారు మల్లు. ఈ మేరకు మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..

మిగతా 2లో..



## రాముడు నేపాల్‌లోనే పుట్టిండు

**శివుడూ..విశ్వామిత్రుడు కూడా మావారే**

**నేపాల్ ప్రధాని ఓలి వివాదాస్పద వ్యాఖ్యలు**



**ఖాట్మండ్(జనంసాక్షి):** శ్రీ రాముడు నేపాల్ వాసి అని, ఇక్కడే పుట్టాడని ఆయన జన్మస్థలంపై నేపాల్ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు తమ దేశంలోనే జన్మించాడని ఆయన పేర్కొన్నారు. అలాగే భగవాన్ శంకర్, విశ్వామిత్ర మహర్షి కూడా ఇక్కడే పుట్టారని అన్నారు. అందుకు తగిన ఆధారాలు ఉన్నాయని అన్నారు.

మిగతా 2లో..



## ఉరకలెత్తిన కృష్ణమ్మ

- జలాహారతి అనంతరం డ్యాం గేట్లు ఎత్తిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు
- జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణామం
- సముద్రంలో వృథాగా పోయే నీటిని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలు వాడుకోవాలని వెల్లడి

2లో



## స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న రైలు

**ముగ్గురు విద్యార్థులు మృతి**

**తమిళనాడులోని కడలూరులో ఘోర ప్రమాదం**

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులోని కడలూరులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పట్టాలు దాటుతున్న ఓ స్కూల్ వ్యాన్‌ను రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం ఉదయం కడలూరులోని సెమ్మన్ కుప్పం వద్ద ఈ ఘటన జరిగింది. రైల్వే ట్రాక్‌ను

మిగతా 9లో..

## మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు

**అన్ని కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లను నియమించిన సర్కారు**

**44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి ... జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

2లో

## కల్తీ కల్లు కలకలం..

**కూకట్‌పల్లి పరిధిలోని హైదర్‌నగర్‌లో 11 మందికి అస్వస్థత**

**కూకట్‌పల్లి(జనంసాక్షి):** హైదరాబాద్‌లోనికూకట్‌పల్లి హైదర్ నగర్‌లో కల్తీ కల్లు తాగి 11 మంది అస్వస్థతకు గుర̆య్యారు. విరేచనాలు, లోబీపీతో బాధితులంతా ఆస్పత్రిలో చేరారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కూకట్‌పల్లిలోని ఓ ప్రైవే టు ఆస్పత్రిలో వీరందరికీ చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రి సిబ్బంది జీహెచ్ఎంసీ ఎంహెచ్‌వోకు సమాచారం అందించారు.



# నాలుగు కుటుంబాలే బాగుపడ్డాయి

కేసీఆర్ కుటుంబం వ్యవహరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. 'తెలంగాణలో సంక్షేమ పనులు అభివృద్ధిని చూడలేని గత పాలకులు అవాకులు చెవాకులు పేలుతున్నారు. పేదలు తినే ప్రతి బుక్కలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనబడుతుంది. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. 14వ తేదీన 40 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి పని చేస్తుంది. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గర్వంగా గల్లా ఎగిరేసుకోవచ్చని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 'ప్రజాపాలన ప్రగతిబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ– కేంద్రంలో ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ... 'డ్వాక్రా మహిళలకు 25 వేల కోట్ల రూపాయలు వడ్డీలేని రుణాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. మహబూబాబాద్ నగరంలో మహిళ శక్తి భవనాన్ని ఏర్పాటు– చేస్తున్నాం. మహిళల కోసం 500 రూపాయలకు గ్యాస్ ఇస్తున్నాం. మహిళల సంక్షేమం ఇందిరమ్మ రాజ్య లక్ష్యం. ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే ఆ ఇళ్ళు, ఊరు బాగుంటు–ంది. పేదలు కరెంట్ బిల్లులు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మా ప్రభుత్వం అదే పేదలకు ఉచిత విద్యుత్ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నాయి. గత పాలకుల కుటుంబాలు కోటీశ్వరులు అయ్యారు తప్ప.. పేదల బతుకులు బాగుపడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు పెట్టుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

### ఎయిరిండియా విమాన ప్రమాదం..

# కేంద్రానికి అందిన ప్రాథమిక నివేదిక



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని మంగళవారం కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతానికి ఈ నివేదికను అధికారులు బయటపెట్టలేదు. ఈ వారాంతంలో విడుదల చేసే అవకాశమున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. విమాన డేటా, చివరి నిమిషంలో సిబ్బంది చర్యలు, వాతావరణ పరిస్థితులు తదితర అంశాలతో ఈ ప్రాథమిక నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికతో ప్రమాదానికి గల కారణాలపై ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. అహ్మదాబాద్ నుంచి జూన్ 12న లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిపోయింది. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకేఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. మిగతా 241 మంది మృతి చెందారు. ఇక, ఈ విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడటంతో అందులోని పలువురు మృతి చెందారు. మొత్తంగా ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది.

# ఉరకలెత్తిన కృష్ణమ్మ

**శ్రీశైలం(జనంసాక్షి):** తన జీవితంలో ఇవాళ చాలా సంతోషకరమైన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణామమని చెప్పారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన అనంతరం ప్రాజెక్టు నాలుగు గేట్లను సీఎం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. "శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. మల్లన్న ఆశీస్సులతో రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. జలాలే మన సంపద.. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పైనుంచి వచ్చిన జలాలతో 200 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో ఉంది. రాయలసీమను ఎవరూ కాపాడలేరని గతంలో చాలామంది అన్నారు. సీమ స్థితిగతులు మార్చేందుకు ఎన్టీఆర్ నడుం బిగించారు. రాయలసీమ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నా. సాగునీటి ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. జీడిపల్లికి నీరు తీసుకెళ్లే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఈనెల 15 నాటికి ఆ ప్రాంతానికి నీరు రావాలని అధికారులకు టార్గెట్ విధించా. ఈనెల 30 కల్లా కుప్పం, మదనపల్లెకు నీళు తీసుకెళ్తాం. పోతిరెడ్డిపాడు, గాలేరు–నగరి, గండికోట.. అన్నీ మేమే తెచ్చాం. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనేది నా లక్ష్యం. మేం చేసిన అభివృద్ధిని హైదరాబాద్‌లో కొనసాగిస్తున్నారు. సముద్రంలో కలిసే నీటిని తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే మంచిది. దీంతో రెండు రాష్ట్రాల రైతాంగానికి మేలు జరుగుతుంది. రాయలసీమకు నీళ్లు వస్తున్నాయంటే పోలవరం వల్లే. సీమకు ఏమేం చేయాలో నా వద్ద బ్లూప్రింట్ ఉంది. దేశంలో ఎక్కడా లేని రోడ్ల వ్యవస్థ ఈ ప్రాంతంలో ఉంది. గతంలో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు తినేవాళ్లం. పాలిష్డ్ రైస్ తిని చాలామంది షుగర్ వ్యాధి తెచ్చుకుంటున్నారు. ఇప్పుడంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.. చిరుధాన్యాలు తింటున్నారు. కూరగాయలు, పండ్ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అన్ని రకాల పండ్లు పండే ప్రాంతం రాయలసీమ. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక హబ్‌లుగా మారుతున్నాయి"అని చంద్రబాబు అన్నారు. తొలుత ప్రాజెక్టు వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన సీఎం.. జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆ తర్వాత రైతులతో కలిసి సీఎం శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి నీటిని సాగర్‌కు విడుదల చేశారు. 6, 7, 8, 11 నంబర్ గేట్లు ఎత్తారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సీఎం వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి

# సహకరించండి

కోరారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్ – విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందని వివరిస్తూ, హైదరాబాద్ – బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తా



మని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని గోయల్‌ను కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్, ఎంపీలు మల్లు రవి,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయ ఈవోపై ఏపీలో దాడి

ఎకరాల భూమి ఉంది. చాలా కాలంగా ఇది ఆక్రమణలకు గురి అయింది. ఈ వ్యవహారంలో ఏపీ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆలయ భూములకు సంబంధించి దేవస్థానానికి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకునేందుకు వెళ్లిన ఈవోతో పాటు ఆలయ సిబ్బందిపై గ్రామస్థులు కర్రలతో దాడి చేశారు. ఆలయ ఈవోపై దాడిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖండించారు. దేవస్థాన భూముల ఆక్రమణలపై అడిగేందుకు వెళితే దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు ప్రభుత్వం రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారులను నియమించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించింది. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చివరిదశకు వచ్చింది. ఏడీఎంఈల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయిన వారికి కూడా ప్రభుత్వం త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల సమస్య తీరనున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ చర్యలు ప్రారంభించింది. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు.





### ఎరువులు సకాలంలో

# సరఫరా చేయండి

**- లోటులేకుండా తెలంగాణకు కేటాయించిన పూర్తి స్థాయి కోటా అందించండి**

**- సరైన సమయంలో సరఫరా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు**

**- దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియాలో తెలంగాణకు కోటాను పెంచండి**

**- కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ – జూన్ మధ్య రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న సమయంలో యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. జులై నెలకు సంబంధించి దేశీయంగా ఉత్పత్తయిన యూరియా 63 వేల మెట్రిక్ టన్నులు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా 97 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని వివరిస్తూ వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే, తెలంగాణకు దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను పెంచాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య కూడా పెంచాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్, ఎంపీలు మల్లు రవి,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చర్చ అక్కడెందుకుంటది.. అసెంబ్లీకి రా..

' ఒక పెద్ద మనిషి హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కి వచ్చి సవాళ్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చెప్పింది ఏంటి...! నీకు అర్థం అయ్యింది ఏంటి..?, ముఖ్యమంత్రి.. మాజీ ముఖ్యమంత్రిని రమ్మని సవాల్ విసిరితే ఆయన్ను రానివ్వడం లేదు. సవాల్ ను జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలవాలి. కేసీఆర్‌ను రమ్మంటే ఆయన్ను రానివ్వకుండా ప్రెస్ క్లబ్ ఎవరో వచ్చి సవాళ్లు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రెస్‌క్లబ్‌కు రమ్మంటావా?, ముఖ్యమంత్రి రేవంత్.. మాజీ ముఖ్యమంత్రిని చర్చకు రమ్మని స్పష్టంగా చెప్పారు.. ముఖ్యమంత్రికి ఏ బేసిన్ గురించి తెలియదు. మళ్ళీ ఛాలెంజ్ చేస్తున్నా.. గోదావరి.. కృష్ణా జలాలు.. బేసిన్ గురించి.. ప్రజలకు తెలియ జేయడానికి చర్చించడానికి సిద్ధం. అసెంబ్లీలో చర్చకు మాజీ ముఖ్యమంత్రి రావాలి' అని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టులో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశారు. అన్నా వర్సిటీ పూర్వ విద్యార్థుల పేరుతో ఈ రోజు తెల్లవారుజామున 3.43 గంటలకు ఆగంతకుడు మెయిల్ పంపినట్టు పోలీసులు వెల్లడించారు. దీంతో మూడు గంటలపాటు సోదాలు జరిపిన పోలీసులు.. ఎలాంటి బాంబులు లేనట్లు తేల్చారు.

## రైల్‌రోకో ట్రైలర్ మాత్రమే

### 42శాతం బిసి రిజర్వేషన్లపై కవిత

**హైదరాబాద్(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే ఒక్క రైలు చక్రాన్ని కూడా ముందుకు కదలనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బిజెపి పార్టీలు చేస్తున్న మోసానికి నిరసనగా, బిసి బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఈ నెల 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు– ప్రకటించారు. రైల్ రోకో కేవలం –ట్రైలర్ మాత్రమేనని, బిల్లును ఆమోదించకపోతే భవిష్యత్తులో నిరవధికంగా రైల్ రోకోను నిర్వహిస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి కవిత మాట్లాడారు. రైల్ రోకోకు మద్ధతు, బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో అన్ని పార్టీలకు లేఖలు రాస్తానని తెలిపారు. తాము ఒబిసిని అని చెప్పుకునే ప్రధాని మోదీకి ఆ వర్గాలకు న్యాయం చేసే అవకాశం లభించిందని, తెలంగాణ అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో అమలవుతున్న 69 శాతం రిజర్వేషన్ల తరహాలో తెలంగాణ బిసి బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని ప్రతిపాదించారు.

# చర్చకు ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన కేటీఆర్

సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ మంగళవారం ఉదయం ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చారు. ఆయన వెంట మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. చర్చ కోసం ఓ కే÷–చీలో సిఎం కోసం అంటూ ఖాళీగా పెట్టారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్‌రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం అని కేటీఆర్ అన్నారు. 18 నెలలుగా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోకుండా రంకెలేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌కు రచ్చ చేయడం తప్ప.. చర్చ చేయడం రాదని ఎద్దేవా చేశారు. రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తే ఆయన చర్చకు రాలేదని, రేవంత్ మాట తప్పుతారని తెలిసినా సవాల్‌ను స్వీకరించామని కేటీఆర్ అన్నారు. తెలంగాణ నిధులు ఢిల్లీకి పోతున్నాయని, రైతులపై సీఎం రేవంత్ రెడ్డికి గౌరవం లేదని ఆరోపించారు. సీఎం ఢిల్లీకి ఎందుకు వెళ్లారని అడిగితే ఎరువుల బస్తాల కోసమని చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఎవరికి బస్తాలు మోస్తున్నారో




తెలియంది కాదని అన్నారు. రైతుబంధు అందరికీ ఇచ్చేశామని చెప్పుకుంటున్నారని, కొడంగల్‌లో ఎంతమంది రైతులకు రైతుబంధు పడలేదో జాబితా సిద్ధంగా ఉందని చెప్పారు. రైతుల మరణాల జాబితా కూడా తీసుకొచ్చామని, ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితి ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే సంక్షేమ పాలన అందిస్తారని అనుకున్నామని అన్నారు. కానీ పోలీస్ పాలన నడుస్తోందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా పట్టింపు లేదన్నారు. చర్చ కోసం రేవంత్ ఇంటికి రమ్మన్నా వెళ్తామని చెప్పారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాము చాలని అన్నారు. కాంగ్రెస్ నేతలకు నిజాయితీ ఉంటే చర్చకు రావాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. కేటీఆర్‌తో చర్చకు వచ్చే సత్తా లేనప్పుడు.. రేవంత్ రెడ్డి మరోసారి సవాల్ చేయొద్దని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళింది యూరియా బస్తాల కోసం కాదని, ఏ బస్తాలు మోసి రేవంత్ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారో అందరికీ తెలుసని అన్నారు. రేవంత్ హయాంలో నీళు ఆంధ్రకు.. నిధులు ఢిల్లీకి.. నియామకాలు రేవంత్ తొత్తులకు దక్కుతున్నాయని అన్నారు. గురువు చంద్రబాబు కోసం తెలంగాణ నీళ్ళను ఆంధ్రకు పంపుతున్నారని ఆరోపించారు. రేవంత్ మోసాలు చేసి నాలుగు రోజులు తప్పించుకోవచ్చని, కానీ ప్రజలు క్షమించరని కేటీఆర్ అన్నారు. సవాల్ విసిరి మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటని ఆరోపించారు. 2018లో కొండగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, ఆ తర్వాత మాట తప్పాడని గుర్తుచేశారు. అందకుముందు తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని 18 నెలలుగా నిలదీస్తున్నామని కేటీఆర్ అన్నారు. అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎన్నో సార్లు ఆహ్వానించాం. అసెంబ్లీలో కాదంటే.. ప్రెస్‌క్లబ్‌లోనైనా చర్చకు రావాలని చెప్పా. రుణమాఫీ, రైతు బోనస్ వంటి అంశాలపై చర్చకు రావాలని ఆహ్వానించా. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీలో ఉన్నారని తెలిసింది... సీఎం రాకుంటే మంత్రులైనా రావాలి. సీఎం ఇవాళ హాజరుకాకుంటే.. మరో రోజు చర్చకైనా మేం సిద్ధం. సీఎం రేవంత్‌రెడ్డికి వీలైన తేదీ, ప్రదేశం చెప్పాలని అడుగుతున్నాం. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడిస్తామని హామీ ఇస్తే.. అసెంబ్లీలో కూడా సిద్ధం. ఈ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రేవంత్‌రెడ్డి తప్పుకొంటే.. అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చేసి చూపిస్తారని కేటీఆర్ అన్నారు. మీడియాతో మాట్లాడిన తర్వాత పార్టీ నేతలతో కలిసి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు బయల్దేరారు.

## రాముడు నేపాల్‌లోనే పుట్టిండు

**శివుడూ..విశ్వామిత్రుడు కూడా మావారే.. నేపాల్ ప్రధాని ఓలి వివాదస్పద వ్యాఖ్యలు**

కాఠ్‌మాండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఓలి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు నేపాల్‌లోనే జన్మించాడని ఓలి పునరుద్ఘాటించారు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని తెలిపారు. ఈవిషయం ప్రచారం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం సంకోచించవద్దని పిలుపునిచ్చారు. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరని ప్రశ్నించారు. రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉందని, అది ఇప్పటికీ అక్కడే ఉందన్నారు. దీన్ని తాము అంతగా ప్రచారం చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. అది కొందరిని బాధిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా ఆయన శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని పేర్కొన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, వాల్మీకి రాసిన రామాయణంలోనే ఇది కూడా ఉందన్నారు. ఇక, గతంలోనూ ఓలి ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. 2020లో అయోధ్య తమ దేశంలోని చిత్వాన్‌లోని థోరిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడే రాముడు పుట్టాడని ఆయన అన్నారు. అలాగే దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన ప్రాంతం కూడా తమ దేశంలోనే ఉందన్నారు. అప్పట్లో ఓలి చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈక్రమంలో నేపాల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. రాముడు జన్మస్థలంపై అనేక అభిప్రాయాలు ఉన్నాయని.. రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని తెలిపింది.

## బీహార్‌లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్

ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ అలాంటి ప్రకటనే చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. బిహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగంలోని అన్ని పోస్టులకు ఆ ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని సీఎం చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ సర్వీసుల్లో స్త్రీల ప్రాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పట్నాలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళా ఓటర్ల కోసం రిజర్వేషన్ ప్రకటించగా.. యువత కోసం బిహార్ యూత్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. దీనికింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వారి సంక్షేమం, ఉన్నతికి సంబంధించిన అంశాలపై కమిషన్ సలహాలు ఇవ్వొచ్చు. అలాగే మెరుగైన విద్య, ఉపాధి అవకాశాల విషయంలో ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోనుంది. ఇదిలాఉంటే.. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికారపక్షమైన ఎన్డీయే, ప్రతిపక్ష మహాగట్ బంధన్ సీట్ల పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఈమేరకు మిత్రపక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రధాన కూటముల్లోనూ అంతర్గత విభేదాలను అధిగమించడానికి గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రాతిపాదికన సీట్ల పంపకం చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. మరోవైపు.. విపక్ష కూటమి మహాగట్ బంధన్ సీట్ల పంపిణీపై ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించింది. దీనికి అన్ని పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యారు. కొన్ని పార్టీలు తమకు ఎక్కువ సీట్లు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని పార్టీలు తాము పోటీ చేయాలనుకొంటున్న సీట్ల జాబితా ఇవ్వాలని ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ మిత్రపక్షాలను కోరారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

## సిగాచి పరిశ్రమలో ఎన్‌డిఎంఎం బృందం పరిశీలన

**యాజమాన్యం నిర్లక్ష్యమేకారణమని వ్యాఖ్య**

**క్షతగాత్రుల్లో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి**



హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) : పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ-(ఎన్‌డిఎంఎ) బృందం పరిశీలిచింది. అనంతరం నిర్వహణ లోపాలపై సిగాచీ యాజమాన్యంపై ఎన్‌డిఎంఎ ప్రశ్నల వర్షం కురిపించింది. యాజమాన్యం సరిగ్గా సమాధానం ఇవ్వకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్థ అధికారుల స్పందనపై బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. రసాయన పరిశ్రమ గురించి తమకు తెలుసని, పేలుడు ఎలా సంభవించిందో చెప్పాలని వ్యాఖ్యానించింది. ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా అంచనా వేసింది. ఇదిలావుంటే సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకూ 44 మంది ప్రాణాలు కోల్పోయారు. పాశమైలారం సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతుల సంఖ్య 44కు చేరింది. ఈ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మరో ఇద్దరు మృతి చెందారు. పనేషియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్, ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అఖిలేశ్వర్ మృతి చెందారు. ఇవాళ ఇద్దరి మృతితో ఈ ఘటనలో ఇప్పటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 44కు చేరింది. మరోవైపు నేడు పాశమైలారం సిగాచీ పరిశ్రమకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ- బృందం రానుంది. ఘటనా స్థలాన్ని కడఃఆ బృందం పరిశీలించనుంది. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఎస్‌డీఎంఏతో కలిసి అధ్యయనం చేయనుంది. ప్రమాదానికి గల కారణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయనుంది.

# పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**12 నుంచి మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆ తర్వాత రాజీవ్ వికాసం**

**దేశంలో ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



మహబూబాబాద్ బ్యూరో, జూలై 08(జనం సాక్షి): రాష్ట్రంలో ప్రజలు ఏర్పాటు చేసుకున్న ఇందిరమ్మ ప్రజాపాలన ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని గత ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు, మంగళవారం మహబూబాబాద్ మండలం పర్వతగిరి సోమ్లా తండ గ్రామపంచాయతీలో 100 కోట్ల అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, గిరిజన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దేవాదాయ అటవీ శాఖ మంత్రి సురేఖ ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు ముందుగా ఎమ్మెల్యే మురళి నాయక్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ మహబూబాబాద్ నియోజకవర్గ సంక్షేమానికి 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించుకున్నామని అందులో భాగంగా ఐదు కోట్ల రూపాయలతో 33 కేవి సబ్ స్టేషన్,బేతోల్ నుంచి సోమ్లా తండా వరకు 20 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణం, జమాండ్లపల్లి నేషనల్ హైవే నుంచి 20 కోట రూపాయలతో బి టి రోడ్డు 5 కోట్ల రూపాయలతో సెంట్రల్ డ్రగ్ స్టోర్. గిరిజన అభివృద్ధి నిధుల నుంచి నేషనల్ హైవే నుంచి రాజలిపేట వరకు రోడ్డు ఏర్పాట్లు సుమారు 50 కోట్ల రూపాయలతో కేసముద్రం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని తెలిపారు. మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే కొన్ని వినతులు అందించారు. అందులో భాగంగా మానుకోటకు పట్టణం పైనుంచి వెళ్తున హై లెవెల్ విద్యుత్ లైన్లను తొలగించాలని, దానికి కోసం 7కోట్ల నిధులు అందించాలని, మహబూబాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదవాని సంక్షేమానికి ఎటువంటి ఇబ్బంది జరగకుండా 17 నెలల ప్రజా పాలనలో ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల విద్యుత్ ను అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చామని, 500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఇవే కాకుండా రైతు సంక్షేమానికి పది 10 సంవత్సరాల పాలనలో గత బి ఆర్ ఎస్ పాలనా లో 15 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తే మా ఇందిరమ్మా పాలనలో 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని అన్నారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో టింగ్ టింగ్ మంటూ వేసామని గుర్తు చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో మొదటి విడత గా 4లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చామని, మహబూబాబాద్ లో 4 వేల ఇందిరమ్మా ఇండ్లు మంజూరు చేశామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రాన్ని దివాలా తీసింది కాక కేటీఆర్ మమ్మల్ని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నిన్న రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం, ఈనెల 12 నుంచి డ్వాక్రా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాల పంపిణీ ఒక ఉత్సవంలా నిర్వహిస్తాం, ఆ తర్వాత నిరుద్యోగ యువత కోసం 8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ఉత్సవంలా చేపడుతామని అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రసంగించారు. ఈ దేశంలో అందరి గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, చేయి గుర్తును, ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం క్షేమంగా సంతోషంగా ఉండాలన్న ఆకాంక్షతో లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో లెక్క లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి రామ్ చంద్రు నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్స్ బృందం

**ఇంచార్జ్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలతో భేటీ**

**సీఎం ప్రజావాణి సమస్యల పరిష్కార వేదిక**

**ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమం : మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్స్**



హైదరాబాద్ (జనంసాక్షి) : జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణిని మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ బృందం సందర్శించింది. సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి పని తీరు చాలా బాగుందని, ఇలాంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నత అధికారులకు సిఫార్సు చెస్తామని డిప్యూటీ కలెక్టర్స్ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్స్ సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లతో భేటీ అయ్యారు. సీఎం ప్రజావాణి గురించి వారు డిప్యూటీ కలెక్టర్స్ కు వివరించారు. సీఎం ప్రజావాణి సమస్యల పరిష్కార వేదిక అని, ఇది ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమం అని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్స్ పేర్కొన్నారు.

## ఆవాజ్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయండి

**ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి అబ్బాస్**




గద్వాల (జనంసాక్షి) : ప్రజాస్వామ్యానికి మతసామరస్యానికి లౌకికవాదమే పునాదిగా ఉంటుందని, అలాంటి లౌకికవాదాన్ని రాజ్యాంగంలో లేకుండా చేయాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, ఐక్యంగా కుట్రలను బహిర్గతం చేయాలని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి.అబ్బాస్ పిలుపునిచ్చారు. ఆవాజ్ రాష్ట్ర మూడో మహాసభలు జయప్రదం కోరుతూ గద్వాల పట్టణంలోని హరిత హోటల్లో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ముస్లింలు, హిందువులు మొహరం కలిసిమెలిసి జరుపుకొంటూ దేశానికి లౌకిక సందేశం ఇస్తున్నారని అన్నారు. రాజ్యాంగంలో లౌకికవాదం, సోషలిజం అనే పదాలని తొలగించాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేయడం వారి కుటిల నీతికి అద్దం పడుతుందని అన్నారు. వేల సంవత్సరాలుగా భారత దేశంలో అనేక ధర్మాలను విశ్వసించే ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారని, బౌద్ధం, జైన, సిక్కు తదితర మతాలు ఇక్కడే పుట్టి ఇతర దేశాలకు విస్తరించాయని, ఇస్లాం, క్రిస్టియన్ మతాలను ఈ దేశ ప్రజలు ఆదరించారని అన్నారు. ప్రజలు తమకు నచ్చిన ధర్మాన్ని ఆచరించే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని, భారత ప్రభుత్వానికి ఏ మతం పట్ల గాని పక్షపాతం లేకుండా నిరపేక్షంగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశించిందని, ఆ రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ద్వారా దేశాన్ని మరింత పటిష్టంగా, సమైక్యంగా ముందుకు తీసుకపోగలుగుతామని అన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ, మత విద్వేషాలను నిత్యం రగిలించి, ఓట్లుగా మలుచుకుని అధికారాన్ని చేపట్టడానికి బిజెపి, సంఘ పరివార్ శక్తులు నిరంతరం ప్రజల మధ్య విభజన సృష్టిస్తున్నాయని విమర్శించారు.

## క్రీడాకారులకు ఉప్పల ఆర్థికసాయం



హైదరాబాద్ (జనంసాక్షి) : అండర్ 13 డబుల్స్ విభాగంలో నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన పొద్దుటూరి అన్య, వైభవ్ రమ్యను నాగోల్‌లోని ఉప్పల నివాసంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త సన్మానించారు. ఇద్దరికీ తలో 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను అభినందిం చారు. జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. క్రీడాకారులకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి హర్ష, క్రీడాకారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కెటిఆర్ డ్రామాలు కట్టిపెట్టాలి

**చర్చించాలంటే అసెంబ్లీకి రావాలి**

**దమ్ముంటే కెసిఆర్‌ను తీసుకుని రా**

**కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు**

హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) : కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కెటిఆర్ డ్రామాలు ఆడడం ఆపేయాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం అసెంబ్లీ వద్ద విలేకరుతో మాట్లాడారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మాట్లాడిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ముంటే కేసీఆర్‌ను తీసుకుని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ స్థాయికి తగ్గట్లుగా మాట్లాడాలని.. చిల్లర చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్ లెటర్ ఇస్తే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చినట్లే ఏక కాలంలో రైతు రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. కేటీఆర్‌వి చిల్లర ప్రయత్నాలు అని విమర్శించారు. కేటీఆర్‌ని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ చర్చించడానికి అసెంబ్లీ ఉందని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డిది పెద్ద స్థాయి అని ఉద్ఘాటించారు. కేటీఆర్‌కి దమ్ముంటే కేసీఆర్‌ని అసెంబ్లీకి తీసుకురావాలని సవాల్ విసిరారు. తమకి అనుకూలంగా రాస్తే అందరి మీడియా, వ్యతిరేకంగా రాస్తే ఆంధ్రా మీడియానా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి తెలంగాణ ఉద్యమానికి ఏం చేసిందో కేసీఆర్‌ని అడిగితే తెలుస్తోందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. తెలంగాణ మీ జాగీరా?. సాగరహారం జరుగుతుంటే ఎక్కడ ఉన్నారు. సాగరహారం జరిగిన రోజుల్లో మీ మొహాలు ఎక్కడున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వాళ్లం మేము. సారా అమ్ముతారు జై తెలంగాణ అంటారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తారు.. జై తెలంగాణ అంటారు. రేవంత్‌రెడ్డితో పోలిక పెట్టుకోవడానికి అర్హతే లేదు మీకు. నమ్మించి మోసం చేయడమే మీ అయ్య సంస్కృతి. ఆంధ్రా తెలంగాణ అంటూ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారు. వాళ్లకి అనుకూలంగా ఉంటే మంచి మీడియానా? లేకపోతే చెడ్డ మీడియానా?. బీఆర్ఎస్ పార్టీని మీ నలుగురు తప్పు.. ఎవరూ సపోర్ట్ చేయడం లేదు. కేసీఆర్‌కి రావడం చేతకాక బచ్చగాడిని పంపుతారా. మాకు సానుభూతి ఉంది కాబట్టే హాస్పిటల్‌కి వెళ్లి కేసీఆర్‌ని పరామర్శిస్తున్నాం. బావ, బామ్మర్దులతో పాటు చెల్లి ఇప్పుడు పోటీలోకి వచ్చింది. అందరూ కలిసినా రేవంత్‌ని ఏం చేయలేకపోయారు. పిచ్చిమాటలు మాట్లాడితే మా తడాఖా చూపిస్తాం. మొన్నటి ఎన్నికల్లో కేటీ-ఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు- వచ్చేవి' అని అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు.

## యూరియా కొరతతో రైతుల తీవ్ర ఆందోళన

**రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా తక్షణమే తగు చర్యలు చేపట్టాలి**

**తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి**



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఏర్పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తీవ్ర ఆందోళన చెందుతున్నారనీ, తక్షణమే యూరియా కొరత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కోటా నిర్దేశించినప్పటికీ అందులో ఇప్పటివరకు 3.06 లక్షల టన్నుల యూరియా మాత్రమే రాష్ట్రానికి సరఫరా అయిందని తెలిపారు. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపుగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనీ, రాష్ట్రంలో రైతులకు తీవ్రమైన ఎరువుల కొరత నెలకొన్నప్పటికీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో తీరిక లేకుండా నిమగ్నమై ఉన్నారనీ, ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియా లభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎరువుల దుకాణాలు, కో- ఆపరేటివ్ సొసైటీలు, సహకార సంఘాల కార్యాలయాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ యూరియా కోసం అల్లాడుతున్నారని శేర్ నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి యూరియా కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా కొరత లేకుండా తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఉప్పల నివాళి



రైతు బాంధవుడు, ప్రజాసంక్షేమ సారథి, మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి గాంధీ భవన్ లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాళులు అర్పించారు.

- హైదరాబాద్ (జనంసాక్షి)

## దేవుడి భూములు రక్షించే ఈవోలపై దాడి చేస్తే ఊరుకోం

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**భద్రాచలం ఈవో రమాదేవిపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి సురేఖ**



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎక్కడైనా రూల్స్ విరుద్ధంగా ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడుతామని, ఈ విషయంలో గతంలోనూ తాము స్పష్టం చేశామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై దాడి చేయడం సహేతుకం కాదని మంత్రి అన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కారం చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభ్యర్థించారు.

**బ్యాక్‌గ్రౌండ్ విషయం ఏంటీ?**

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామికి పురుషోత్తపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో తరచూ ఘర్షణ జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉంది. పురుషోత్తపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయి. వీటిని పురుషోత్తపట్నం వాసులు పరిగణనలోకి తీసుకోవటం లేదు. పురుషోత్తపట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని, ఇది పూర్తిగా రాముడి భూమి అని వివరించారు. కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే, ఈవో అభ్యంతరాలు వినకుండా... స్థానికులు ఈవోపై దాడి చేశారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయిన పరిస్థితి నెలకొంది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
9 జూలై 2025
తెలంగాణ

# జాతీయ బ్యాంకుల్ని రక్షించుకోవాలి



**జులై 9న భారతదేశంలోని ట్రేడ్ యూనియన్లు సమ్మె చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, లేబర్ కోడ్‌లో శ్రామికులకు వ్యతిరేకమైన మార్పులకు వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ కోణంలో దేశంలోని జాతీయ బ్యాంకులు ప్రజల నుండి ఎలా దూరం అవుతున్నాయో ఒకసారి చూద్దాం.**

జాతీయ బ్యాంకులు గతంలో ప్రజల మేలు కోసం వచ్చాయని మనకు చెప్పారు. ప్రజలకు అవసరమైన విభిన్న రకాల రుణాలు ప్రైవేట్ బ్యాంకులు కంటే ఈ బ్యాంకులే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తూ ఇవ్వడం ఆరంభించాయి.

అలా పోల్చి చూస్తే ఈ బ్యాంకులు భారత పౌరులకు అందించిన సేవ నిజంగానే గుర్తించదగ్గది. గ్రామీణ ప్రాంతాల్లో మూల మూలల్లోకి ఈ రుణాలు అందాయి. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ఈ బ్యాంకుల ద్వారానే విజయవంతంగా ముందుకు నడిచాయి. విమర్శలు ఎన్నో ఉన్నాయి. అయినా సరే ప్రజా ప్రయోజనం కూడా ఉంది. కథ ఇలానే ముందుకు సాగితే మనం ఈ విషయం మీద ఆందోళన వ్యక్తం చెయ్యాల్సిన అవసరం లేదు. కానీ, ప్రపంచీకరణ నేపథ్యంలో బ్యాంకుల పనితీరు మీద ప్రభావం పడింది. జాతీయ బ్యాంకులు ప్రజా ప్రయోజనాన్ని మెల్లమెల్లగా పక్కకు జరిపేస్తూ మార్కెటీకరణ వైపు పయనం సాగించాయి. బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ విషయం అర్థం అవ్వక తప్పదు.

అభివృద్ధి జరగలేదని అనలేం. గతంలో ఓ వెయ్యి రూపాయలు డిపాజిట్ లేదా విత్ డ్రా చేయడానికి గంటలు గంటలు మనం క్యూలో నిలబడాల్సి పడేది. చిన్న చిన్న పనులు కోసం, చిన్న చిన్న ట్రాంజాక్షన్ల కోసం గంటలు గంటలు ఒక్కొక్క డెస్క్ చుట్టూ తిరగాల్సి పడేది. అది కూడా ఒక్క రోజులో అయ్యేది కాదు. ఆ తలనొప్పి ఈ రోజు లేదు. ఇదో మంచి పరిణామం. అలానే రుణా లు కూడా సాధారణ ప్రజలకు మధ్యతరగతికి బ్యాంకులో ఇవ్వడం లో విపరీతమైన ఇబ్బందులు ఎదురయ్యేవి. సవాలక్ష కాగితాలు పట్టుకొని బ్యాంకుల చుట్టూ తిరగాల్సి పడేది అయినా పని జరుగుతుందో లేదో తెలియని విషమ పరిస్థితి. ఈరోజు ఆ పరిస్థితి లేదు. మనం ఇంట్లోనే కూర్చున్నా మన పేపర్లు సరిగ్గా ఉంటే మన లోన్ శాంక్షన్ అయిపోతుంది. ఇదో మంచి పరిణామం. అలానే విత్డ్రావల్ కోసం ఏటీఎం కౌంటర్లు పెరిగాయి. వాటి విస్తరణ కూడా గ్రామీణ ప్రాంతాల వైపు కూడా సాగింది. డబ్బులు విత్ డ్రా చేయడం గతంలో కంటే మరింత సులభం అయింది. అలానే డిజిటల్ ఇండియా అంటూ మరి కొంచెం ముందుకు నడిచి ఫోన్ పేలు, గూగుల్ పేలు లాంటివి వచ్చి సాధారణ ప్రజలు, మధ్య తరగతి, ముఖ్యంగా చదువుకున్న వారి పని మరింత సులభం అయింది ఇదో మంచి పరిణామం అనే చెప్పాలి.

అయితే, కాలక్రమంలో ఏం జరిగిందీ అంటే మొదట అలవాటు చేసిన సేవలు, ఉచితంగా ఇస్తామన్న ఈ సేవలు మెల్లమెల్లగా ఫీజుల్లోకి మారాయి. ఏటీఎంలు ఆరంభమైన కొత్తలో ఎన్ని ట్రాన్జక్షన్లైనా చెయ్యొచ్చు అనే నిబంధన ఆ తర్వాత మారి ఫలానా ఇన్ని ట్రెంజక్షన్లు మాత్రమే చేయాలి అని కొత్త కొత్త నిబంధనలు వచ్చాయి. సొంత బ్యాంకు అయితే ఒక నియమం. మరో బ్యాంకు కార్డు అయితే మరో నియమం. బ్యాలెన్స్ చూసినా సరే అది కూడా ఒక ట్రాన్జక్షన్ గా లెక్కించేసి కొనుగోలుదారుడికి ఇబ్బంది కలిగించడం జరిగింది. ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. చాలామంది కస్టమర్లు బ్యాంకులు చుట్టూ తిరగడం తమ డబ్బులు ఎందుకు డిడక్ట్ అయ్యాయి అని అడగడం, తమకు తెలియని కొత్త కొత్త నిబంధనలు వారు అక్కడ తెలియజేయడం జరిగింది . ఈ తలనొప్పి ఎందుకు? నేరుగా బ్యాంక్‌కి వెళ్లి డబ్బులు విత్ డ్రా చేసుకుందాం అని కస్టమర్ అనుకునేసరికి బ్యాంకుల పరిస్థితి మరోలా మారిపోయింది. ఏటీఎంలు అనూహ్యంగా పెంచడం వలన ప్రభుత్వానికి మంచి అవకాశం దొరికింది. ఇదే అదనుగా ఇంతమంది స్టాఫ్ ఈ బ్యాంకు బ్రాంచ్‌లో ఎందుకు అవసరం? ప్రతి ఒక్కరూ బయట ఏటీఎంలో డబ్బులు తీసుకున్నప్పుడు ఇక ఎక్కువ స్టాఫ్ యొక్క అవసరం ఎందుకు ఉంటుంది? అని స్టాఫ్ ని తగ్గించడం కొనసాగింది. బ్యాంకు యూనియన్లు చాలాసార్లు ఈ విషయం మీద పోరాటం కూడా జరుపుతున్నారు.తగ్గిపోయిన స్టాఫ్ తో, విపరీతమైన పని ప్రెషర్ తో అటు బ్యాంకు స్టాఫ్ కి కూడా తీరిక లేదు. శాంతి లేదు. ఇటు బ్యాంకు కస్టమర్ కూడా తీరిక లేదు. శాంతి లేదు . మరి ప్రయోజనం పొందేదీ ఎవరు ? మరలా ఇక్కడ కూడా వేలకోట్ల రూపాయలు రుణాలు తీసుకుని ఏమాత్రం చెల్లించకుండా లేదా ఎంత చెల్లించాలో అంత చెల్లించకుండా ఉడాయించేసే నీరవ్ మోదీ లాంటివారు చాలా సుఖాలు అనుభవించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ అన్నది మనకు తెలిసిందే. మధ్య తరగతికి రుణాలు ఇస్తే బ్యాంకులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. చెల్లించకపోతే ఫైన్లతో వివిధ రకాల రకాలుగా విసిగిస్తాయి. కానీ, వేలకోట్ల రూపాయల రుణం సునాయాసంగా తీసుకున్న కార్పొరేట్లు ప్రజాధనాన్ని హాయిగా ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అటు రాజకీయ నాయకులకూ, ఇటు కార్పొరేట్లకూ కాసుల వర్షం కురిపించింది.


ఒక సాధారణ కస్టమర్ మీద వివిధ రకాల చార్జీలు వేస్తారు. ఏటీఎం కార్డు ఇస్తే ఆ కార్డు వాడకం మీద చార్జ్ ఉంటుంది. ఆ కార్డుతో విత్ డ్రా చేసేటప్పుడు ట్రాన్జక్షన్లు పెరిగిపోతే వాటి మీద చార్జి ఉంటుంది. దీనికి తోడు బ్యాంకులకు కూడా అర్థం కాని ఫ్రాడ్లు పక్కనే ఉన్నాయి. బ్యాంకులో భవిష్యత్తులో పనికొస్తుందని దాచుకున్న కాస్తంత సేవింగ్ డబ్బులు కూడా కాజేయడానికి స్కామర్స్ సిద్ధంగా ఉన్నారు. కస్టమర్ల యొక్క వివరాలు వీరు సేకరించి వేళ్ళ లక్షలు కోట్లు కాజేస్తున్నారు. ఈ విషయంలో కూడా బ్యాంకులు తమ కస్టమర్లకు చిన్న చిన్న ప్రకటనలు తప్ప ఈ స్కామ్ లను ఆపే దిశలో కస్టమర్లకు సంతృప్తిని కలిగించడం లేదు కస్టమర్లు ఎల్లప్పుడూ ఒక రకమైన ఆందోళనలు ఉండే పరిస్థితి ఏర్పడింది దీనికి కారణం కూడా మళ్ళీ కస్టమర్ల మీదనే వేసేసే ప్రయత్నం కొనసాగుతోంది.

డిజిటల్ ఇండియా అనేది ప్రపంచీకరణ తర్వాత వచ్చిన ఒక మంచి ఆర్థిక విధానం. ఇందులో ప్రతి ఒక్క సేవ కూడా మార్కెటీకరణ వైపుకే పయనించాలన్నది ప్రపంచీకరణ సూత్రం. సేవలు ఏవీ కూడా ఉచితంగా దొరకవు. గతంలో సాధారణ మనిషి బ్యాంకు కౌంటర్ ముందు నెలలో 30 సార్లు వెళ్ళినట్లయితే 30 సార్లు కూడా విత్డ్రా చేసుకునే అవకాశం ఉచితంగా ఉండేది.

కానీ ప్రతి సేవ కూడా నేడు అలవాటు చేశారు. తర్వాత దానిపై రేటు వేశారు. ఏటీఎం కార్డు అంటే తెలియని ఒక సాధారణ వ్యక్తికి కూడా అందమైన, ముచ్చటైన ఏటీఎం కార్డు చేతిలో పెట్టారు. కార్డు మీద చార్జ్. కార్డు వాడితే చార్జి. కార్డు ఎక్కువ వాడితే చార్జి. కార్డు మరో బ్యాంకులో వాడితే మళ్ళీ ఛార్జ్. కార్డు వివరాలు స్కామర్లకు అందిపోతే మరలా డిపాజిట్ డబ్బులు స్వాహా. ఈ కొత్త ప్రపంచం అర్థం కాని సాదాసీదా ప్రజలకు ఆందోళనకరమైన కొత్త జీవితం. ఇంట్లోనూ డబ్బులు ఉంచడానికి భయం బ్యాంకుల్లోనూ డబ్బులు ఉంచడానికి భయం. మరి అభివృద్ధి ఏ విషయంలో జరిగిందో అర్థం కాని బ్రహ్మ పదార్థం నేడు కనిపిస్తుంది.

దీంతోపాటు బ్యాంకుల్లోనే కూర్చున్న ఉద్యోగులు బ్యాంకు ఉద్యోగంతో పాటు ఇతర క్రెడిట్ కార్డుల సేవలు కూడా అమ్మేలా వారిని ప్రలోభ పెట్టే ప్రయత్నం కూడా ఈ ప్రపంచీకరణ తర్వాతే కొనసాగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎస్బిఐ క్రెడిట్ కార్డులు అలానే ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అమ్మకాలు చేర్చారు. బ్యాంక్ అనేది పూర్తిగా ఒక ప్రభుత్వ సంస్థ. ఈ క్రెడిట్ కార్డులు లైఫ్ ఇన్సూరెన్సు అనేవి పూర్తిగా ప్రైవేటు సంస్థలకు సంబంధించిన సేవలు. రెండింటినీ కలగా పులగం చేసేసి కస్టమర్ పూర్తిగా అర్థం చేసుకున్నంత లోనే పూర్తిగా కన్ఫ్యూజ్ పరిస్థితి ఏర్పరచారు. బ్యాంకు ఉద్యోగులకు టార్గెట్స్.ఇతర బ్యాంకులలో కూడా మరో రకం లైఫ్ ఇన్సూరెన్స్ సేవలు కలిపారు. ఇలా చూస్తే బ్యాంకు ఉద్యోగులు తమ చైర్లలో కూర్చుంటూ తమ బ్యాంకు పనులు కంటే ఈ ప్రైవేట్ ఇన్సూరెన్స్ ప్రోడక్టులు అమ్మడంలోనే ఉత్సాహం చూపేలా వారికి టార్గెట్లు ఇచ్చారు. లేదా ప్రలోభ పెట్టారు. పర్సంటేజ్ ల ఆశతో నేడు చాలా బ్యాంకుల ఉద్యోగులు తమ దగ్గరకు వచ్చిన కస్టమర్లతో ప్రోడక్టులు అమ్మడంలో చూపించిన ఉత్సాహం, బ్యాంకింగ్ కి సంబంధించిన ఇతర పనుల్లో చూపిస్తున్నారా అన్న ప్రశ్న కూడా మనకు చాలా సార్లు వస్తుంది. రిటైర్మెంట్ డబ్బులు కూడా బ్యాంకులో డిపాజిట్ చేస్తాను అన్న తెలిసి తెలియని ఒక సాధారణ వ్యక్తికి కూడా మభ్యపెట్టి ఎక్కువ డబ్బులు వస్తాయని వివిధ రకాల ప్రైవేట్ ప్రోడక్టులలో ఆ డబ్బులు డిపాజిట్ చేయించే ప్రయత్నం కూడా కొనసాగుతుందని మనం వింటుంటాం.

ఇదంతా చూస్తే మొత్తం బ్యాంకింగ్ విధానం ఎటువైపు పోతుంది అన్న ప్రశ్న వస్తుంది . సాధారణ మనిషి కోసం మాత్రమే జాతీయం చేయబడిన బ్యాంకులు ఈరోజు సాధారణ మనిషి మేలు కోసం ఎంతవరకు ఆలోచిస్తున్నాయి అనే ప్రశ్న వస్తుంది . వేల కోట్ల రూపాయల ఎన్పీఏలు తిరిగి రావడం లేదు. అవి రైట్ అప్ చేసేస్తున్నారు. అలా రైటాఫ్ చేసేయడం ద్వారా బ్యాలెన్స్ సీట్లు సరిగా చేసుకోవడమే తప్ప సాధారణ మనిషికి వచ్చే ప్రయోజనం ఏదీ లేదు. కార్పొరేట్లకు మాత్రమే అది ప్రయోజనమే. రైతు పంటలు పండక అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నా సరే బ్యాంకులు వెళ్లి ఆ రైతుపై అత్యాచారం చేసే సంఘటనలు మనం ఎన్ని వినలేదు? కాబట్టి బ్యాంకుల దారి మరోసారి పర్యవేక్షించడం అవసరం. సాధారణ మనిషి కోసం కాస్తంత బ్యాంకులు ఆలోచించే దిశలో పరిపాలన వ్యవస్థ ముందుకు నడవడం అవసరం. ఇప్పుడు ఉచితంగా ఇస్తున్న యూపీఐ సేవలు కూడా భవిష్యత్తులో మరింత భయంకరంగా మారిపోకుండా చూడాల్సిన అవసరం కూడా ఉంది అర్ధరాత్రి యూపీఐటి ఇంజక్షన్ చేస్తే ఉచితం మధ్యాహ్నం చేస్తే 150 రూపాయలు ఉదయం చేస్తే 250 రూపాయలు అని చార్జీలు విమానాల చార్జీల్లాగా భవిష్యత్తులో రాకుండా మార్కెటీకరణను అడ్డుకోవడం కూడా అవసరం. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజల మేలు కోసం ఆలోచించేలా బ్యాంకింగ్ వ్యవస్థను దారి మరల్చడం కూడా అవసరం.



**కేశవ్**
ఆర్థిక సామాజిక విశ్లేషకులు



## కేటీఆర్ ఇక సీటీఆరే కాదు వీటీఆర్ కూడా!

ఇప్పటికే కాలాతీతమైన గ్రామీణ ప్రాంతాల "స్థానిక" ఎన్నికలు కాచుక్కూర్చున్నాయి. సిటింగ్ ఎమ్మెల్యే ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ లో బైపోల్ దినం వెనకా ముందూ తప్పదు. అంటే ఓవరాల్ గా అటు విలేజ్, ఇటు సిటీ రెండింటా ఎలక్షన్లు పొంచి ఉన్నాయి. అర్బన్, రూరల్ అనే భేదం లేకుండా మరోవంక ఈ మధ్య చడీచప్పుడూ లేని ఫిరాయింపు శాసనసభ్యుల భవితవ్యం మేరకు ఆయా సీట్లలో ఉప ఎన్నికల సంగతి ఉండనే ఉన్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ కాంగ్రెస్ అధి నాయకత్వం హైదరాబాద్ కేంద్రంగా కదలికలు ముమ్మరం చేస్తోంది.

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ జులై 4న రోజంతా పార్టీ కార్యక్రమాల్లో తలమునకలయ్యారు. పార్టీ పరంగా గ్రామ శాఖ అధ్యక్షులు మొదలు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దాకా, ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు టోటల్ కాంగ్రెస్ అటెన్షన్ అయింది. మధ్యలో అలకలు, బుజ్జగింపుల తంతూ నమోదైంది. దీనికి అంతటికీ ఇపుడున్న ఎన్నికలే అసలు మోటో. సమీప ఎన్నికల్లో రూలింగ్ పార్టీ కాంగ్రెస్ గెలిచినా, ఓడినా చూసే విధంగా ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితిని గెలుపోటముల్లో ఎందుకో చూడరు. గెలిస్తే మెచ్చుకోలు ఏమో కానీ, ఓటమి చెందితే మాత్రం ఫినిష్ అనేందుకు రెడీగా ఉంటారు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ విజయం సాధిస్తే, ఏముందిలే సిటింగ్ స్థానమే కదా అంటారు. ఒకవేళ పరాజయం పాలైతే చూశారా! సిటీలోనూ ప్రతికూలతే అని దెప్పి పొడుస్తారు. మధ్యలో బీజేపీ కథే వేరు. ఏమైనా అంటే.. వచ్చేది తమ ప్రభుత్వమేనంటూ కనీసం లాజికల్ బేస్ లేకుండా ఆ పార్టీ ఫక్తు గాంభీర్యం ప్రదర్శిస్తుంటుంది. లోకల్ బాడీ ఎలక్షన్లు, అసెంబ్లీ బైపోల్స్ గురించి కమలం పార్టీ ఆ రెండు పార్టీల్లో స్పార్క్ మాత్రం రాజేస్తుంది. బీజేపీ రాష్ట్ర శాఖ కొత్త అధ్యక్షులుగా ఎన్.రాంచందర్ రావు కొలువు దీరాక ఈ ఎన్నికలు ఆగమిస్తుండడం ఆ పార్టీలో ఆసక్తికరమే. ఎటొచ్చీ భారత రాష్ట్ర సమితికే అసలైన పరీక్ష. ఆ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ డైరెక్షన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ కార్యకలాపాలను చక్కబెడుతున్నారు. ఎలాగూ హైదరాబాద్ లో ఆయనకు పట్టు ఉంది. అందుకే కేటీఆర్ ఎపుడో సీటీఆర్ (సి-సిటీ) అయ్యారు. అంతే పట్టు రూరల్ లో నిరూపించుకోవలసిన అవసరం "స్థానిక" ఎన్నికలతో ఏర్పడుతోంది. అంటే, వీటీఆర్(వి-విలేజ్)గానూ ఆథరైజ్ కు సంసిద్ధులు అవుతున్నారు. అర్బన్ లోనే కాదు, రూరల్ లోనూ తన నాయకత్వానికి తిరుగులేని ఆమోదం ఉందని రుజువు చేసుకునే సమయం, సందర్భం వస్తోంది. అందుకే కాబోలు తనలో సమకాలీన మార్పులు ధ్వనిస్తున్నాయి.


### యూకే సదస్సు సందేశంలో స్పష్టం

కేసీఆర్‌ను చూస్తే వ్యవసాయం గుర్తుకు వస్తుంది. కేటీఆర్‌ను చూస్తే ఐటీ ఇండస్ట్రీ మదిలో మెదులుతుంది. చదువు, ఉద్యోగం పరంగానూ ఆ సెక్టారులో విషయ పరిజ్ఞానం కేటీఆర్ కు చాలా కలిసొచ్చింది. కాబట్టే ఆ రంగానికి ఐకాన్ గా సుప్రసిద్ధులయ్యారు. రాష్ట్రంలో అధికారంతో నిమిత్తం లేకుండా దేశ విదేశాల్లో యువ నేత సందేశాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా యూకే సదస్సుకు హాజరయ్యారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరం నిర్వహించిన సదస్సులో జూన్ 21న కీలకోపన్యాసం చేశారు. "గవర్నింగ్ ఇన్నోవేషన్-ఏ తెలంగాణ కేస్ స్టడీ" అంశంపై తీక్షణమైన సందేశం ఇచ్చారు. తెలంగాణకు ముఖ్యమంత్రి అయితే, మీ ప్రాధమ్యాలు ఏమిటన్న ప్రశ్నకు కేటీఆర్ ఇచ్చిన జవాబు ఆసక్తి రేపుతోంది. మామూలుగానైతే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ప్రియారిటీ గురించి చెప్తారని ఊహిస్తాం. కానీ ఆయన వ్యవసాయానికే తొలి ప్రాధాన్యతంటూ తేల్చి చెప్పడంలో నాన్న కేసీఆర్ ప్రేరణ నరనరాన పుణికిపుచ్చు కుంటున్నారని విదేశీ వేదికగా రుజువైంది. విద్య, వైద్యం, సంక్షేమాల్లో మానవీయతను అనుసరిస్తామని తెలిపారు. ప్రపంచంలోనే భారీ ఎత్తిపోతల పథకం కాళేశ్వరాన్ని ఉటంకిస్తూ, నీటి సౌలభ్యంపై కచ్చితమైన తమ విధానాన్ని విశదీకరించారు. భారత్ లో 65 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీదే ఆధారపడ్డారని ప్రస్తావించారు. పాడి పంటలు బాగుంటేనే అన్ని రంగాలు, అందరూ బాగుంటారనే సూక్ష్మాన్ని తదేక దృష్టితో స్పృశించారు. రైతు బంధు, రైతు బీమా వంటి కేసీఆర్ మానస పుత్రికలు విశ్వ ఖ్యాతి గడించడాన్ని జ్ఞాపకం చేశారు.

సమైక్య పాలన అంతాన 2014లో ధాన్యం దిగుబడుల్లో 14 వ స్థానంలో ఉన్న తెలంగాణ 2022కల్లా పంజాబ్, హరియాణాలను దాటి నంబర్ వన్ కు చేరడంలో వ్యవసాయానికి తమ ప్రభుత్వం ఇచ్చిన అత్యంత ప్రాధాన్యమే కారణమని గణాంకాలతో కేటీఆర్ విశ్లేషించారు. అమెరికా ఐటీలో టాప్ ఉద్యోగాన్ని 16 ఏళ్ల క్రితం త్యజించి, తెలంగాణ పోరాటంలో మమేకం అయిన కేటీఆర్ అగ్రికల్చర్ మీద తన తండ్రి మాదిరే నజర్ పెడుతున్నారు.అందుకే భవిష్యత్తులో మళ్లీ తమ ప్రభుత్వంలో ఉండబోయే ప్రాధాన్యతల్లో వ్యవసాయాన్ని ముందు వరుసలో ఉంచడానికే మొగ్గుతున్నారు.

కేటీఆర్ ను "సిటీ'జనులు ఓన్ చేసుకొనేంతగా, పల్లెటూళ్ళు సొంతం చేసుకోవనే అబ్జర్వేషన్ ఏదో మూలన ఉనికిలో ఉన్నది. ఆ భావనను బలపరిచేలా, ముఖ్యంగా కేటీఆర్ నాయకత్వాన్ని చూసే రాజధాని హైదరాబాద్ సహా శివారు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలను కడపటి ఎన్నికల్లో గెలుచుకొంది. గ్రేటర్ పరిధిలోని 24 సెగ్మెంట్లలో ఎంఐఎంకు పోనూ మిగతావన్నీ కారు ఖాతాలోనే పడ్డాయి. కాంగ్రెస్ మాత్రం అపుడు అమాంతం బోసిపోయింది. రూరల్ లో హస్తానికి, సిటీలో గులాబీకిభిన్న రీతిలో స్పష్టమైన ఆధిక్యం నమోదైంది. ఆ పరిణామమే బీఆర్ఎస్ కు హ్యాట్రిక్ ను మిస్ చేసింది. తెలంగాణలో జన్మలో అధికారంలోకి వస్తుందో, లేదో? అనే దౌట్లను కాంగ్రెస్ పటాపంచలు చేస్తూ, అధికారంలోకి వచ్చింది. కేటీఆర్‌ను కేవలం నగర ప్రజలే ఆదరిస్తున్నారని సర్టిఫికెట్ ఇస్తే అది అసంబద్ధమే కాగలదు. ఎందుకంటే, కంప్లీట్ గ్రామీణ, మారుమూల ప్రాంతమైన సిరిసిల్ల నియోజకవర్గంలోనే కేటీఆర్ ఏకంగా అయిదుసార్లు వరుసగా విజయం సాధించారు. ఉద్యమ కాలంలో 2006లో మొదలైన తన రాజకీయ ప్రస్థానంలో తొలిసారి 2009లో పోటీ చేసింది మొదలు 2023 ఎలక్షన్ల వరకూ తనను గెలుపు వీడలేదు. ఓటమి పరిచయం కాలేదు. కానీ ఎక్కడో గట్టిగా పట్టుకోలేనంతగా సిటీతో పోల్చితే రూరల్ తో కేటీఆర్ కు ఓటు బ్యాంకు, గ్రిప్ పరంగా కొద్దోగొప్పో గ్యాప్ ఉంది. బహుశా తాను ఇది అంగీకరించకపోయినా...నగరాలకు సమానంగా పల్లెల్లోనూ ఆదరణ కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు రచిస్తున్నట్టున్నారు. తనలో సమకాలీన మార్పునకు సంకేతం ఇస్తున్నారు. కేటీఆర్ అంటే సీటీఆరే కాదు, వీటీఆర్ కూడా(సి-సిటీ, వి-విలేజ్)అని యూకే వేదికగా తెలంగాణ సమాజానికి మెసేజ్ ఇచ్చినట్లు విదితం అవుతోంది. నాన్న కేసీఆర్ గారి అడుగుజాడలతో అల్లుకుపోయేలా కేటీఆర్ ఆసక్తి చూపుతున్నారు

**-ఇల్లెందుల దుర్గాప్రసాద్**
వ్యాసకర్త, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు
హైదరాబాద్, 9440850384



## ఆధునిక అనాగరికుడు

మారిపోతున్నావ్ ఓ మనిషి
మరలిపోతున్నావ్
మృగమానవ మూలాలకు చేరువవుతున్నావ్
కరుణ తగ్గిన హృదయ శిలపై
స్వార్థ ఉలితో
జీవ శూన్యపు చరిత లిపిగ రాతియుగమైపు
బుద్ధి పెరగని వింతపశువులా
రంకెలేస్తున్నావ్
బ్రతుకు గెలుపుకై నీతి మరచి
సమర్థింపు శూలంతో
నిధుల వేటలో నీచమనిషిగా నిన్ను నువ్వే
ఓడిపోతున్నావ్
సంద్రమంత సమాజంలో
పలకరింపుల తీరమెరుగక
ఒంటరైన ఓటి నావలా
శోక సుడిలో మునిగిపోతున్నావ్
వంద ఏళ్ల జీవదాహంతో
ఆస్తులన్నీ వడిసిపడుతూ
అర్థాంతర అనర్థాలకు ఎండమావిలా
మాయమవుతున్నవ్
మనిషి మనుగడ విలువలన్నీ
నేటి రోజున హాస్యమంటూ
మూత పడబోయే మానవ పరిశ్రమలో
క్రొత్త యంత్రంగా
మారబోతున్నావ్
మారిపోతున్నావ్ ఓ మనిషి మరలి
పోతున్నావ్
ఆధునిక అనాగరికుడిగా మిగలబోతున్నావ్.



**నేపా సంతోష్ అచ్యుత్ కుమార్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత
8639442397

## అమృతోత్సవం!



అప్పుడు
దేవతలు
రాక్షసులు!
ఇప్పుడు
కార్పొరేట్లు
ప్రజలు!
ప్రజలంటే
శ్రమజీవులు
బుద్ధిజీవులు!
దేవదానవులు
సముద్రమథనంచేసి
అమృతం తీశారు!
ప్రజలు
దేశ మథనం చేసి
సంపదలు తీశారు!
అమృతం పంపకం
రాజకీయం చేసి
దేవతలు కొట్టేసారు!
సంపద పంపకం
రాజకీయం చేసి
కార్పొరేట్లుకొట్టేసారు!
అక్కడ
త్రిమూర్తులు
సూత్రధారులు!
ఇక్కడ
నాయకులు
సూత్రధారులు!
నా దేశం ఎప్పుడూ
పరాన్నభుక్కుల
అమృతోత్సవం!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## వచన సోయగాలు



శిల్పంలో వచనం అక్షర నర్తన తాండవం
భావోద్వేగాల లయ బద్ధ శబ్ద విన్యాసం
జీవిత సత్య నిత్యాల నృత్యాల చిత్రం
పదాలు కడిగిన ఆణి ముత్యాల రూపం
ప్రాస శ్వాసలతో ఉట్టిపడే జీవం
వాక్య నిర్మాణం కవిత స్పర్శతో సుగంధం
అలంకారాలు నెల వంక ఆర బోసే అందాలు
ఉపమానాలు ప్రకృతికి పట్టిన అద్దాలు
ఆలోచనలు రేకెత్తించే శైలి
పాఠకులను ఆకర్షించే విశాలి

**పూసాల సత్యనారాయణ**
హైదరాబాద్, 9000792400

## "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం: పరిమితులు, పేదలపై ప్రభావం"

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీనరేగా),2005లో భారత ప్రభుత్వం ద్వారా అమలులోకి తెచ్చిన ఒక ప్రముఖ సామాజిక భద్రతా పథకం. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి భద్రతను పెంపొందించడానికి, పేదలకు కనీసం 100 రోజుల ఉపాధిని హామీ ఇవ్వడానికి రూపొందించబడింది. ఈ చట్టం నైపుణ్యం లేని మాన్యువల్ పనుల ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడుతుంది. అయితే, ఈ పథకంపై కేంద్ర ప్రభుత్వం విధించిన కొన్ని పరిమితులు పేదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త జీన్ డ్రెజ్ అభిప్రాయపడ్డారు. ఆయన మాటల్లో, "ఉపాధి ఆదాయం కోసం మాత్రమే కాదు, అది మానవ గౌరవానికి సంబంధించినది." ఈ వ్యాసం (ఎంజీనరేగా) పరిమితులను, పేదలపై వాటి ప్రభావాన్ని, మరియు డ్రెజ్ యొక్క వ్యాఖ్యలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.

### ఎంజీనరేగా...యొక్క పరిమితులు:

(ఎంజీనరేగా) యొక్క అమలులో అనేక పరిమితులు ఉన్నాయి. ఇవి దాని లక్ష్యాల సాధనను అడ్డుకుంటున్నాయి. మొదట, ఈ పథకం కింద నిధుల కేటాయింపు తగినంతగా లేకపోవడం ఒక ప్రధాన సమస్య. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, (ఎంజీనరేగా) కోసం కేటాయించిన బడ్జెట్ కేవలం రూ. 60,000 కోట్లు మాత్రమే. ఇది గత సంవత్సరాలతో పోలిస్తే తక్కువ. ఈ నిధుల కొరత వల్ల ఉపాధి డిమాండ్‌ను తీర్చడంలో ఆలస్యం జరుగుతోంది.అలాగే కొన్ని సందర్భాల్లో వేతనాల చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. ఉదాహరణకు, 2022లో, దాదాపు 20 శాతం కార్మికులు 15 రోజులలోపు వేతనాలు పొందలేదని ఒక నివేదిక తెలిపింది.

రెండవది, అవినీతి పేరుకపోవటం పారదర్శకత లేకపోవటం (ఎంజీనరేగా) అమలులో మరో పెద్ద సమస్య. గ్రామీణ పంచాయతీల వద్ద జాబ్ కార్డుల జారీలో అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫేక్ ఉపాధి రికార్డులు, మరియు నిధుల దుర్వినియోగం వంటి సమస్యలు తరచూ నివేదించబడ్డాయి. హిందూ పత్రికలో పి. సాయినాథ్ రాసిన ఒక వ్యాసం ప్రకారం, కొన్ని రాష్ట్రాల్లో అవినీతి కారణంగా ఈ పథకం యొక్క ప్రయోజనాలు పేదలకు పూర్తిగా చేరడం లేదు. మూడవది, కేంద్ర ప్రభుత్వం విధించిన ఆధార్-ఆధారిత చెల్లింపు విధానం మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడటం గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అవగాహన లేని కార్మికులకు సవాలుగా మారింది. ఆధార్ కార్డు లేని లేదా బ్యాంకు ఖాతాలతో లింక్ చేయని కార్మికులు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు.ఈ పరిమితులు (ఎంజీనరేగా) యొక్క సమర్థతను తగ్గిస్తున్నాయి.



### పేదలపై ప్రభావం:

(ఎంజీనరేగా)యొక్క ఈ పరిమితులు గ్రామీణ పేదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పథకం ప్రాథమికంగా దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల కొనుగోలు శక్తిని పెంచడానికి రూపొందించబడింది. అయినప్పటికీ, నిధుల కొరతతో పాటు వేతనాలు ఇవ్వడం లో విపరీతమైన ఆలస్యం కారణంగా చాలా మంది కార్మికులు ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు, 2021-22లో, దాదాపు 1.5 కోటి కుటుంబాలు 100 రోజుల ఉపాధిని పొందలేదని ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ ఆర్థిక అస్థిరత గ్రామీణ కార్మికులను పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళేందుకు బలవంతం చేస్తోంది. ఇది (ఎంజీనరేగా) యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటైన వలసలను తగ్గించడం అనే లక్ష్యానికి విరుద్ధంగా ఉంది.

మహిళలు, దళితుల వంటి అట్టడుగు వర్గాలు ఈ పరిమితుల వల్ల మరింత నష్టపోతున్నారు. (ఎంజీనరేగా) మహిళలకు కనీసం 50 శాతం ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, చాలా ప్రాంతాల్లో ఈ లక్ష్యం సాధించటం జరగ లేదు. అదనంగా, దళితుల భూముల్లో పనులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సామాజిక మార్పులు కొంతమేరకు జరుగుతున్నప్పటికీ, అవినీతి, అలాగే స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ ప్రయోజనాలు అందరికీ సమానంగా చేరడం లేదు.

### జీన్ డ్రెజ్ యొక్క వ్యాఖ్య- మానవ గౌరవం:

జీన్ డ్రెజ్ అనే ప్రముఖ ఆర్థికవేత్త యొక్క వ్యాఖ్యను పరిశీలిస్తే, "ఉపాధి ఆదాయం కోసం మాత్రమే కాదు, అది మానవ గౌరవానికి సంబంధించినది," (ఎంజీనరేగా) యొక్క సామాజిక ప్రాముఖ్యతను లోతుగా తెలియజేస్తుంది. ఈ పథకం కేవలం ఆర్థిక లాభాల కోసం మాత్రమే కాకుండా, గ్రామీణ పేదలకు ఆత్మగౌరవాన్ని, సామాజిక సమానత్వాన్ని అందించడానికి రూపొందించబడింది. ఉపాధి అవకాశాల ద్వారా, ఈ పథకం కార్మికులకు తమ కుటుంబాలను స్వయం సమృద్ధిగా నిలబెట్టుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. డ్రెజ్ యొక్క ఈ వ్యాఖ్య మహాత్మా గాంధీ యొక్క "శ్రమకు గౌరవం ఇవ్వడం" (డిగ్నిటీ ఆఫ్ లేబర్) అనే సిద్ధాంతంతో సమన్వయం కలిగి ఉంది.

అయితే, ప్రస్తుత పరిమితులు ఈ గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. వేతనాల ఆలస్యం మరియు ఉపాధి అవకాశాల కొరత కార్మికులలో నిరాశను, అవమానాన్ని కలిగిస్తున్నాయి. డ్రెజ్ సూచించినట్లుగా, (ఎంజీనరేగా)ను కేవలం ఆర్థిక సాధనంగా కాకుండా, సామాజిక న్యాయం మరియు మానవ గౌరవాన్ని పెంపొందించే ఒక వేదికగా భావించాలి. ఈ దృక్పథంలో, ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలి.


### ఆర్థిక నిపుణుల సూచనలు:

ఆర్థిక నిపుణులు (ఎంజీనరేగా) యొక్క సమర్థతను పెంచడానికి అనేక సూచనలు చేశారు. జీన్ డ్రెజ్ సహా నిపుణులు నిధుల కేటాయింపును పెంచాలని, వేతన చెల్లింపులలో ఆలస్యాన్ని తగ్గించాలని సూచించారు. అదనంగా, డిజిటల్ వ్యవస్థలను సరళీకరించడం, గ్రామీణ కార్మికులకు సాంకేతిక శిక్షణ ఇవ్వడం, మరియు అవినీతిని నిరోధించడానికి కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేయడం వంటి సలహాలు ఇచ్చారు. కొందరు నిపుణులు (ఎంజీనరేగా) ను ఇతర సామాజిక భద్రతా పథకాలతో సమన్వయం చేయడం ద్వారా దాని ప్రభావాన్ని పెంచవచ్చని సూచించారు.

### మీడియా నివేదికలు:

మీడియా నివేదికలు (ఎంజీనరేగా) యొక్క విజయాలు మరియు వైఫల్యాలను రెండింటినీ హైలైట్ చేశాయి. ఒకవైపు, ఈ పథకం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడిందని, మరోవైపు, అవినీతి మరియు బడ్జెట్ కొరతలు దాని సమర్థతను దెబ్బతీశాయని వివిధ నివేదికలు తెలిపాయి. ఉదాహరణకు, "జనమనరేగా" అనే యాప్ ద్వారా పౌరుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించడం ద్వారా పథకం పారదర్శకతను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక నివేదిక తెలిపింది.

(ఎంజీనరేగా) గ్రామీణ పేదల జీవనోపాధి భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, నిధుల కొరత, అవినీతి, మరియు సాంకేతిక అడ్డంకులు దాని సమర్థతను పరిమితం చేస్తున్నాయి. జీన్ డ్రెజ్ యొక్క వ్యాఖ్య (ఎంజీనరేగా) యొక్క లక్ష్యం కేవలం ఆర్థిక లాభాల కోసం మాత్రమే కాకుండా, మానవ గౌరవాన్ని పెంపొందించడానికి కూడా ఉందని గుర్తు చేస్తుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కూడా అందించగలదు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

● అందోజు రవీంద్ర చారి

**హయత్‌నగర్, జూలై 8 (జనం సాక్షి) :** బిఓసి హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో అడ్డా కార్యదర్శి మందుల కృష్ణ అధ్యక్షతన 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, బిఓసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ లు హాజరైనారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ దేశం లో కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల కొరకు నేడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో అనేక పోరాటాల ద్వారా 24 గంటల పని దినాల నుండి 8 గంటల పని దినాలను సాధించుకున్నాం, కార్మికుల సంక్షేమం కోసం 42 చట్టాలను సాధించుకుంటే కేంద్రం లో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు, నిరుద్యోగులకు, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా నాలుగు కోడ్ లను చేసి కార్పొరేటర్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా ఉందని వారు అన్నారు. కార్మికులను తిరిగి బానిసత్వం వైపు నడిపే విధంగా 12 గంటల పని దినాన్ని తీసుకురావడానికి యావత్ కార్మిక లోకం ముక్త




కంఠంతో వ్యతిరేకిస్తుంది. నేడు జరిగే సార్వత్రిక సమ్మె ద్వారా దేశంలో కార్మిక ఉద్యమం మొదలవుతుందని ప్రభుత్వాలు ఏది పడితే అది చేస్తే సహించేది లేదని వారు ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ సమ్మెలో 10 వామపక్ష సంఘాలు పాల్గొంటున్నాయని వారు తెలిపారు. ఈ దేశంలో ఉన్న కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పర్మనెంట్ చేయాలని, కార్మికులకు కనీసం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐ 9000 పెంచాలని, అసంఘటిత రంగం లో పనిచేస్తున్న కార్మికులకు 6000 రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థలన్నీటిని ప్రవేట్ పరం చేయడం వెంటనే ఆపాలని, 42 చట్టాలను నాలుగు కోడ్ లుగా చేసి కార్పొరేట్ శక్తులకు దన్నుగా ఉండే జీవో నెంబర్ 282 ను వెంటనే రద్దు చేసుకొని యధావిధిగా కార్మిక చట్టాలను కొనసాగించాలని, ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ ను వర్తింపజేయాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ ను ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా అనేక పోస్టులు ఖాళీగా ఉన్న రిటైర్మెంట్ తీసుకున్నటువంటి వ్యక్తులను తిరిగి ఆ ఉద్యోగాల్లో కొనసాగించడాన్ని వామపక్ష సంఘాలు వ్యతిరేకిస్తున్నామని, కార్మికులకు పని భద్రత, ఆరోగ్య భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్ తో పాటు మౌలిక వస్తువులను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్, ఏఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, బిఓసి మండల అధ్యక్షుడు చెంది వెంకట్, కార్మికుల అడ్డా బాధితులు బొడ్డు శ్రీను, ఇసుక లోడింగ్ అన్లోడింగ్ అధ్యక్షులు పాల్వాయి సురేందర్, నిరంజన్ సుధాకర్, మారయ్య, మాతంగి సైదమ్మ, రేణుక, స్వరూప, అడ్డా కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలపై గో రక్షణ పేరుతో జరుగుతున్న దాడులను అరికట్టాలి



**రేవల్లి, జూలై 8 (జనంసాక్షి) :** గోపాలపేట మండల కేంద్రంలో మంగళవారం రోజు ఆవాజు సంఘం తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆవాజు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి. జబ్బార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై విచ్చలవిడి దాడులు జరుగుతున్నాయని, గో రక్షణ పేరుతో 150 మంది ని హత్య చేశారని, త్రిపుల్ తలాక్ క్రిమిలైజేషన్ వంటి చట్టాలు మైనార్టీలను వేధించడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అలాగే పేదరికం, నిరుద్యోగం, నిరాక్షరాస్యతతో, వెనుకబాటు తనం సమస్యలతో పాటు, లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇబ్బంది పడుతున్న మైనార్టీలకు రాజ్యాంగ హక్కుల కోసం ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయ సహకారాల కోసం పనిచేసే ఏకైక సంఘం ఆవాజు సంఘం అని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో చరిత్రాత్మకమైన గద్వాల పట్టణంలో రాష్ట్ర మూడో మహాసభలను జూలై 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు అఖిల భారత నాయకత్వం, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 500 మంది జిల్లాస్థాయి నాయకులు, ప్రతినిధులు హాజరవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మతిన్, సద్దాం, ఖాజా, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు

● వారానికి రెండు రోజులు ప్రజల మధ్యనే..
● స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**మర్పల్లి, జూలై 8 (జనంసాక్షి) :** నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల సమస్యలను నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆయన చేతుల మీద పత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గంలోని అన్ని మండలాలలో వారానికి రెండు రోజులు ప్రజలతో సభాపతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే నేరుగా వారి వద్దకే వచ్చినట్లు పేర్కొన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుపేద కుటుంబంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులు త్వరగా ఇంటిని పూర్తి చేసుకోవాలన్నారు. మేనిఫెస్టో ఆరు గ్యారెంటీలకు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అందరూ లబ్ది పొందాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఆయములు అందరూ ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధి పొందాలని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందే అవసరం లేదని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గంలోని అన్ని మండలాలలో వారానికి రెండు రోజులు ప్రజలతో సభాపతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, రాముల యాదవ్, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, ఫసి యుద్దీన్, ప్రత్యేక అధికారి మోహన్ కృష్ణ, ఎంపిడిఓ రాజ్ మల్లయ్య, తహసిల్దార్ పురుషోత్తం, హౌసింగ్ డి.ఇ.సయ్యద్ సాజిద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్, రామేశ్వర్, రాజన్న, శేఖర్ యాదవ్, సురేష్, దివాకర్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

● బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్



**జడ్చర్ల, జూలై 8 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించిన బీసీ జాగృతి సేన ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, మండల అధ్యక్షులు గౌడుగు నర్సిములు, కార్మికవిభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, నాయకులు బీమ్ రాజ్, కట్ట మురళి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, శివశంకర్, మండల కార్యదర్శి రఘు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రంగయ్య, మహేష్, జంగయ్య, మధుసూదన్, కృష్ణయ్య తదితరు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, రీయంబర్స్‌మెంట్‌పై రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు పిలుపు

● ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు



**హైదరాబాద్, జూలై 8 (జనంసాక్షి) :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం సిటి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షా కార్యదర్శులు శనిగారపు రజినీకాంత్ తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్ లో వున్నా స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు .ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ అనేది ఆర్థికంగా వెనుకబడిన పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యా అవకాశాలను అందించడానికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అది ఏ ప్రభుత్వాల బిక్షా కాదని అన్నారు. ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనార్టీ వర్గాలు ఉన్నత విద్య అందుకుని ఈ సమాజంలో ఉన్నతమైన స్థాయిలో ఉండటం ద్వారానే ఈ సమాజాభివృద్ధి సాధ్యమవుతుందిన్నారు. గత ఆరు సంవత్సరాల నుండి 8158 కోట్లుపై ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఈరాష్ట్రంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన విద్యార్థులకు స్కాలర్షిప్స్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంతేకాకుండా భారత దేశంలోనే విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం కేవలం తెలంగాణ రాష్ట్రం అన్నారు.

## విద్యపై పరిజ్ఞానాన్ని పెంచే విధంగా తీర్చిదిద్దాలి

**రాజేంద్రనగర్, జూలై 8 (జనంసాక్షి) :** మణికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి , మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యార్థుల విద్యా అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల ప్రగతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. నూతనంగా ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలలో 247 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్ తీసుకోగా వారికోసం విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యపై అవగాహన కల్పించే విధంగా, విద్యార్థుల కు లర్నింగ్ కార్నర్ చదువుపై ఏకాగ్రత అనే కార్యక్రమాన్ని కి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు , సిద్ధప్ప , నాయకులు బీరప్ప , మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు రవికాంత్ రెడ్డి , నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శివగంగ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### రామకృష్ణారెడ్డిని కలిసిన శ్రీరాంనగర్ కాలనీ నూతన పాలకవర్గం

మణికొండ మున్సిపాలిటీ శ్రీరామ్నగర్ కాలనీలో గతవారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎలక్షన్లో నూతనంగా ఎన్నుకోబడిన సంక్షేమ సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి , పాలక సభ్యులు కలిసి మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి ని కాలనీ అభివృద్ధి సంక్షేమానికి తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
● భవిత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**జడ్చర్ల, జూలై 8 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జడ్చర్ల మండలం ఎం.పి.డి.ఓ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో బాగంగా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వన మకోత్సవం కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో జిల్లాలో ఆయా శాఖలు లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. ఈ.జి. యస్.కింద మొక్కలు నాటి, 100 శాతం లక్ష్యం దాటాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డి.అర్.డి. ఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### భవిత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న భవిత పాఠశాలను కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐఇఆర్పి టీచర్లు విజయలక్ష్మి, సునీతలను భవితలో జరిగే స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్యా లివింగ్ థింగ్స్, టిఎల్ఎం ఫిజియోథెరపీ గురించి, ఈరోజు జరిగిన ఫిజియోథెరపీ గురించి ఫిజియోథెరపిస్ట్ ను, పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, తహసిల్దార్ నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల, జూలై 8 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సన్నబియ్యం తీసుకున్న చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు జీవ్వనొల్ల కృష్ణ ఇంట్లో మంగళవారం చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య మధ్యాహ్నం భోజనం చేసిన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సీఎం రేవంత్రెడ్డి ప్రతి నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం ఉండాలనే లక్ష్యంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రేషన్ కార్డు ద్వారా అందజేసిన సన్న బియ్యంతో వండిన ఆహారం చాలా బాగుందని అన్నారు. లబ్ధిదారులు కూడా సన్న బియ్యంతో అన్నం తిని ఆనందం వ్యక్తం చేసి సన్న బియ్యాన్ని సరఫరా చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుంగటి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి. గౌనే ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, మర్పల్లి కృష్ణా రెడ్డి, సున్నపు వసంతం, మాజీ సర్పంచులు మధుసూధన్ గుప్తా, కాసుల రమేష్, దవల్గారి గోపాల్



రెడ్డి, ఎన్ను. జంగారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మల్లేష్. డైరెక్టర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ నాయకులు చాన్ పాషా, నాయకులు శేఖర్ రెడ్డి, జి. మల్లేష్ తదితరులున్నారు.

# టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

● విద్యార్థులతో మాటామంతి
● విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని నింపిన కలెక్టర్

**జడ్చర్ల, జూలై 8 (జనం సాక్షి) :** జడ్చర్ల డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి టీచర్‌గా మారి విద్యార్థులకు బోధించారు. మంగళవారం జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. నర్మద స్వాగతం పలికారు. కళాశాల సెమినార్ హాల్ లో నిర్వహిస్తున్న బిఎల్ఓల ట్రైనింగ్ ను సందర్శించిన కలెక్టర్ అనంతరం డిగ్రీ తృతీయ సంవత్సరం బి.జెడ్.సి తరగతి గదిలోకి ప్రవేశించి కాసేపు అధ్యాపకురాలిగా మారారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలగిడి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ, స్వయం ఉపాధి, అనుకున్న విజయాలను ఎలా చేరుకోవాలి అనే అంశాలపై విద్యార్థుల కు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ లాబ్, స్వయం రక్షణ కోసం కరాటే లాంటి విద్యలు, పోటీ పరీక్షలు ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ ప్రిపరేషన్ కు కావలసిన



వసతులను ఏర్పాటు చేస్తామని అదేవిధంగా విద్యార్థుల కు డ్రైవింగ్ నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. మొదటగా గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవ వైవిధ్య పరిరక్షణ, విద్యాకేంద్రంను సందర్శించారు. కలెక్టర్ కు గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నిల్వజేసిన ఇటీవల రక్షించిన పాములను చూశారు. అక్కడ భద్రపరచిన అతిపెద్ద జెర్రిపోతు కుబుసాన్ని చూసి ఆనందపడ్డారు. వీటి గురించి సదాశివయ్య ను అడిగి తెలుసుకున్నారు. బొటానికల్ గార్డెన్ లో వివిధ విభాగాలను పరిశీలించి మొక్కను నాటి నీరు పోశారు. గార్డెన్ ఏర్పాటు చేసిన తీరును అభివృద్ధి చేస్తున్న సదాశివయ్య ను అభినందించారు. గార్డెన్ కి కావలసిన సహాయ సహకారాలు చేస్తామని తెలిపారు. గార్డెన్ లో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న నెట్ హౌస్ లను, ఆర్కిడ్ హౌస్, కాక్టస్ హౌస్ లను చూసి కలెక్టరేట్ ఆవరణలో ఇలాంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించాలని అధ్యాపకులకు సూచించారు. కలెక్టర్ కు గార్డెన్ లో పండిన స్టార్ ఫ్రూట్స్ ను గార్డెన్ సమన్వయకర్త, ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. నర్మద బహుమానంగా అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాఘవేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, రాజేశ్వరి, వెంకట్ రెడ్డి, రజని తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మల్లికార్జున్

**వనపర్తి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ మల్లికార్జున్ భధ్యతలు చేపట్టారు.మంగళవారం సాయంత్రం డాక్టర్ మల్లికార్జున్,ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయి నుండి భాధ్యతలు తీసుకున్నారు.వికారాబాద్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లికార్జున్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీ రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా భాధ్యతలు చేపట్టారు.మెడికల్ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ గా పనిచేసిన డాక్టర్ కిరణ్మయి మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రొఫెసర్ స్థానంలో కొనసాగనున్నారు. వనపర్తి మెడికల్ కళాశాల అడ్మిస్ట్రేషన్ అధికారి రఘు,కళాశాల వైస్ ప్రిన్సిపల్ సునీత,సూపరిండెంట్లు గిరి మోహన్ రెడ్డి,లక్ష్మయ్య,తిరుప తయ్య ,ప్రొఫెసర్లు డేవిడ్, ఆనంద్,రమా క్రాంతి,రాజేశ్వరి, చైతన్య,దివ్య పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
- ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రమాదం పొంచివుంది
- ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ ప్రమాదం
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
- విద్యార్థి దశనుండే క్రమశిక్షణ చాలా ముఖ్యం
- సోషల్ మీడియా ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది



**వనపర్తి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** ప్లాస్టిక్ వస్తువులు వినియోగించడం వాటి వ్యర్థాల వల్ల పర్యావరణానికి ప్రమాదం పొంచివుందనీ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.మంగళవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలపై ,సోషల్ మీడియా సైబర్ నేరాల గురించి ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ,ఐఐటి మైనింగ్ బాంబే పూర్వవిద్యార్థి శ్రీనివాసరావు తో పాల్గొని విద్యార్థినిలకువివిధ అంశాలుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనిషి నిత్య జీవిత వినియోగంలో ప్లాస్టిక్ ప్రముఖ పాత్ర వహిస్తుందని నాసిరకం ప్లాస్టిక్ వస్తువులు సంచులు వాడటం వల్ల పర్యావరానికి పెద్ద ప్రమాదం పొంచివుందని దాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. ప్రతి విద్యార్థి ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని తమ ఇంటి నుండి ప్రారంభించి వారు నివసించే ప్రాంతం ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తయారు చేసుకొని భూకాలుష్యాన్ని నివారించాలని సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజాన్ని మంచి మార్గంలో నడిపే వృత్తి ఉపాధ్యాయ వృత్తి, తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, దేవుడు ప్రసాదించిన వరం ఉపాధ్యాయులు అన్నారు. బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది అన్నారు, ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్ళాలన్నారు.జిల్లా వ్యాప్తంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రతి బుధ రోజున పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తూ పౌరులు సన్మార్గంలో నడవాలని మంచిని బోధిస్తూ పోలీసుగా మేము కూడా ఉపాధ్యాయునీ వలె పని చేస్తున్నాము అన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సత్ప్రవర్తన పై అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపినారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవాలి, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలి, ప్రజలకు సేవలు అందించే విధంగా ఎదగాలి అన్నారు. విద్యార్థులు మంచి పుస్తకం, మంచి స్నేహితున్ని ఎంచుకుంటే చాలా సాధించవచ్చు అన్నారు. జిల్లాలో రాష్ట్రంలో ఉన్న ప్రముఖులు, విద్యావంతులు, అధికారులు చాలావరకు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి వచ్చినవారే అన్నారు. విజయం సాధించిన వారి జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.నేను కూడా మారుమూల పల్లెటూరులో ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈరోజు ఐపీఎస్ అధికారిగా మీ ముందుకు వచ్చాను అని ఎస్పి తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వంటింటి నుంచి విద్య వైద్య శాఖల వరకు ప్లాస్టిక్ వస్తువుల వాడకం విచ్చల విడిగా జరుగుతుందని అది అరికట్టవలసిన బాధ్యత నేటి తరంపై ఉందని ఆయన చెప్పారు. ప్లాస్టిక్‌లో కూడా రకాలున్నాయని రీసైక్లింగ్ చేయడానికి అనువైన వస్తువులను ఉపయోగించడం ప్రమాదం ఏమీ లేదని భూమిలో కలిసిపోని నాసిరకం ప్లాస్టిక్ కవర్ లు వస్తువుల వల్ల భూసారం తగ్గి పండే పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. అంగళ్లలో, హెూటళ్లలో తినుబండారాలను ప్లాస్టిక్ కవర్‌లో ఇస్తున్నారని వాటి వినియోగం విషతుల్యమని తెలిపారు.తినుబండారాలు ఉన్న వ్యర్థ కవర్ లను రోడ్లపై పారవేయడం వల్ల వాటిని పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నా సంఘటనలు గుర్తు చేశారు. ప్లాస్టిక్ కవర్లను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పాడేయకుండా ప్లాస్టిక్ బాటిల్లలో కవర్లలో వేసి రీసైకిల్ చేసే విధంగా మున్సిపల్ వారికి అందజేయాలని అన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగం క్యాన్సర్ కారకమని తెలిపారు. ప్లాస్టిక్ స్థానంలో బట్ట జనపనార పేపర్ సంచులను వస్తువులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉమాదేవి, ఉపాధ్యాయులు, పద్మావతి, పుష్పకుమారి, జ్యోతి, కల్పన,విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీదే విజయం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వీపనగండ్ల, జూలై 8 (జనం సాక్షి) :** కల్వరాల గ్రామ నాయకులతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి అందరూ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి అని కార్యకర్తలకు, నాయకులకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సలహా ఇచ్చారు. వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి సర్దార్ తన ఆహ్వాన మేరకు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కల్వరాల గ్రామంలో మొహరం పీర్ల పండుగ సందర్భంగా వేడుకలకు పాల్గొన్నారు. కల్వరాల గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరించి కల్వరాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తుపెట్టుకుని మరీ పలకరించడం జరిగింది, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధికంగా స్థానాలు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.అందుకు కార్యకర్తలు కలిసికట్టుగా సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, వెంకటేష్,నర్సింహారెడ్డి ఎండి గఫార్,రాముడు,భాస్కర్ రెడ్డి,రమేష్, గోవర్ధన్ రెడ్డి, యాదగిరి గౌడ్, బొజ్జన్న, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలి

- ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు
- ఎంపీడీవో కృష్ణయ్య




**ఉర్కొండ, జూలై 8 (జనం సాక్షి) :** మహిళలు ఆర్థికంగా ఎదిగి పురోగతిని సాధించాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. జిల్లా కలెక్టర్ డి.ఆర్.డి.ఓ ఆదేశాల మేరకు ఉరుకొండ మండలంలోని అన్ని గ్రామాల మహిళా సంఘ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి, విఒఏ లతో ఇందిరా మహిళా శక్తి సంబరాలు మంగళ వారం రొజు ఉర్కొండ గ్రామ రైతు వేదిక యందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా గత ఆర్థిక సంవత్సరం నుండి నేటి వరకు మహిళా సాధికారతలో భాగంగా వివిధ మహిళా సంఘాలు చేపట్టిన సక్సెస్ స్టోరీలను ఈ సందర్భంలో గుర్తు చేసుకోవడం శ్రీనిధి లోన్లు, బ్యాంకు లోన్లు అత్యధికంగా రికవరీ చేపట్టిన వారి వివరాలను ఈ సంబరాల్లో భాగంగా అభినందించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా ముచ్చర్లపల్లి గ్రామ సంఘం, రాచర్ల పల్లి రికవరీ, మాదారం వారు బ్యాంకు నుండి కోటి 20 లక్షల బ్యాంకు లింకేజీ, ఊరుకొండ పేట 80 లక్షల శ్రీనిధి లింకేజీ అలాగే స్కూల్ యూనిఫామ్ నిర్ణయిత సమయంలో ఇచ్చినందుకు, బొమ్మరాశిపల్లి వరి కొనుగోలు కేంద్రాలు, జకినాలపల్లి ఆహార శుద్ధి యూనిట్ నిర్వహించి ముందంజలో నిలిచిన అందరికీ శాలువాలతో సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కృష్ణయ్య ఎంపీడీవో ఊరుకొండ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలు సాధించిన సాధించబోయే విజయాల గురించి పొదుపు గురించి సహకారం గురించి అభివృద్ధి పథంలో పయనించాలంటే తీసుకోవాల్సిన చర్ల గురించి గ్రామ సంఘ అధ్యక్షులకు సూచన చేయడం జరిగింది. ఇలాంటి సమావేశాలు అన్ని గ్రామాలలో రేపే నిర్వహించుటకు అందరు అధ్యక్ష కార్యదర్శులకు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంతోష్ (ఏపిఎం), శ్యామలమ్మ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, లక్ష్మీదేవి కార్యదర్శి, లావణ్య కోశాధికారి, ఎంపీవో లక్ష్మణ్, నరసింహ ఏపీఓ సిసిలు ప్రభాకర్, సునీల్ పాల్గొనడం జరిగింది.

# ఎంసీహెచ్‌లో మెరుగైన వసతులు కల్పించాలి

- రోగుల సహాయకులకు భోజనం పెట్టాలి
- ఐద్వా నేతల డిమాండ్



**వనపర్తి, జూలై 8 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో మెరుగైన సేవలు అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల,కార్యదర్శి ఏ. లక్ష్మి, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బంగారయ్యను ను కోరారు. మహిళలు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించకపోవడం బాధ్యతా రాహిత్యమని దుయ్యబట్టారు. ఎంసీహెచ్‌లో రేడియాలజిస్టుతో పాటు రోగులకు అనుగుణంగా డాక్టర్లను, వైద్య సిబ్బందిని నియమించాలని తమ సంఘం అధ్వర్యంలో పోరాటాలు చేస్తే ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సమస్యలపై కనీసం సమీక్ష కూడా జరపలేదని విమర్శించారు. రేడియాలజిస్ట్ వంటి కీలక వైద్య పరీక్షా నిపుణురాలిని కేవలం ఒక సంవత్సరం కొరకు తాత్కాలిక పద్ధతిపై నియమించడం శోచనీయం అన్నారు. సిబ్బందిని పర్మనెంట్ పోస్టుల్లో నియమించాలని, వారి సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన రోగులకు మాత్రమే భోజన వసతి ఉండగా, వారి వెంట ఉన్న సహాయకులకు (అటెండెంట్స్) భోజనం లేకపోవడం ఆందోళన కలిగించేదిగా ఉందని ఐద్వా నాయకురాళ్లు పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ విధానాలను పునరాలోచించాలని సూచించారు. పేషెంట్ పక్కన ఉన్న ఒక్కరికి అయినా భోజనాన్ని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ గేట్ లోపల ఏర్పాటు చేసిన సులభ్ కాంప్లెక్స్‌లో పిల్లల స్నానాలకు, బట్టలు ఉతకడానికి రూ. 10 నుంచి 50 దాకా వసూలు చేస్తున్నారని, దీనివల్ల రోగుల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా జీతం నిరంతరంగా రావాలని, వారికి ఇన్‌సెంటివ్లు, సెలవులు తదితర సౌకర్యాలు ప్రభుత్వం నుంచి అందాలని పేర్కొన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా కార్యకర్తలు, కోశాధికారి కవిత, సహాయ కార్యదర్శి ఉమా పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు మహిపాల్ రెడ్డి మరిన్ని పదవులు అలంకరించాలి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



**తూప్రాన్, జూలై 8 (జనం సాక్షి) :** ప్రజా నాయకుడు రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మైపాల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని తాను కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు చిక్కుల మహిపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం నుండి మనోహరాబాద్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఫంక్షన్ హాల్ లో జరిగిన జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొని ప్రసంగించారు ప్రజల అవసరాలు తీర్చి ప్రజలకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తే ప్రజల మనసులలో నాయకుడు స్థిర స్థాయిగా ఉంటాడని అలాంటి నాయకుడు మహిపాల్ రెడ్డి అని అన్నారు. మైపాల్ రెడ్డి వందేళ్లు చల్లగా ఉండాలని దేవుని కోరుకుంటున్నాను మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆశిస్తున్నట్లు అన్నారు మహిపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా సీఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 200 వాహనాలు మరియు కార్లతో బైక్ ర్యాలీ మనోహరాబాద్ శుభం గార్డెన్ వరకు నిర్వహించారు జీడిపల్లి వద్ద ఆయనకు గజమాలతో అభిమానులు కార్యకర్తలు సీఎంఆర్ యువసేన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ మైనార్టీ నాయకులు జావేద్ పా ష తూప్రాన్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భగవాన్ రెడ్డి మనోహరాబాద్ తూప్రాన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి భాస్కర్ రెడ్డి మండల ఉప సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు ధర్మేందర్ మైనార్టీ నాయకులు జావిద్ పా ష భాష బోయిన చంద్రశేఖర్ నాయిని యాదగిరి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి నాగిళ్ల ప్రభాకర్ నవీన్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి నాని యాదగిరి అనిల్ రెడ్డి తూప్రాన్ మనోహరాబాద్ మేడ్చల్ వర్గల్ గజ్వేల్ హైదరాబాద్ నుండి కార్యకర్తలు అభిమానులు ఆయనను కేకులు శాలువా సన్మానించారు. జన్మదిన సందర్భంగా సపాయి కార్మికులకు బియ్యాన్ని పంపిణీ చేశారు.

## రోడ్డు విస్తరణ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు

- డీఈ రాజారాం ను ఆదేశించిన ఎమ్మెల్యే పల్లా



**చేర్యాల, జూలై 8 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలో నేషనల్ హైవే రోడ్డు వెడల్పులో రోడ్డు నిర్మాణం చేపట్టి సంవత్సరం గడిచిన తర్వాత ఇటీవల కాలంలో అదనంగా 5 పీట్ల స్థలం వదిలిపెట్టాలని మార్కింగ్ చేసి ఇంటి యజమానులను భయభ్రాంతుల గురిచేస్తున్న నేషనల్ హైవే అధికారులు, మున్సిపల్ అధికారుల తీరుపై గత రెండు రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న క్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి మంగళవారం సిపిఐ నాయకులు చేర్యాల పట్టణంలో నెలకొన్న రోడ్డు సమస్యలపై వినతి పత్రం సమర్పించి వివరించడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారి ఎన్. హెచ్ డీఈ రాజారామ్‌తో చరవాణిలో మాట్లాడారు. ఎంతో కష్టపడి ఇబ్బందులతో ఇండ్లు నిర్మించుకున్నారని రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోతున్న చిరు వ్యాపారులకు ఇంటి యజమానులకు సహకరించాలని, గత సంవత్సరం క్రితం 45 ఫీట్లు వదిలి పెట్టి నిర్మాణాలు చేపట్టారని వారిని ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చి ప్రజలకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేకు సిపిఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, ఆరుట్ల లింగం, చింతల రఘుమహారాజులు ఉన్నారు.

## అమీరాబాద్ లో అభివృద్ధి పనుల పరిశీలన



**న్యాల్‌కల్, జూలై 8 (జనం సాక్షి) :** మండలంలోని అమీరాబాద్ గ్రామంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. మంగళవారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలనతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఆవరణలో పలు మొక్కలను నాటారు. ఇటీవల నూతనంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గా విధుల్లో చేరిన ఎంపీడీవో శ్రీనివాస్ అమీరాబాద్ గ్రామానికి తొలిసారి రావడంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు, రైతులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేణుక, శరణప్ప, దత్తారెడ్డి, అంబదాసరావు, కే.వైద్యనాథ్, గుండప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- బిఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్



**జడ్చర్ల, జూలై 8 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఆరోగ్యకరమైన, తప్పులు లేని శుద్దీకరణ జాబితా చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జడ్చర్ల మండల కేంద్రంలో బి.అర్.అర్ డిగ్రీ కళాశాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులకు, సూపర్ వైజర్లకు జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 3 నుండి 11 వరకు బి.ఎల్. ఓ.లకు, సూపర్ వైజర్ లకు శిక్షణ నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణలో బాగంగా జడ్చర్ల మండలంకు చెందిన బి.ఎల్. ఓ లు, సూపర్ వైజర్ లకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను పరిశీలించాలని, ఓటర్ జాబితాలో నమోదు, మార్పులు, చేర్పులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన ఓటర్లు ఓటర్ జాబితాలో నమోదు, మార్పులు, చేర్పులకు ఫారం 6, 7, 8 నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహనా కలిపించాలన్నారు. ఓటర్ జాబితాలో అవసరమైనచో పాత ఫోటోలు తొలగించి, ఓటర్ల కు సంబంధించిన నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లు నమోదు చేయాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు అయ్యేలా చూడాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. మరణించిన వారి పేర్లను తొలగించేందుకు నిబంధనలు పాటించి ఫారం 7 ద్వారా తొలగించాలని, మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. చేర్పులు, పేరు మార్పుల కొరకు ఫారం 8 వినియోగించాలన్నారు. తల్లి దండ్రులు 18 సంవత్సరంలు నిండిన తమ సంతానం కు ఓటర్ జాబితాలో నమోదు చేసి ఓటర్ గుర్తింపు కార్డు వచ్చేలా తమ వంతుగా గిఫ్ట్ గా అంద చేయాలని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో తహసిల్దార్ నర్సింగ రావు, ఎన్నికల డి.టి మహబూబ్ అలీ, డి.టి కిశోర్ బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ జీతాలు పెంచాలి

- రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



**గద్వాల నడిగడ్డ, జూలై 8 (జనం సాక్షి) :** గద్వాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ జీతాలను పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని మంగళవారం డిఇఓ ఆఫీసులో అసిస్టెంట్ డైరెక్టర్ దానమ్మ, సూపర్డెంట్ వీర శేఖర్ కు వినతి పత్రం సమర్పించినట్లు టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మూడు నెలల నుండి పెండింగ్ లో ఉన్న కోడిగుడ్ల,మెనూ బిల్లులు ఇవ్వాలనీ, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలనీ,నెలనెలా బిల్లులు ఇవ్వాలనీ, మధ్యాహ్న భోజన వర్కర్స్ జీతాలు పెంచాలనీ, వంట పాత్రలు ఇవ్వాలనీ, బీమా సౌకర్యం కల్పించాలనీ ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, కృష్ణ, వర్కర్స్ భాష,రాజు, కృష్ణయ్య, జయన్న, శాంతమ్మ,పుణ్యవతి, చారి,తిమ్మక్క,రాజు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పట్టివేత

### 150 బ్యాగుల్లో మహారాష్ట్రకు అక్రమంగా తరలింపు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియాను కొంతమంది అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న వాహనాలను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇస్తున్న ఫర్టిలైజర్‌ను, తెలంగాణ రైతులకు అమ్మకుండా, అక్రమంగా మోసపూరితంగా వ్యవహరించి బాధ్యతగల హాకా నిర్వాహకులు మహారాష్ట్రకు అధిక ధరలకు అధిక లాభార్జనకు అమ్ముతున్నట్లు రైతుల ద్వారా లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు రెండు వాహనాలను సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని డిఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండలం మార్క్‌ఫెడ్ అనుబంధ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ప్రొప్రైటర్ నిందితులు సునీల్, మరియు ఉద్యోగి అజయ్ లు మహారాష్ట్రకు సంబంధించిన ఫెర్టిలైజర్ దుకాణం యజమాని నిఖిల్ తో ఒప్పందం కుదుర్చుకొని దాదాపు మూడు లక్షల విలువచేసే ఫెర్టిలైజర్ను రెండు వాహనాలలో 150 బ్యాగుల్లో యూరియా ను అక్రమంగా తరలిస్తుండగా ఆ రెండు వాహనాలను సీజ్ చేసి, వాహన డ్రైవర్లైన వాంకడే దిలీప్, చిలకలవార్ చంద్రశేఖర్లపై, మొత్తం ఐదుగురిపై బేలా పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు తెలిపారు. ప్రత్యేకంగా రైతుల ద్వారా సమాచారం అందగా త్వరితగతిన స్పందించి జైనథ్ సిఐ డి.సాయినాథ్ మరియు బేల ఎస్సై నాగనాథ్ బృందం వారిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. వీరిపై సెక్షన్లు 316, 318 బీఎన్ఎస్ ప్రకారం బేల పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలలో 150 బ్యాగుల్లో దాదాపు 67.5 క్వింటల ఫర్టిలైజర్ ను మహారాష్ట్రకు తరలించకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అడ్డుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసిందని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనల మేరకు అక్రమంగా వ్యవహరిస్తున్న ప్రతి ఒక్కరిపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సై నాగనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి అట్టహాసంగా జన్మదిన వేడుకలు

### రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ కావ్య



**స్టేషన్ ఘన్పూర్, జూలై 08 (జనంసాక్షి) :** 30ఏళ్లుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఆశీర్వదిస్తున్నారని, నాకున్న ఏకైక ధ్యాస, ఏకైక లక్ష్యం నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే నని, రాజకీయాలలో అడుగుపెట్టిన నాటి నుండి ఏనా డూ తప్పుచేయలేదని నా నిజాయితీనే నా గుర్తింపుకు కారణంఅని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూ ర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుట్టిన రోజు సందర్భంగా స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరా న్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించా రు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయటమే అని అన్నారు. నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, థలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తం చాల అవసరమని, అలాంటి వారిని కాపాడేందుకు రక్తదానం చేయడం అవసరం అన్నారు. ఎమ్మె ల్యే కడియం మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానమని ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికీ రక్తదానం సంజీవనిలా ఉపయోగపడుతుందని తెలిపారు. నా పుట్టినరోజున ఇంతగొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. నిజాయితీగా ఉంటూ ప్రజలకు సేవ చేయడం వల్లనే నాకు గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్, చంద్ర బాబు నాయుడు, చంద్రశేఖర్ రావు , ఇప్పుడు రేవంత్ రెడ్డి అందరూ ముఖ్యమంత్రులు నాకుగౌరవం ఇచ్చార ని, పిలిచి పదవులుఇచ్చారని అన్నారు.దానికికారణం నా నిజాయితీ మాత్రమే అని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడానికి మీ అందరి అభిప్రాయం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య ఘన విజయం సాధించారాని తెలిపారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా నేను ఎమ్మెల్యేగా నా కూతురు ఎంపీగా గెలవడం మాములు విషయం కాద ని ఇది ఒక చరిత్ర అని అన్నారు. రాజకీయాలలో ఉన్న ప్పుడు ప్రజల వెంట ఉండాలి, ప్రజలకు సేవ చేయాలి అప్పుడే మనకు ప్రజలలో గుర్తింపు వస్తుందని దానికి నిదర్శనం నేనే నని చెప్పారు.పుట్టినరోజు సందర్భంగా నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా శు భాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి, గత 30ఏళ్లుగా నా వెంట ఉంటూ నాకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల య చైర్మన్ రాంబాబు, స్టేషన్ ఘనపూర్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ వ్యవస్థకు సర్వే వెన్నుముకలాంటిది..

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రెవెన్యూ వ్యవస్థకు సర్వే ప్రక్రియ వెన్నుముకలాంటిదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గనుల వృత్తి శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడి, శిక్షణా కార్యక్రమం తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే విషయంలో సంపూర్ణ అవగాహన అవసరమని, భూ సమస్యల పరిష్కారానికి సర్వే చాలా కీలకమని వివరించారు. సర్వేలో సరిగా, శాస్త్రీయంగా సర్వే చేసి భూమి హద్దులు నిర్ణయించాల్సి ఉంటుందని, అందువల్ల శిక్షణా కార్యక్రమంలో సమగ్రమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భూ కొలతలు, బౌండరీలు నిర్దేశించడం, భూ వివాదాలు నివారించడంలో సమగ్రమైన సర్వే కీలకమని తెలిపారు. సర్వేలో ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహనతో శిక్షణ పొందుతూ, భవిష్యత్తులో పటిష్టమైన సర్వే నిర్వహణకు మీరు ఆధారంగా నిలవాలన్నారు. అభ్యర్థుల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికీ లైసెన్స్ డ్ సర్వేయర్ శిక్షణ ఎంతో ఉపయోగపడతుందని తెలిపారు. మన జిల్లాలో లైసెన్స్ డ్ సర్వేయర్ శిక్షణ కోసం మొత్తం 162 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, మొదటి విడతలో ఎంపిక చేసిన 87 మంది అభ్యర్థులకు మే 26వ తేదీ నుంచి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా కాలం 50 రోజులు ఉంటుందని, శిక్షణా కాలంలో ఉదయం తరగతులు, సాయంత్రం క్షేత్రస్థాయిలో భూమి కొలతలు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీలలో ఫీల్డ్, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటి ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు గంగాధర్, గణేశ్ యాదవ్, రాములు, టెక్నికల్ సిబ్బంది పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యకు పెద్దపీట

### ఇంటర్ అడ్మిషన్‌లు పెరగాలి

### పదో తరగతి పాస్ అయిన విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలి

### జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, జూలై 8(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని...ప్రభుత్వ విద్య సంస్థ లలోనే ఉచితంగా మెరుగైన విద్య దొరుకుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్ అడ్మిషన్ లపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ రివ్యూ లో కలెక్టర్ మాట్లాడుతూ..ఇంటర్ అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్, మైనర్ రిపేర్ లు , విద్యార్తుల వసతి, ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాల పై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. జూనియర్ కళాశాలలో పూర్తి స్థాయి అడ్మిషన్స్ లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పదవ తరగతి పాస్ అయిన ప్రతీ విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదివేల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అవసరం ఉన్న విద్యార్థులకు వివిధ సంక్షేమ హాస్టల్ లో వసతి సౌకర్యాలను కూడా కల్పించాలన్నారు. జూనియర్ కళాశాలలో సివిల్ వర్క్, విద్యుత్ సరఫరా, పారిశుధ్య, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన, మైనర్ రిపేర్ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని... నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని కళాశాల లలో సౌకర్యాలు ఉండాలన్నారు. లెక్చరర్స్ కూడా సకాలంలో కళాశాలకు హాజరు కావాలన్నారు.. ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యన్ని పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, డి. ఈ. ఓ, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్



**నేరడిగొండ, జూలై 8 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం రోజున హైదరాబాద్ నందినగర్ లో గల వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకుని వారు ఆయురారోగ్యాలతో చల్లగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అండగా ఉండాలని కోరుకున్నారు.

## విద్యార్థి దశ నుండే పొదుపును అలవర్చుకోవాలి...

### వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



**చెన్నారావుపేట, జూలై 8 (జనంసాక్షి) :** విద్యార్థి దశ నుండే పొదుపును అలవర్చు కోవాలని వరం గల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. మంగళ వారం చెన్నా రావుపేట మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే పొదుపు చేయడాన్ని అలవర్చుకోవాలన్నారు. పొదుపు చేసుకున్న డబ్బులు జీవితంలో ముందు అవసరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాగే తమ తల్లిదండ్రులకు కూడా పొదుపు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. డబ్బులను పొదుపు చేయకుండా ఖర్చు చేసినట్లయితే అవసరానికి చేతిలో డబ్బులు లేక అనేక ఇబ్బందులు పడాల్సి ప్రతి ఒక్కరూ పొదుపుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిఆర్డిఓ కౌసల్యాదేవి, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, జిల్లా బ్యాంకు అధికారి రాజు, గిర్ధావర్ మహమ్మద్ రషీద్, ప్రిన్సిపాల్ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ఎమ్మెల్యే రేవూరి సమీక్ష



**పరకాల, జూలై 8 (జనం సాక్షి):** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతోకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం దామర, నడికూడ మండలాల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే మంజూరు అయిన ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వారం రోజుల్లోగా ప్రారంభించకుంటే వారి మంజూరును రద్దు చేసి, అర్హత కలిగిన వారికి ఇస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం వహించవద్దని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లు నిర్మించుకొని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గృహప్రవేశం చేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతుల కోసం నివేదికలను సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో,జూలై 8 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మరమ్మత్తుల కోసం అవసరమైన నివేదికలను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలలో వివిధ మరమ్మత్తుల పనుల నిర్వహణ పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు,పైకప్పులు (స్లాబ్), ప్రహరీ గోడలు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన మరమ్మత్తులపై స్పష్టమైన అంచనాల నివేదికలను తక్షణం రూపొందించాలని ఆదేశించారు.అత్యవసరంగా అవసరమైన పనులను మంజూరైన నిధులతోనే పూర్తిచేయాలని సూచించారు.

## పెండింగ్ రోడ్లకు మరమ్మతులు చేయిస్తా..!

### సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జులై 8 ( జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో అసంపూర్తి ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మీడియా ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 18 నెలల కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు రు.18 కూడా రోడ్ల మరమ్మతులకు మంజూరు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం నుంచి నిధులే మంజూరు కానప్పుడు అభివృద్ధి చేసేదేలా ..? అని ప్రశ్నించారు.చింతల మానేపల్లి మండలం లోని గూడెం రోడ్డుకు మరమ్మతల కోసం రాష్ట్ర ఇంజనీరింగ్ చీఫ్ తో మాట్లాడగా రు.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని పేర్కొన్నారు. అలాగే కాగజ్ నగరుదహగాం ప్రధాన రహదారిపై బట్టుపల్లిఉండవెల్లి గ్రామాల మధ్య వదిలివేసిన రోడ్డుకు సైతం మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి సిర్పూర్ నియోజకవర్గం లో నెలకొన్న రోడ్ల దుస్థితి గురించి వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి దున్నపోతు మీద వర్షం కురిసినట్లు ఉందన్నారు. సమస్యలను వింటుందే కానీ వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అటవీశాఖ అనుమతులు లేక రోడ్లకు నిధులు మంజూరైన మళ్లీ పోతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్ల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే వారికి విజ్ఞప్తి చేశారు.

## ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి

### రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలి

### ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జులై 08(జనంసాక్షి) :** ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణము, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) నిర్మాణము పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ పామ్ పంట సాగు పై, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్స్, పర్మిషన్స్, మౌలిక వసతుల కల్పన, కావలసిన ఏర్పాట్ల పై వివరంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార, సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యమునకు మించి సాధించాలని, లబ్ధిదారుల ఎన్నిక, రైతుల నుండి దరఖాస్తులను, రైతు వాటా సేకరణ, ప్లాంటేషన్ పూర్తి, మొదలగు పనులను, ఆయిల్ ఫామ్ కంపెనీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం లక్ష్యం 3000 ఎకరాలు సాధించడానికి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేసి ఈ మొదటి సీజన్ లోనే 75% లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారంలో బుధవారం, శనివారం గూగుల్ మీట్ ఏర్పాటు చేసి తద్వారా ప్రగతిని వివరించాలని, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయింపు, సంబంధించిన అనుమతులు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు త్వరగా చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారిసిద్ధార్థ రెడ్డి, డీఈఈ ఆర్ డబ్లు ఎస్ వెంకట సతీష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, కేవన్ బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ (ఎంఐఈ) వి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి



**కాటారం, జూలై 8 (జనం సాక్షి):** కాటారం మండల పరిధిలోని దామ రకుంట గ్రామంలో నిన్న రాత్రి రెండు గంటల సమయంలో మూకు మ్మడిగా గొర్రె మందపై ఊర కుక్కలు దాడి చేసినవి. కుక్కల దాడిలో వీరవేణి సమ్మయ్య, కటకం శ్రీనుకు సంబంధించిన మూడు గొర్లు రెండు గర్రెపిల్లలు ఒక మేక ను చంపివేసినవి. మిగతావి రాత్రి దాడిలో చిన్న భిన్నమై లెక్కకు రావడంలేదని గొర్రెల మంద యజమానులు వాపోయారు. వీటి విలువ 40000 వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామాల్లో ఊర కుక్కలు ఎక్కువ సంచరిస్తున్నాయి. గ్రామ అభివృద్ధి అధికారి ప్రత్యేక ప్రోగ్రాం చేసి ఏ విధంగా అయితే అదుపులోకి వస్తాయో సమగ్రంగా గ్రామ సిబ్బందితో విచారణ చేసి నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
09 జూలై 2025

# ప్రభుత్వ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 8 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో లక్ష్యాల సాధన కోసం నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన బోధన్ మున్సిపాలిటీని సందర్శించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్ ల జారీ తదితర అంశాలపై బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా కార్యక్రమాల అమలు తీరును, సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. పేదలకు సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ఉదాత్తమైన ఆశయంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో అలసత్వానికి తావులేకుండా లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఇళ్ళను నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టే విషయంలో లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, లబ్ధిదారులకు అవసరమైన తోడ్పాటును అందించాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఆర్థిక స్థోమత లేని వారికి మెప్మా ద్వారా రుణాలు ఇప్పించాలని, వాటిని ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల కోసం వినియోగించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి ఇళ్ళ నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. చిత్తశుద్ధితో కృషిచేస్తూ, లబ్ధిదారులకు ప్రోత్సాహం అందిస్తే తప్పనిసరిగా వారు ఇల్లు నిర్మాణం కోసం ముందుకు వస్తారని సూచించారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి దశల వారీగా రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని, అంతేకాకుండా ఉచితంగా ఇసుక సరఫరా, డ్వాక్రా, మెప్మా ద్వారా రుణ సదుపాయం కల్పిస్తుండడం వంటి అంశాలను వివరిస్తూ లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా చూడాలని, తద్వారా ప్రభుత్వ సంకల్పం నెరవేరేందుకు దోహదపడాలని కలెక్టర్ సూచించారు. ఆయా వార్డులలో నెలకొని ఉన్న పరిస్థితులపై వార్డు ఆఫీసర్లకు పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలుగుతారని అన్నారు. కాగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత సీజన్ లో నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. నిర్దేశిత లక్ష్యానికి మించి మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మొక్కలను ఆయా కేటగిరీలుగా విభజిస్తూ, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ ల కోసం వినియోగించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను, ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని, పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలని అన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, విష జ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదు అయితే, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన ప్రొసీడింగ్‌లు అందించాలని, అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష అనంతరం కలెక్టర్ బోధన్ పట్టణంలోని పాండుఫారం తర్వాను సందర్శించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులను కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ళను నిర్మించుకోవాలని, అవసరమైన తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

# జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 8 (జనం సాక్షి) :** మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోమవారం జుక్కల్‌లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆదేశించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులతో జుక్కల్‌లో రాష్ట్ర మంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై ఆదేశాలను జారీ చేసిన వాటిని ఆయా శాఖల ద్వారా 15 రోజుల్లోగా కార్యాచరణలోకి తీసుకురావాలని అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా కొరకు జిల్లాలో అదనంగా అవసరమైన సబ్ స్టేషన్ల మంజూరి కొరకు ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారిని ఆదేశించారు. జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కడ త్రాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అదనపు త్రాగునీటి వనరుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. అటవీ ప్రాంతాలగుండా మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు అటవీ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అటవీ చట్టాల ప్రకారం చర్యలు ఆదేశించారు. జుక్కల్ కమిటీ హెల్త్ సెంటర్‌లో ప్రజల ఆరోగ్య సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసేందుకు, ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అటవీ భూములలో 159 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని ఆయా గ్రామాల్లోకి గ్రామసభలు నిర్వహించి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ చట్టాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ మరియు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిని ఆదేశించారు. పెద్దకొడ్పగల్, పిట్లం మండలాలలో అధికారులు జొన్న పంట వివరాలను వాస్తవానికి విరుద్ధంగా నమోదు చేశారని తద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతాయని ఆరోపణలు వస్తున్నందున దానిపైన విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నికిత, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, పిడి హౌసింగ్ విజయ్ పాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్,డిటిడిఓ సతీష్ యాదవ్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, ఇఇ ఆర్డబ్ల్యూఎస్ రమేష్, మిషన్ భగీరథ ఈఈ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలలో మైక్రో ఫైనాన్స్‌ల అక్రమ దందాలు...

- రోజువారి కూలీలే వీరి టార్గెట్...
- డబ్బులు ఆశ చూపి నరకయాతన పెడుతున్న మైక్రో ఫైనాన్స్‌లు
- మైక్రో ఫైనాన్స్ ఆగడాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలి..
- సిపిఐ నాయకులు లింగంపల్లి అన్వేష్



**జమ్మికుంట, జూలై 8 (జనంసాక్షి) :** హుజురాబాద్, జమ్మికుంట పట్టణ పేదప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకుని పలు మైక్రో ఫైనాన్స్ కంపెనీలు మధ్యావర్థుల ద్వారా ప్రజలకు డబ్బు ఆశ చూపించి రోజువారి కూలీ చేసుకునే మధ్యతరగతి కుటుంబాలనే టార్గెట్ చేస్తూ ఊరిలో ఒక మధ్యవర్తిని ఎంపిక చేసుకొని 5గురు సభ్యులతో కూడిన ఒక గ్రూప్ ఏర్పాటు చేసి కమిషన్, ఇన్సూరెన్సు పేరు మీద సుమారు 5000 రూపాయలవరకు కట్ చేసుకుని మిగత రూపాయలు బెనిఫిషర్‌కి ఇచ్చి ప్రతి నెల 4 నుండి 10వ తారీకు లోపల కట్టమని అదేశించి ఒకవేళ సమయానికి చెల్లించకపోతే రానున్న కాలంలో సిబిల్ స్కోర్ తగ్గుతుందని ఫ్యామిలీలోని పిల్లలకు కూడా నోటీసులు వస్తాయని అలాగే వారి ఉద్యోగాలకు ఇబ్బందులు అవుతాయని ఇలా బెదిరిస్తూ గ్రూప్‌లోని 4గురు కట్టి ఒక్కరు కట్టకున్న మొత్తం గ్రూపుసభ్యుల మీద మానసిక ఒత్తిడి తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నా పలు మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై సంబంధిత అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోగలరని సిపిఐ జమ్మికుంట పట్టణ నాయకులు లింగంపెల్లి అన్వేష్ డిమాండ్ చేశారు.

# పెట్టుబడిదారి చేతుల్లో కీలుబొమ్మగా మహిళలు

**ఖమ్మం రూరల్, జూలై 8 (జనం సాక్షి) :** మహిళల శక్తి...సామర్థ్యాలను పెట్టుబడిదారీ వ్యవస్థ తన చేతుల్లో కీలుబొమ్మగా మార్చుకుందని, తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాపురంలో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో 5వ ఖమ్మం రూరల్ మండలం మహిళా సమాక్య మహాసభను నిర్వహించారు. తొలుత ఊరు ముందు నుంచి ర్యాలీగా మహిళలు, డీజే ,కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహభరితంగా పురవీధుల్లో తిరిగారు. అలాగే ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన జెండాను సిపిఐ సీనియర్ నాయకురాలు దండి నారాయణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓరుగంటి ప్రమీల, కొమరబత్తిని వెంకటరత్నమ్మ, మారుతి రుక్మిణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సృజనా మాట్లాడారు... బిజెపి పార్టీ కుల, మతాల మధ్య చిచ్చు రాజేస్తూ అంట కాగుతూ ప్రజల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొడుతుందని ధ్వజమెత్తారు. మహిళలను వంటగదికే పరిమితం చేసేలా తమ పెట్టుబడి దారి వ్యవస్థ ద్వారా టీవీ సీరియల్స్, ఫోన్లు వంటి వాటిని ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఇటువంటి శక్తులపై మహిళలు గల మెత్తలన్నారు. మహిళలు ప్రపంచంలోని పలు దేశాల్లో సామాజిక , ఆర్థిక , సాంస్కృతిక ,రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. ఇంటిని చక్కదిద్దడమే కాకుండా... సమ సమాజ స్థాపన లోను భాగస్వామ్యులు కావాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో మహిళల కోసం అనేక హక్కులను కల్పించారన్నారు. దానికి అనుగుణంగానే ఈరోజు రాజకీయాల్లో 50 శాతం రిజర్వేషన్ దక్కిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఓటు హక్కుతోపాటు పలు హక్కుల రావడంలో మహిళా సమైక్య పోరాటం ఎనలేనిది కొనియాడారు. అనంతరం 61 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోటు శ్రావణి , కార్యదర్శిగా మేళ్లచెరువు లలిత తో పాటు 21 మంది ఆఫీస్ బ్యాలెన్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, జిల్లా కార్యదర్శి ఏపూరి లతా దేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మహిళా సంఘం జిల్లా ఇన్చార్జ్ జమ్ముల జితేందర్ రెడ్డి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణ కుమార్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిడ కంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, వున్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## బీసీల సంక్షేమానికి 11 వేల కోట్లు సరిపోతాయా..?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య

**వలిగొండ, జూలై 8 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఆలకుంట్ల ఎల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క 2025- 26 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ను శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా బీసీల సంక్షేమానికి 11,405 కోట్ల రూపాయలను కేటాయించడం, మూడు లక్షల పైన రాష్ట్ర బడ్జెట్లో 11,405 కోట్ల బడ్జెట్ను 50 శాతం పైన ఉన్న బీసీలకు కేటాయించడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఆలకుంట్ల ఎల్లయ్య అన్నారు. కాజీపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం బడ్జెట్లో బీసీ సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్ర నాయకులు హామీ ఇచ్చారని,గత సంవత్సర బడ్జెట్లో 9300 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి 11400 కోట్లు కేటాయించడం బీసీల పట్ల చిన్నచూపుగా చూడవలసి వస్తుందని ఆయన అభివర్ణించారు.మరో తెలుగు రాష్ట్రంలో బీసీలకు 47 వేల 456 కోట్లు కేటాయించారని, బీసీ ఓటుతో గెలిచిన ప్రభుత్వం బీసీలను మరవడం అన్యాయమని ఆయన ఆవేదన వెలబుచ్చారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు బీసీలను అభివృద్ధిలో, సంక్షేమంలో చిన్నచూపు చూస్తున్నారని, ఇప్పటికైనా రాబోయే బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని 20వేల కోట్లను కేటాయిస్తూ బడ్జెట్లో సవరణ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో యాదాద్రి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పంజా సజావర్ అలీ, నాయకులు పోల్ నాగయ్య, పల్సం రాజు గౌడ్, పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లలో దోపిడికి పాల్పడితే ఉపేక్షించేది లేదు



**దేవరకొండ, జులై 8 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గంలోని పలు మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 427మంది లబ్ధిదారులకు 1,71,39,000.00 రూపాయల విలువ గల చెక్కులు మరియు ప్రభుత్వ నుంచి మంజూరు అయిన కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోంది అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భారంగా మారిన వేళ, ఈ సహాయం ఎంతో అవసరమవుతోందని, నియోజకవర్గంలో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యాన్ని కోల్పోకూడదన్నదే నా లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ సహాయం మా కుటుంబానికి పెద్ద ఊరట. వైద్యానికి అవసరమైన నిధులు లేక అవస్థలు పడుతున్న వేళ ప్రభుత్వం ఇచ్చిన ఈ సాయం మరపురాని మేలు అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం దేవరకొండ నియోజకవర్గ ప్రజలపై ఎమ్మెల్యే బాలు నాయక్కి ఉన్న అనురాగాన్ని, సేవాభావాన్ని మరోసారి ప్రతిబింబించింది అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండల అధికారులు, గ్రామస్థాయి నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలసిన రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్..



**గోదావరిఖని, జూలై 8 (జనంసాక్షి) :** తెలంగాణ రైతంగాన్ని కంటికి రెప్పలగా చూసింది కేసీఆర్ అని వారి పాలనలో తెలంగాణ రైతులంతా రాజులుగా బతికారన్నారని రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ అన్నారు. రైతులకు ఎవరు ఏం చేశారో చర్చిద్దామన్న రేవంత్ ఛాలెంజ్‌ను స్వీకరించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాదు సోమజిగూడ ప్రెస్ క్లబ్ లో చర్చ చేద్దామన్నా నేపథ్యంలో మంగళవారం హైదరాబాదు లో తొలి సిఎం కేసీఆర్ ని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచింది కేసీఆర్ మాత్రమే అన్నారు. రేవంత్ పాలనలో రైతులకు చేసింది ఎమి లేదన్నారు. యావత్తూ తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలనను తిరిగి కోరుతున్నారన్నారు.

# తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందండి

- మునగ సాగుపై మక్కువ చూపండి
- రసాయనిక ఎరువులు తగ్గించండి
- టేకులపల్లి మండలంలో మునగ తోటలు సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**టేకులపల్లి, జూలై 8 (జనంసాక్షి) :** అధిక పెట్టుబడుల పంటలతో రైతులు నష్టపోకుండా తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందే పంటలను సాగు చేసుకోవాలని, మునగ సాగు ఎంతో లాభదాయకమైనదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు సూచించారు. మంగళవారం టేకులపల్లి మండలంలోని రాంపురం గ్రామపంచాయతీ నందు మునగ తోట సాగు చేస్తున్న రైతు గాంధీ మునగ తోటను సందర్శించి పంటసాగును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం పత్తి పంట సాగు చేస్తున్న రైతులు పత్తి పంటలో కూడా అంతర్పంటగా అందరూ మునగ తోటల పెంపకంపై మొగ్గు చూపాలని ఎక్కువ మొత్తంలో సాగు చేయాలని రైతులకు సూచించారు.మునగ తోటల వలన రైతులకు ఆకుల ద్వారా, కాయల ద్వారా, ఎండిన విత్తనాల ద్వారా అధిక ఆదాయం వస్తుందని తెలియజేశారు. భూసారం, అధిక పెట్టుబడులపై ప్రభావం చూపుతున్న రసాయనకి ఎరువులను తగ్గించుకోవాలని,రైతులు సొంతంగా బయో చారుకోల్ తయారు చేసుకోవాలని, మీ చేనులు అందుబాటులో ఉన్న కర్రలను పొలం చివరలో ఒక గొయ్యిలాగా తీసి దానిలో వేసి కాల్చి వచ్చిన బొగ్గులను ఆవు మూత్రం కలిపి దానిని ఎరువుగా ఉపయోగించుకొని రసాయనకి ఎరువులు వినియోగం తగ్గించాలని రైతులకు వివరించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో నీరు నిల్వ ఉన్నచోట ఇంకుడు గుంట నిర్మాణాలను వెంటనే చేపట్టి వర్షాకాలంలో వ్యాధులు రాకుండా నీరు నిలవ కుండా చూడాలని గ్రామస్తులను పంచాయతీ సిబ్బందిని ఆదేశించినారు. రైతులు వాణిజ్య పంటలే కాకుండా కూరగాయల సాగువలన అధిక ఆదాయం పొందవచ్చునని దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ పాలసీలను సిద్ధపరచుకోవాలనీ తెలిపారు. బోర్ బావి ఉన్న ప్రతి రైతు ఫారం పాండ్ నిర్మాణాలను చేపట్టుకోవాలని తర్వాత వాటిలో అజల్ల పెంపకం కొరమీను చేపల పెంపకం, బాతు పిల్లలు పెంపకం వంటివి ఏర్పాటు చేసుకోవాలని తద్వారా మీ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట టేకులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.మల్లేశ్వరి, తాహసిల్దార్ వీరభద్రం, మండల పంచాయతీ అధికారి జక్కుల గణేష్ గాంధీ, మండల వ్యవసాయ అధికారి నీరుడు అన్నపూర్ణ, ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమా అధికారి కాళంగి శ్రీనివాస్, ఇందిరా క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి గణపవరం రవికుమార్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మొగిలి తిరుపతయ్య, కార్యదర్శ రాజశేఖర్, సీసీలు శ్రీలత, కుమ్మరి సునీల్, సాంకేతక సహాయకుడు సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు సాగర్, వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యశ్రీ, రైతులు హరిజన, గాంధీ, బాలు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఫ్లాట్‌గా స్టాక్ మార్కెట్ సూచీలు

రేపే టారిఫ్ డెడ్‌లైన్..



**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే సోమవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:51 సమయానికి నిఫ 16 పాయింట్లు పెరిగి 25,479కు చేరింది. సెన్సెక్స్ 76 ప్లాయింట్లు పుంజుకుని 83,522 వద్ద ట్రేడవుతోంది. ప్రపంచాన్ని కుదిపేస్తున్న ట్రంప్ టారిఫ్ వార్‌పై త్వరలో కీలక ప్రకటన వెలువడనుంది. అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలకు 90 రోజుల సస్పెన్షన్ గడువు జులై 9తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొన్ని దేశాలు యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదర్చుకోగా.. భారత్ కూడా వాణిజ్య చర్చల్లో తలమునకలైంది. ఈ సంప్రదింపులు విజయవంతమై, డీల్ గనుక కుదిరితే మార్కెట్ సెంటిమెంట్ మరింత పుంజుకుంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# పెరుగుతున్న కార్మిక కొరత.. జనాభా సంక్షోభం

**ఇటలీ ప్రస్తుతం కార్మిక కొరత, జనాభా క్షీణత సమస్యలతో సతమతమవుతోంది. వాటిని పరిష్కరించడానికి ఆ దేశం కొన్ని సాహసోపేతమైన చర్యలు తీసుకుంటోంది.అందులో భాగంగా ఇటలీ ప్రభుత్వం 2026-2028 మధ్య యురోపియన్ యూనియన్‌యేతర పౌరులకు దాదాపు 5,00,000 వర్క్ వీసాలను జారీ చేసే ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించింది. ఈ వ్యూహాత్మక నిర్ణయం దేశ జనాభాను స్థిరపరుస్తూ, ఆర్థిక భవిష్యత్తుకు ఊతం ఇచ్చేలా ఉంటుందని నమ్ముతుంది. వర్క్ వీసా విస్తరణకు సంబంధించిన కీలక వివరాలు వచ్చే మూడేళ్లలో ఈయూయేతర పౌరులకు మొత్తం 4,97,550 వర్క్ పర్మిట్లు జారీ చేయాలని ఇటలీ యోచిస్తోంది.**

**జనంసాక్షి:**ఇది దేశంలోకి వచ్చే వలసదారులను గణనీయంగా పెంచుతుంది. స్థానికంగా లేబర్ మార్కెట్ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఇది హైలైట్ చేస్తుంది. ఈ విధానం ద్వారా సంవత్సరాల వారీగా కింద తెలిపినట్లు వర్క్ పర్మిట్లు జారీ చేయనున్నారు. 2026: 164,850 వర్క్ పర్మిట్లు,2027: 166,350 వర్క్ పర్మిట్లు,2028: 166,350 వర్క్ పర్మిట్లు, సిబ్బంది అవసరమయ్యే రంగాలు..
దేశవ్యాప్తంగా క్లిష్టమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న వివిధ రంగాలకు ఈ వీసాలను పంపిణీ చేయనున్నారు. అందులోని కొన్ని పరిశ్రమలు కింద ఇస్తున్నాం. వ్యవసాయం,నిర్మాణ రంగం,ఆరోగ్య సంరక్షణ (ముఖ్యంగా వైద్యులు, నర్సులు),టూరిజం, తయారీ రంగం,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌తో సహా డిజిటల్ సేవల రంగం. పైన తెలిపిన రంగాలు దేశీయ వీసా విధానం ద్వారా ఇటలీ ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు.
**ఎందుకు ఇలా చేస్తోందంటే..**



**లేబర్ కొరత:**ఇటలీ కంపెనీలు తమ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయడానికి నానా తంటాలు పడుతున్నాయి. వాస్తవానికి 70% కంటే ఎక్కువ ఇటాలియన్ కంపెనీలు కార్మికులను నియమించడంలో తీవ్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ కొరత దేశీయంగా అనేక పరిశ్రమల్లో విస్తరించింది. రెస్టారెంట్లు, హోటళ్లువంటి సర్వీసుల్లో 2,58,000 ఖాళీలు. 45,000 మంది వైద్యులు, 65,000 మంది నర్సులు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ఒత్తిడిని ఎత్తి చూపుతోంది. ఇంజినీరింగ్, గ్రీన్ ఎకానమీలో 2,80,000 మంది నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం. ఈ విభాగంలో ప్రతిభావంతులకు డిమాండ్ పెరుగుతోంది. డిజిటల్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్.
**జనాభా సంక్షోభం:**ఇటలీ జననాల రేటు తగ్గుతోంది. దాంతో జనాభా కుంటుపడుతోంది. 2024లో జనాభా 37,000 తగ్గింది. జననాల కంటే 2,81,000 ఎక్కువ మరణాలు సంభవించాయి. 2050 నాటికి ఇటలీలో 34% మంది 65 ఏళ్లు పైబడి వయసు ఉంటారని అంచనా. స్థిరమైన శ్రామిక శక్తి, ఆర్థిక వ్యవస్థను కొనసాగించడానికి ఇటలీ 2050 నాటికి సుమారు 10 మిలియన్ల(ఒక కోటి) వలసదారులను ఆకర్షించాల్సిన

## 5 లక్షల మందికి వీసా ఇచ్చేలా ప్రణాళికలు

అవసరం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కొత్తగా ప్రకటించిన వర్క్ వీసా ప్రోగ్రామ్ ఈ లక్ష్యసాధనలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు.
భారత్ ఎలా అర్థం చేసుకోవాలంటే..
వేగంగా పెరుగుతున్న శ్రామిక జనాభా ఉన్న భారతదేశం ఇటలీ వర్క్ వీసాలతో గణనీయంగా ప్రయోజనం పొందనుంది. భారత్‌లో ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి 'ఇరు దేశాల మధ్య సమన్వయం'గా ఈ వ్యవహారాన్ని అభివర్ణించారు. ముఖ్యంగా హెల్త్ కేర్, ఇంజినీరింగ్, హాస్పిటాలిటీ, ఐటీ వంటి రంగాల్లోని వారికి ఇటలీ లేబర్ మార్కెట్లో పుష్కలమైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు.
ఏయే రంగాల్లో ఎవరికి అవకాశం..
హెల్త్‌కేర్: డాక్టర్లు, నర్సులు, మెడికల్ ప్రొఫెషనల్స్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్: ఇటలీ పారిశ్రామిక రంగాలకు, గ్రీన్ ఎకానమీకి నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు అవసరం. హాస్పిటాలిటీ అండ్ టూరిజం: ఇటలీ గ్లోబల్ టూరిజం హబ్ కావడంతో ఆతిథ్య రంగంలోని కార్మికులకు గిరాకీ ఉంటుంది. డిజిటల్, ఐటీ: ఐటీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్ భారతీయ టెక్ ప్రతిభావంతులకు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో అవకాశాలను సృష్టిస్తుంది. ఇటలీ ప్రభుత్వం చట్టపరమైన వలసదారుల హక్కులను సంరక్షించేదుకు కట్టుబడి ఉందని తెలిపింది. అదేసమయంలో అక్రమవలసలకు సహించబోమని తేల్చి చెప్పింది. సురక్షితమైన, నియంత్రిత వలసలను ప్రోత్సహించే మార్గాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఇటువంటి వలసలకు సహాయపడే దేశాలకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పింది.
**ఇటలీ వర్క్ వీసా ఎలా దరఖాస్తు చేయాలంటే..**
జాబ్ ఆఫర్:వీసా కోసం దరఖాస్తు చేయడానికి ముందు ఇటలీలోని ఏదైనా ఒక సంస్థ నుంచి జాబ్ ఆఫర్ పొందాలి. ఈ ఆఫర్ ప్రోగ్రామ్‌లో పేర్కొన్న ప్రాధాన్య రంగాల్లో ఒకటిగా ఆ సంస్థ ఉండాలి. ఉదా: నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ సేవలు మొదలైనవి. వర్క్ పర్మిట్ ప్రోగ్రామ్‌లో పేర్కొన్న వీసా కేటగిరీలకు అనుగుణంగా జాబ్ ఉండేలా చూసుకోవాలి.
సంస్థ నుంచి నూలా ఓస్టా(వర్క్ పర్మిట్)
జాబ్ ఆఫర్ వచ్చిన తర్వాత తదుపరి దశతో కంపెనీ దరఖాస్తుదారుడి తరఫున నూలా ఓస్టా (వర్క్ పర్మిట్) కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇటలీలోని స్థానిక ఇమ్మిగ్రేషన్ కార్యాలయం ద్వారా ఇది జరుగుతుంది. సంబంధిత కొలువు కోసం ఈయూయేతర వక్తిని నియమించడానికి సంస్థకు అధికారం ఉందని నూలా ఓస్టా(వర్క్ పర్మిట్) తప్పనిసరిగా ధ్రువీకరించాల్సి ఉంటుంది.
అనుమతులు:తదుపరి దశలో అనుమతుల కోసం వేచి ఉండాలి. నూలా ఓస్టా ఆమోదం పొందినట్లయితే సంస్థకు ధ్రువీకరణ అందుతుంది. ఒకసారి పర్మిట్ మంజూరు చేసిన తర్వాత నూలా ఓస్టా వివరాలు భారతదేశంలోని ఇటలీ రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌కు పంపిస్తారు. ఆమోద ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. కాబట్టి ఓపికగా వేచి చూడాలి. తర్వాత మీకు సమాచారం అందిస్తారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.60 | ₹ 5.62 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 90,600 (22 క్యారెట్లు) | ₹ 98,840 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,19,900

# వయసు 34.. 10 ఏళ్లు ఉద్యోగం.. పొదుపు రూ.4 కోట్లు

**జనంసాక్షి:**మారుమూల గ్రామంలో పుట్టిన ఓ టెక్కీ చదువు పూర్తయిన తర్వాత 10 ఏళ్లు ఉద్యోగం చేసి తన 34వ ఏట ఏకంగా రూ.4 కోట్ల కార్పస్ సృష్టించాడు. ఈమేరకు ఆయన అనుసరించిన ఆర్థిక విధానాలు, క్రమశిక్షణ గురించి తెలుపుతూ రెడ్డిట్‌లో వివరాలు పోస్ట్ చేశాడు. దాంతో అదికాస్తా వైరల్‌గా మారింది.ప్రస్తుతం వైరల్



అవుతున్న ఈ పోస్ట్ 'ఆర్/నోయిడా' అనే రెడ్డిట్ కమ్యూనిటీ లో వెలసింది. అందులో 'ఈ రోజు నాకు 34 ఏళ్లు. వ్యక్తిగతంగా నేను రూ.4 కోట్లు పొదుపు చేశాను. ఎలాంటి ఆర్థిక వారసత్వం లేదు. లాటరీలు లేవు. పదేళ్లు నిరంతర కృషి, సహనం, క్రమశిక్షణతో కూడిన జీవనంతోనే ఇది సాధ్యమైంది. నేను ఒక చిన్న పల్లెటూరులో పుట్టి పెరిగాను. హిందీ మీడియం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. మా నాన్న రోజువారీ కూలీ. నిత్యం కుటుంబ పోషణకు సరిపడా మాత్రమే సంపాదించేవాడు. ఆ సమయంలో తాను ఎలా గోలా నాకు కొన్ని పుస్తకాలు కొని, ఎన్నో మంచి విషయాలు పంచుకున్నాడు. ఆయన ఒకసారి నాతో మాట్లాడుతూ.. నా వల్ల ప్రజలు మా నాన్నను గుర్తించిన రోజే తనకు గర్వంగా ఉంటుందన్నారు. ఆ వాక్యం నా మనసులోనే ఉండిపోయింది' అన్నారు.'ఆకలి ఎలా ఉంటుందో నాకు ఇంకా గుర్తుంది. నేను అనుకోకుండా కంప్యూటర్‌లోని కొన్ని టెక్నాలజీలను కనుగొన్నాను. నేను వాటితో ప్రేమలో పడ్డాను. నెమ్మదిగా అవి నా చుట్టూ ఉన్న జీవితాన్ని మార్చడం ప్రారంభించాయి. దాంతో టెక్నాలజీ రంగంలో మంచి ఉద్యోగం వచ్చింది. చిత్తశుద్ధితో పనిచేశాను. అనవసర ఖర్చులను తగ్గించాను. తెలివిగా పొదుపు చేశాను. చివరికి పార్ట్ టైమ్‌గా ట్రేడింగ్ ప్రారంభించాను. నాకు గురువు లేదు. నా తప్పుల నుంచి, యూట్యూబ్‌లో ఉచిత కంటెంట్ ద్వారా, కొన్ని పుస్తకాల నుంచి ఎంతో నేర్చుకున్నాను' అని చెప్పారు.
'ఎక్కడో ఒక చిన్న గ్రామంలో లేదా ఏదో పట్టణంలో ఎవరైనా నిస్సహాయతతో ఉండవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వ్యక్తి.. తమ ఇంగ్లిష్ బాగోలేదని నమ్మే వ్యక్తి.. కలలు కేవలం ధనవంతుల కోసమే అనుకునే వ్యక్తులు ఉండవచ్చు. నేను ఆర్థికంగా సాధించగలిగింది.. మీరూ సాధిస్తారు. మీరు అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడాల్సిన అవసరం లేదు. పెద్ద డిగ్రీలు వద్దు. కానీ, జీవితంగా ఎదగాలంటే పట్టుదల, గెలుస్తామనే తపన, మీపై నమ్మకం ఉండాలి' అన్నారు.



# బంగారం దోబూచులాట

పసిడి కొనుగోలుదారులను ఆడేసుకుంటోంది.ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర ఇటీవల తగ్గినట్లే తగ్గి మళ్లీ ఈ రోజు పుంజుకుంది. సోమవారంతో పోలిస్తే మంగళవారం బంగారం ధర పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.

# రష్యా మంత్రి ఆత్మహత్య

**సస్పెన్షన్‌కు గురైన గంటల్లోనే ఘటన**

మాస్కో: ఉక్రెయిన్ డ్రోన్ దాడుల కారణంగా గత వారం రాజధాని మాస్కోతోపాటు, సెయింట్ పీటర్స్‌బర్గ్ తదితర ప్రాంతాల్లోని విమానాశ్రయాల్లో వందలాది విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. వేలాదిగా ప్రయాణికులు గంటలపాటు విమానాశ్రయాల్లో వేచి ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు పుతిన్ సోమవారం రవాణా శాఖ మంత్రి రోమాన్ స్టరొవోయ్(53)ను సస్పెండ్ చేశారు. డిప్యూటీ మంత్రి ఆంద్రీ నికిటిన్‌కు రవాణా శాఖ బాధ్యతలను తాత్కాలికంగా అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే స్టరొవోయ్ తన నివాసంలో తుపాకీ గాయాలతో విగతజీవిగా కనిపించారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. 2024 మేలో రవాణా శాఖ మంత్రిగా స్టరొవోయ్ బాధ్యతలు చేపట్టారు.



# రసకందాయంలో బెంగుళూరు రాజకీయం

## వందమంది ఎమ్మెల్యేల మద్దతు.. సీఎంగా డీకే శివకుమార్?

**బెంగళూరు(జనంసాక్షి):**కర్ణాటక కాంగ్రెస్ రాజకీయం రసకందాయంలో పడింది. డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలంటూ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బాంబు పేల్చారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం మంది ఎమ్మెల్యేలు డీకేఎస్ వెంట ఉన్నారంటూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయంగా మారాయి. ఈ క్రమంలో డీకేఎస్ సైతం హస్తినలో పర్యటించడం.. రాష్ట్రంలో సీఎం, డిప్యూటీ సీఎం పదవుల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఎందుకంటే? 2023లో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సిద్ధరామయ్యకు సీఎం పదవి, డీకేఎస్‌కు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టింది. ఆ సమయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై డీకేఎస్ వర్గం అంతర్గతంగా అసంతృప్తిని వ్యక్తం చేసింది. పైకి మాత్రం సిద్ధరామయ్య 2.5



సంవత్సరాలు, తర్వాత డీకే శివకుమార్ సీఎం అయ్యేలా ఒప్పందాలు జరిగాయంటూ ప్రచారం చేసింది. ఇప్పుడు ఆ 2.5 సంవత్సరాల గడువు సెప్టెంబర్‌లో ముగియనుండటంతో, డీకే శివకుమార్ మద్దతు దారులు మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ మాట్లాడుతూ.. 'అవును, చాలా మంది ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌ను సీఎం చేయాలని కోరుతున్నారు. మా జిల్లా ప్రజలు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు' అని చెప్పారు. మరో ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలోని 100 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్నారు అని పునరుద్ఘాటించారు. కర్ణాటక రాజకీయంపై ఇప్పటికే ఆ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలాకీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరికీ ఆశ ఉండొచ్చు. కానీ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు . గతంలో ఇదే వివాదాన్ని పరిష్కరించేందుకు పార్టీ అధిష్టానం రణదీప్ సూర్జేవాలాను మధ్యవర్తిగా వ్యవహరించారు. మరోవైపు తనని సీఎంను చేయాలంటూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న డిమాండ్లపై డీకే శివకుమార్ స్పందించారు. నా కోసం మాట్లాడమని నేను ఎవరికీ చెప్పలేదు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అది శిరోధార్యమని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం మాత్రం సిద్ధరామయ్యను మార్చే ఉద్దేశం లేదని అధికారికంగా ఆయనను మార్చే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. సిద్ధరామయ్యను కొనసాగించాలనే వైఖరిలోనే ఉంది. కానీ డీకే శివకుమార్ వర్గం నుంచి వచ్చే ఒత్తిడి, ఎమ్మెల్యేల మద్దతు,2028 ఎన్నికల దృష్ట్యా పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందేమోనని డీకే వర్గం భావిస్తోంది. మరి ముందుముందు ఏమవుతుందో చూడాలి మరి

# మమ్దానీని మెడకు పాత పోస్టుల ఉచ్చు



న్యూయార్క్: న్యూయార్క్ నగర మేయర్ పదవికి పోటీ పడుతున్న జొహ్రాన్ మమ్దానీ చిక్కుల్లో పడ్డారు. 2015లో మమ్దానీ 'ఎక్స్'లో అల్ ఖైదా ఉగ్రవాదికి అనుకూలంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అతడిని వెంటాడుతున్నాయి. అమెరికాలో జన్మించిన అన్వర్ అల్-ఔలాకీ అనే మత బోధకుడు తీవ్రవాదం బాట పట్టడానికి ఎఫ్‌బీఐ నిఘా కారణం కావచ్చు అంటూ అప్పట్లో ఆయన వ్యాఖ్యలు చేశారు. దీంతో, ?ఆయన అప్పటి వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త చర్చకు దారి తీశాయి. అయితే, వందశాతం కమ్యూనిస్ట్ పిచ్చోడంటూ మమ్దానీని ఉద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించిన తర్వాతర ఆయన పాత పోస్టులు తాజాగా వెలుగు చూశాయి. న్యూమెక్సికోలో యెమెన్ దేశస్తుల కుటుంబంలో జన్మించిన ఔలాకీ అమెరికాలోని మసీదుల్లో బోధనలు చేసేవాడు. అటు తర్వాత అల్‌ఖైదాలో అగ్ర నాయకుల్లో ఒకడయ్యాడు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్, పెంటగాన్ తదితరాలపై 2001 సెప్టెంబర్ 11న దాడులకు పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులు ఇతడికి సన్నిహితులని తేలడంతో ఎఫ్‌బీఐ నిఘా పెంచింది. అటు తర్వాత అతడు 2004లో యెమెన్‌కు వెళ్లిపోయాడు. అమెరికా ఆస్తులపై దాడులు ఇతడు ఉగ్రవాదులకు పిలుపు ఇచ్చాడనే ఆరోపణలపై 2011లో అధ్యక్షుడు ఒబామా ఆదేశాల మేరకు యెమెన్‌పై జరిపిన డ్రోన్ దాడుల్లో హతమయ్యాడు. ఎలాంటి నేరారోపణలు లేని అమెరికా పౌరుడిని ప్రభుత్వమే చంపడం అసాధారణ విషయమని న్యూయార్క్ పోస్ట్ అప్పట్లో వ్యాఖ్యానించింది.

# ప్రతీ ఏడాది అక్టోబర్ 3న మరాఠీ భాషా దినోత్సవం

- అదే తేదీ నుంచి వరుసగా ఏడురోజుల పాటు భాషా వారోత్సవాలు
- తీర్మానం విడుదల చేసిన ప్రభుత్వం
- అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కాలేజీలు, స్కూళ్లలో విధిగా నిర్వహించాలని ఆదేశం

**ముంబై:** గత ఏడాది మరాఠీకి శాస్త్రీయ భాష హోదా లభించిన నేపథ్యంలో ఇకపై ప్రతి సంవత్సరం అక్టోబర్ 3న 'శాస్త్రీయ మరాఠీ భాషా దినోత్సవం'గా జరపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, అక్టోబర్ 3 నుంచి 9 వరకు ప్రతి సంవత్సరం 'శాస్త్రీయ మరాఠీ భాషా వారోత్సవాలు'జరపాలని పేర్కొంటూ తీర్మానాన్ని విడుదల చేసింది. ప్రాచీన మరాఠీ భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వాలపై అవగాహన పెంపొందించడం, వాటిని సంరక్షించడమే ఈ తీర్మానం లక్ష్యమని పేర్కొంది. ఈ తీర్మానునుసరించి నిర్దేశిత వారంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, ఆర్థిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు ఈ తీర్మానాన్న నుసరించి భాషా సంరక్షణకు సంబంధించి ఉపన్యా సాలు, సెమినార్లు, పురాతన గ్రంథాలు, శాసనాల ప్రదర్శనలు, క్విజ్‌లు, వ్యాస పోటీలు, ఇతర విద్యా, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. పురాతన రచనల డిజిటలైజేషన్, శాస్త్రీయ గ్రంథాలను ఆధునిక మరాఠీలోకి అనువదించడం , భాషా సంరక్షణ పద్ధతులపై డాక్యుమెంటరీల ప్రదర్శనల వంటి కార్యక్రమాలు చేపట్టాల్సిఉంటుంది. అరుదైన లిఖిత ప్రతులు, పురాతన రాగి ఫలక శాసనాల ప్రదర్శనలు విద్యార్థులు, ప్రజలను మరాఠీ భాష, సంప్రదాయంతో అనుసంధానించేందుకు ఎంతోగానో తోడ్పడతాయని జీఆర్‌లో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లను మరాఠీ భాషా కమిటీలకు అధిపతులుగా నియమించారు. వీరు కార్యక్రమాల ప్రణాళిక రూపకల్పన, వాటి అమలును పర్యవేక్షించాల్సి ఉంటుందని కోరారు.




# హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ క్యాంపస్

- ఎంటైన్ ఇండియాగా ఐవీ రిబ్రాండ్..
- 3,400 మందికి ఉపాధి

గ్లోబల్ స్పోర్ట్స్, గేమింగ్ లీడర్‌గా ఉన్న ఎంటైన్ సంస్థకు చెందిన టెక్నాలజీ విభాగం ఐవీ అధికారికంగా ఎంటైన్ ఇండియాగా రీబ్రాండ్ అయి హైదరాబాద్‌లో డిజిటల్ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. కొత్త హైదరాబాద్ క్యాంపస్ ఎంటైన్ అంతర్జాతీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారనుందని కంపెనీ పేర్కొంది. ఈ సంస్థలో పని చేసేందుకు హైబ్రిడ్ రోల్స్‌లో 3,400 మంది హైస్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు చోటు కల్పించేలా ఈ గ్లోబల్ క్యాబిలిటీ సెంటర్(జీసీసీ)ఫెసిలిటీని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఎంటైన్ హైదరాబాద్ క్యాంపస్ ద్వారా గ్లోబల్ టెక్ సేవల్లో 85% పైగా సర్వీసులు అందించడానికి దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పింది. ఇందులో సేవలందించే అడ్వాన్స్‌డ్ డొమైన్‌లు కింది విధంగా ఉన్నాయి.
కృత్రిమ మేధ:
ప్లాట్ ఫాం ఇంజినీరింగ్. రియల్ టైమ్ ట్రేడింగ్ సిస్టమ్స్. గ్లోబల్ సస్టెయినబిలిటీ లక్ష్యాలకు అనుగుణంగా హైదరాబాద్ క్యాంపస్‌లోని సదుపాయాలు..
స్మార్ట్ లైటింగ్ వ్యవస్థలు. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్లు. పర్యావరణహిత నిర్మాణ సామగ్రి. ఈ రీబ్రాండ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతపై ఎంటైన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అంతిల్ అన్నగన్ మాట్లాడుతూ..'ఎంటైన్ ఇండియా ద్వారా హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ సర్వీసులు అందించ బోతున్నందుకు సంతోషంగా ఉంది. ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ భవిష్య త్తును ఇక్కడి నుంచి శక్తివంతం చేయడం గర్వంగా ఉంది' అన్నారు. ఎంటైన్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ సాటీ బెన్స్ మాట్లాడుతూ..'తదుపరి తరం వినోద వేదికలను నిర్మించాలనే మా ఆశయానికి భారతదేశం కేంద్రబిందువుగా మారింది. హైదరాబాద్‌లో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయడం ఆ దిశగా కంపెనీ వేసిన సాహసోపేతమైన ముందడుగు' అని అన్నారు.

# స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న రైలు

**ముగ్గురు విద్యార్థులు మృతి**

**తమిళనాడు కడలూరులో ఘోర ప్రమాదం..**

దాటుతున్న స్కూల్ వ్యాన్‌ను వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో వ్యాను చాలా దూరం ఎగిరిపడింది. ఆ వ్యానులోని ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొంతమంది గాయపడ్డారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక్కడి రైల్వే క్రాసింగ్ వద్ద కాపలా లేకపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# డివిజన్‌ల పెంపుదలతో రిక్షా కార్మికుల సంఖ్యను పెంచండి

- రిక్షా కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించండి
- కనీస వేతనాలు అమలు చేసి.. సమస్యలు పరిష్కరించాలి
- కమీషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన మద్దెల దినేష్



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న రిక్షా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో కమీషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు లిమద్దెల దినేష్‌లి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ చేసే రిక్షా, ట్రాలీ కార్మికులు 118 మంది వరకు ఉన్నారని, కార్మికు ల సంఖ్య తక్కువ ఉండటం వలన, వారి పై పని భారం పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారని,ఈ మధ్యనే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని రాష్ట్ర ప్రభుత్వం పెంచి నందున, ప్రస్తుతం 50 డివిజన్ల కు గాను 60 డివిజన్లు పెంచడం వల్ల పని విస్తరణ పెరుగుతున్నదని, కార్మికుల సం ఖ్య తక్కువ ఉండటం వలన అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కనుక కార్మికుల సంఖ్యను పెంచాలని ఆయన కమీషనర్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు అదేవిధంగా ప్రస్తుతము ఉన్నటువంటి కార్మికులకు ఇస్తున్న జీతాలు అతి తక్కువ గా చెల్లిస్తున్నారని, కనుక వీళ్ళకు కనీస వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు, అలాకాకుండా రాక్ పిక్కర్ కార్మికులను అవుట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి అన్ని డివిజన్లో కార్మికుల పని విభజన చేసి అందరికీ సమానమైన జీతాలను అందించ వలసిందిగా ఆయన కోరారు. నిత్యం ఈ పని పైనే ఆధారపడి జీవించే బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళ కార్మికులే కనుక వీళ్ళ జీతాలను రివాల్వింగ్ పండుతో సరిపెట్టకుండా కనీస వేతనాలు అమలయ్యే విధంగా కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇట్టి కార్మికులు పారిశుద్ధ్య ఇంటింటి చెత్త సేకరణ తోపాటు వార్డులో వూడవటం, ట్రాక్టర్ పైన వెళ్లడం, కాలువలు మరియు ఇతర పనులకు కూడా ఇంటింటి చెత్త కార్మికులను వాడుకుంటున్నారని, వీరికి సంబంధించిన సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. దీనివల్ల కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారని, వీరికి కనీస వైద్య సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అదే విధముగా కొంత మంది డ్రైవర్లు, ఒక్కరిద్దరు సూపర్వైజర్ లు వారి నోటికి వచ్చిన విధంగా మాట్లాడడం మహిళా కార్మికులను అగౌరవం పరచడం సరైంది కాదని, మహిళా కార్మికులను వేదింపులకు గురి చేస్తున్న వారిని ప్రభుత్వం పరంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కామారెడ్డి సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడతా

- రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**నిజామాబాద్ జూలై 07 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించి, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవ్ రెడ్డితో కలిసి రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ లైన్ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, వైద్య ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా, అటవీ భూముల ఆక్రమణలు, మహిళా సంఘాలకు రుణాల వంటి అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అదనపు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూములు ఎంపిక చేసి ప్రతిపాదనలు సమర్పించాలని, డిప్యూటీ ముఖ్యమంత్రితో చర్చించి సబ్‌స్టేషన్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల్లో పెండింగ్ కాల్వ నిర్మాణం, భూ సేకరణకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని, సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలపై నివేదిక అందించాలని సూచించారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి జూలై 9 నాటికి ప్రతిపాదనలు సమర్పిస్తే క్యాబినెట్ సమావేశంలో ఆమోదం పొందుతాయని తెలిపారు. కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో రిమోట్ ప్రాంతంగా ఉందని, 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, జాతీయ రహదారి సమీపంలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్న రకం ధాన్యం, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఎరువుల వాడకం తగ్గించాలని, భూసారం కాపాడాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్‌ను పకడ్బందీగా చేయాలని, రికార్డులు వాస్తవ పరిస్థితులకు సరిపడాలని హెచ్చరించారు. వ్యవసాయ పనిముట్ల సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులను ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలని కలెక్టర్‌కు సూచించారు. త్రాగునీటి సమస్యలు లేకుండా అదనపు పైప్‌లైన్, బోర్‌వెల్స్ పనులకు సర్వే చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు దశలవారీగా అర్హులందరికీ అందజేస్తామని, మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని, 5 లక్షల రూపాయలను నాలుగు దశల్లో లబ్ధిదారుల ఖాతాల్లో గ్రీన్ ఛానల్ ద్వారా జమ చేస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు లక్షల మేరకు అందజేయాలని, అటవీ భూముల ఆక్రమణ జరగకుండా జాగ్రత్త వహించాలని, పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు ఇబ్బందులు కలిగించవద్దని, అటవీ ప్రాంతంలో పాత రోడ్ల మరమ్మత్తు, పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, మంత్రి ఆదేశాల మేరకు ఆసుపత్రి నిర్మాణ ప్రతిపాదనలు సమర్పిస్తామని, మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్, పెట్రోల్ బంక్, రైస్ మిల్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# వేములవాడలో ప్రైవేటు పాఠశాలలో తనిఖీలు

- షోకాస్ నోటీసులు జారీ.. వివరణకు గడువు
- నిబంధనలను వివరించేందుకు డిఈఓ విముఖత
- ప్రజావాణి ఫిర్యాదుపై విద్యార్థికి టీసి ఇప్పించిన తీరు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/వేములవాడ జులై 8 (జనంసాక్షి) :**
వేములవాడలో కొత్తగా నెలకొల్పిన ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు విషయమై జిల్లా విద్యాధికారి వినోద్ మండల విద్యాధికారి బన్నాజీ మంగళవారం పలు పాఠశాలలను పర్యవేక్షించారు. పాఠశాల నిర్వాహకులను సంబంధిత స్కూల్ నిర్వహణకు ఉన్న అనుమతి పత్రాలను చూపాలని ఆదేశించారు. తమ వద్ద ఉన్న పత్రాలు పరిశీలించిన అధికారులు వారికి ఒక రోజు గడువునిచ్చి సకాలంలో తమ పాఠశాల గుర్తింపుకు సంబంధించిన పత్రాలను సమర్పించా లని ఆదేశించారు.

**విద్యార్థి టీసీ అప్పగింత..**
వేములవాడలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యానభ్యసించిన విద్యార్థికి సంబంధించిన ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టీసీ) ఇవ్వడం లేదని వచ్చిన ప్రజావాణి లో ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి సంబంధిత విద్యాసంస్థలు బాధ్యులతో మాట్లాడి విద్యార్థికి టీసీ వచ్చేలా చేశారు. అదే స్కూలుకు రెండవ బ్రాంచ్ కి అనుమతి లేదంటూ తనిఖీ కోసం వచ్చిన డీఈవో గంట వరకు పాఠశాలలో ఉన్నప్పటికీ యజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

ఇదే తీరుపై మీడియా అసలు పర్యవేక్షణకు గల కారణాలు ఏమని ప్రశ్నించగా తనకేమీ తెలియదంటూ కోర్టు ఆదేశాలతో పాటు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పాఠశాల పర్యవేక్షణకు వచ్చినట్లు డీఈవో వెల్లడించారు. మండల విద్యాధికారి బన్నాజీ మాట్లాడుతూ మండల కేంద్రం లో కొత్తగా ఏర్పడిన పాఠశాలలో ఇతర అంశాలపై వచ్చిన ఫిర్యాదులతో పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

**నిబంధన మాటేంటి..**
పాఠశాలలో తనిఖీ కోసం వచ్చిన విద్యాధికారులు అసలు పాఠశాల నిర్వహణకు నిబంధనలు ఏముంటాయన్న విషయాన్ని విలేకరులు అడిగిన సమాధానం ఇవ్వకపోవడం ఒక్కింత అనుమానాలకు తావిస్తోంది. కొత్తగా ఏర్పడిన పాఠశాలలపై పర్యవేక్షించిన అధికారులు ఉన్న పాఠశాలల నిబంధనలను ఎందుకు పరిశీలించడం లేదని కొందరు ప్రశ్నించిన వాటికి దాటవేసే ధోరణిలోనే అధికారులు సమాధానం ఇచ్చారు.

అనుమతి లేకుండా ఇష్టా రీతిగా విద్యా సంస్థలను నడిపించే వారిని నియంత్రించే అధికారులు నిబంధనలను ముందుగా వెల్లడించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా విద్యాధికారులు అన్ని పాఠశాలల పత్రాలను పరిశీలించి విద్యార్థులకు విద్యా సంవత్సరం ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



## 18 సం.లు నిండిన ప్రతి మహిళను మహిళా సంఘంలో చేర్చుకోవాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 8 (జనం సాక్షి) :**
ఇందిరా మహిళాశక్తిలో భాగంగా కామారెడ్డి మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తిలో భాగంగా ప్రతి 18 సంవత్సరాలు నిండిన మహిళ సంఘం నందు సభ్యత్వం తీసుకోవాలి తీసుకునేలా సిబ్బంది చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్యాడి కొనుగోలు కేంద్రాలు ఈసారి బాగా చేశారు. ఇక ముందు కొనుగోలు కేంద్రాలు పెరుగుతాయి ఇంకా బాగా పనిచేయాలని తెలియజేశారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ టార్గెట్ ను 100% పూర్తి చేయాలని సూచించారు. మరియు డ్రోన్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయ సంబంధ ఎరువులు మరియు పురుగు మందులు పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణం మండల సమాఖ్య వారు పర్యవేక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, డిఆర్డిఓ సురేందర్, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, డిపిఎం ఫైనాన్స్ రాజయ్య, ఎంపీడీవో ఎఫ్సిబా, మండల సమాఖ్య ఏపీఎం మోహిజ్, సీసీలు విశ్వనాథం, అంజాగౌడ్, స్వరూప,సంజీవులు, వివో ఏలు మండల సమాఖ్య పాలకవర్గం అధ్యక్షులు గోదావరి,కార్యదర్శి సరస్వతి, కోశాధికారి పూజ, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రేరేపిత సమ్మెకు బిఎంఎస్ఆర్‌పి దూరం

**రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :**
భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ బుధవారం రోజున జరిగే సమ్మెకు దూరంగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రోజున ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎనమల్ల నరేష్ ని బిఎంఎస్ఆర్‌పి నాయకులు కలిసి మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి బుదవారం రోజు యధావిధిగా డాక్టర్ కాల్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్లను ప్రవేశపెట్టగా బిఎంఎస్ కార్మికుల సంక్షేమం కోసం రెండు కోడ్‌లను స్వీకరించి, కార్మికులకు ఉపయోగంలేని రెండుఇంటిని వ్యతిరేకిస్తుందన్నారు. కానీ కొన్ని సంఘాలు గుడ్డిగా అన్ని కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఉన్నారు. కార్మికుల అభివృద్ధి కోసం బిఎంఎస్ ఎంత వరకు ఐన పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాదాసు విక్రమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వనమాహొత్సవం కార్యక్రమంలో జిల్లా అధికారి శేషాద్రి

**ముస్తాబాద్ జులై 8 (జనం సాక్షి):**
ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి గ్రామంలోని మాదాలమ్మ గుడి వద్ద వనమహొత్సవం కార్యక్రమంలో భాగంగా తీసిన కమ్యూనిటీ ప్లాంటేషన్ గుంతలు పరిశీలించా రు. ఇంకొక వర్షం తర్వాత మొక్కలు నాటాలని తెలిపారు. జిల్లాలో ముఖ్యంగా గౌడ సంఘం భూములలో ఈత మొక్కలు నాటుటకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపినారు దీనికి సంబంధించి ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వాళ్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి బీరయ్య, మండల ఉపాధి అధికారి ఆనంద్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ ఉపాధి పిడ్ అసిస్టెంట్ కొమట శీను, ఉపాధి కూలీలు పాల్గొన్నారు

# 9న తలపెట్టిన కార్మిక సంఘాలు సమ్మెకు దూరంగా ఉండండి

- విధులకు హాజరు కండి.. లక్ష్య సాధనలో సహకరించండి
- డైరక్టర్(పిఅండ్‌పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు



**గోదావరిఖని, జనంసాక్షి :**
కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో జూలై9వ తేదీన దేశ వ్యాప్తముగా తలపెట్టిన ఒకరోజు సార్వత్రిక సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా కొరకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలను తీసుకోవాలని డైరక్టర్(పిపి) కే.వెంకటేశ్వర్లు డైరక్టర్(పా) శ్రీ గౌతమ్ పొట్రు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్షను నిర్వహించారు. ఈ సంధర్భముగా డైరక్టర్(పి అండ్‌పి) కే.వెంకటేశ్వర్లు.. డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో జూలై 9వ తేదీన ఒకరోజు సమ్మెకు పిలుపునిస్తూ సింగరేణి కార్మికులు కూడా దీనిలో పాల్గొనాలని పిలుపునిచ్చాయి. కానీ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావు అని, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి కూడా కావు అని. సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం కలదు అని తెలిపారు.
ఇప్పటికే వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరం లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి మరియు ఓవర్ బర్డెన్ తొలగింపు లలో కొంత వెనకబడి ఉన్నామని, ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతిరోజు సాధించే ఉత్పత్తికూడా ఎంతో తోడ్పాటునందిస్తుందని అదే విధముగా నిరంతరాయముగా విద్యుత్ సరఫరా జరగడానికి మనం నిర్దేశించిన ఉత్పత్తి సాదిస్తూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు

మనం ఒక్కరోజు సమ్మె చేస్తే సంస్థ నష్ట పోయే ఉత్పత్తి విలువ సుమారు రూ.76 కోట్లు ఉంటుంది అని అలాగే కార్మికులు సుమారు రూ.13.07కోట్ల వేతనాలు కోల్పోతారని తెలిపారు.

గత ఆర్థిక సంవత్సరం 2024-25లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగినది. లాభాల బోనస్, పిఎల్ఆర్ బోనస్లు ఉద్యోగులకు చెల్లించడం జరుగుతున్నది. వివిధ సంక్షేమ పథకాలను కూడా అమలు చేయడం జరుగుతున్నది.
ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (జులై 1 వ తేదీ) మనం 16.26 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాం. ఈ ఆర్థిక సంవత్సర (2025-26) ఉత్పత్తి లక్ష్యమైన 72 మిలియన్ టన్నులకు గాను జూలై 1వ తేదీ వరకు 22.4 % మాత్రమే ఉత్పత్తి సాధించాం అని తెలిపారు. కావున జూలై 9వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండి విధులకు హాజరయి 2025-26 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఈ సంధర్భముగా విజ్ఞప్తి చేశారు.
అనంతరం అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, రవాణా కొరకు ఎటువంటి ఆటంకం కలుగ చర్యలను తీసుకోవాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డైరక్టర్(పి అండ్ పి) కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రుతో పాటు జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం శ్రీమతి కవితా నాయుడు, జిఎం(సెక్యూరిటీ) సిహెచ్.లక్ష్మినారాయణ, అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లు, డిజిఎం (ఐఆర్ వింగ్)లు కే.అజయ్ కుమార్, వైవిఎల్ వరప్రసాద్, బి.రాజగోపాల్, ఎస్ఓ టు జిఎం సెక్యూరిటీ జే. వేణు మాధవ్సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సైన్, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను

# ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 8 (జనం సాక్షి) :**
ఇందిరానగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో వారు చదువుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కలిపిస్తున్న మౌళిక వసతులు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనం పై విద్యార్థులతో చర్చించడం జరిగింది. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడం జరిగింది. విద్యార్థులందరికీ ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని మధ్యాహ్న భోజనం ఏజెన్సీని ఆదేశించడం జరిగింది.
ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా పాఠశాలలో విద్యార్థులందరికీ అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. విద్యార్థులందరూ ప్రతిరోజు పాఠశాలకి ఏకరూప దుస్తులలో వచ్చే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించడం జరిగింది పాఠశాలలో ప్రతి విద్యార్థి ఏక్ పెడ్ మా కె నామ్ అనే కార్యక్రమం కింద ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక చెట్టు నాటాలని ఆ చెట్టును సంరక్షించే బాధ్యత ఆ విద్యార్థి తీసుకోవాలని ఆ చెట్టుకు ప్రతిరోజు నీళ్లు పోసి దాని రక్షణ బాధ్యత ఆ విద్యార్థి పూర్తిగా తీసుకోవాలని సూచించడం జరిగింది. సెలవులో వెళ్లే ఉపాధ్యాయులు ముందస్తుగా ప్రధానోపాధ్యాయుల అనుమతి తీసుకోవాలని సూచించడం జరిగింది. విద్యార్థులందరికీ రెండవ జత యూనిఫామ్ పంపిణీని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా ,మండల విద్యాధికారి, అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ అమలు.. కార్మిక హక్కులపై వేటు

- నేటి దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- జేపీసీ కన్వీనర్ కోట రవీందర్ రెడ్డి



**మంథని, (జనంసాక్షి) :** అర్జీ త్రి ఏరియాలోని ఓసిపి టు, ఓసిపి వన్ ,ప్రైవేట్ సి ఫైవ్ కంపెనీ లలో సింగరేణి కార్మిక యూనియన్ జేపీసీ ఆధ్వర్యంలో జులై 9 వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయుటలో భాగంగా మంగళవారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా సి ఫైవ్ కంపెనీ నందు జరిగిన మీటింగ్ లో జేఏసీ కన్వీనర్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి తో పాటు ఎఐటియుసి సెక్రటరీ వైవీ రావు, సీఐటియు బ్రాంచ్ సెక్రెటరీ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్స్ లను అమలు చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీని వల్ల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అందే అవకాశం ఉండదు, కార్మికులు పొందే అలవెన్స్ కోత, పనిగంటలు రోజుకు 8 గంటలు అని చెపుతూనే 12 గంటలు చేయించుకోండి అని చట్టంలో తెలిపారు ఇట్టి పని వేళలు కార్మికుని ఆరోగ్యము, మానసిక పరిస్థితి పై ప్రభావం చూపుతుంది, బొగ్గు గనులను అమ్మకానికి పెట్టడం వల్ల సింగరేణికి కొత్త బ్లాకు ఇవ్వడం లేదు ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో కార్మికులు కట్టు బానిసలుగా మారుతారు రిజర్వేషన్ల పరంగా ఉద్యోగాలు ఉండవు ఇలాంటి అనేక కార్మికుల అంధకారం చేసే లేబర్ కోడ్ లనూ వెంటనే ఉపసంహరించుకొవలని లేనిచే పెద్ద ఎత్తున ఉద్యమాలకు పిలుపునివ్వడం జరుగుతుందని. రేపు జరగబోయే సమ్మెలో దేశంలోని అన్ని రకాల సంస్థల కార్మికులు పాల్గొనడం జరుగుతుంది. కావున కార్మికులందరూ సమ్మె విచ్చిన్నానికి ప్రయత్నం చేయకుండా విజయవంతం చేయడం ద్వారా లేబర్ కోడ్స్ అమలు ప్రతిపాదనను తిప్పి కొట్టాలని కార్మిక వర్గానికి సింగరేణి కార్మిక జేపీసీ పక్షాన పిలుపునివ్వడం జరుగుతుంది. ఇలా మరెన్నో కార్మికుల హక్కులు కాల రాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేపీసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్దే లక్ష్యం

- అగ్రహారం అంజన్న ఆలయంలో రూ 34.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 8 (జనంసాక్షి) :**
వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అగ్రహారంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మార్బుల్ ఫ్లోరింగ్ పనుల కోసం రూ.34.50 లక్షల సాండ్ ఫండ్ మంజూరు చేసి మంగళవారం భూమి పూజ నిర్వహించగా, ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నట్లు, ఈ నెల మూడో వారంలో రూ.76 కోట్ల పనులకు టెండర్ కానున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు ఇటీవల ప్రారంభమైనట్లు, వీటీడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సమగ్ర ప్రణాళికతో పనులు వేగంగా సాగుతున్నట్లు వివరించారు. రాజన్న ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో, సౌకర్యాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు, భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు.

భక్తుల రద్దీతో వేములవాడలో చిరు వ్యాపారులు, వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, అగ్రహారం అంజన్న ఆలయంలో ఇటీవల ప్రాకారం, ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు గుర్తు చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ చొరవతో అంజన్న ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని అభినందించారు. అంజన్న ఆలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామని, దీంతో పేదల శుభ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయని తెలి పారు. నియోజకవర్గం, జిల్లాలోని ప్రతి మండలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి, మిగతా నిధులతో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వేములవాడలో ఇటీవల నాలుగు రోజుల పాటు వేద విద్యార్థులకు నాలుగు వేదాంశాల్లో పరీక్షలు నిర్వహించగా, దేశవ్యాప్తంగా 160 మంది విద్యార్థులు హాజరైనట్లు, గతంలో ఇటువంటి పరీక్షలు తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగినట్లు, రాజన్న ఆలయఖ్యాతి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజన్న, అంజన్న ఆలయాల అభివృద్ధికి అందరూ కలిసి పని చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ, ఆది శ్రీనివాస్ సూచనల మేరకు అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మార్బుల్ ఫ్లోరింగ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ అధికారులు సుదర్శన్ రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు, పాల్గొన్నారు.

## బెన్ స్టోక్స్‌కు కఠిన సవాల్

**మైకేల్ అథర్టన్ విశ్లేషణ**

ఎడ్జ్‌బస్టన్ టెస్ట్‌లో టీమ్ ఇండియా చేతిలో ఇంగ్లాండ్ ఘోర పరాజయం పొందిన నేపథ్యంలో, జులై 10 నుంచి లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్ ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు పెద్ద సవాల్‌గా ఉంటుందని మాజీ క్రికెటర్ మైకేల్ అథర్టన్ అభిప్రాయపడ్డాడు. రెండో టెస్ట్‌లో టాస్ వద్ద తప్పిదం జరిగిందని కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ అంగీకరించడంతో స్టోక్స్ నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తాయి. “మూడో టెస్ట్ స్టోక్స్ నాయకత్వం, మానసిక, శారీరక సామర్థ్యాలకు కీలక పరీక్షగా నిలుస్తుంది. రాబోయే రెండు రోజుల్లో జట్టును పునరేకీకరించడం అతనికి కఠిన సవాల్” అని అథర్టన్ వ్యాఖ్యానించాడు. మొదటి, రెండో టెస్ట్‌ల మధ్య ఏడు రోజుల విరామం ఉండగా, రెండో, మూడో టెస్ట్‌ల మధ్య కేవలం మూడు రోజులే ఉన్నాయని, ఈ సమయంలో జట్టును సిద్ధం చేయడం స్టోక్స్‌కు కీలకమని పేర్కొన్నాడు.

## ఇంగ్లాండ్ జట్టు మార్పులు

లార్డ్స్ టెస్ట్ కోసం ఇంగ్లాండ్ జట్టులో మార్పులు చేయాలని అథర్టన్ సూచించాడు. “బ్యాటింగ్‌పై నమ్మకం ఉంచి, సీమ్ బౌలింగ్‌ను బలోపేతం చేయాలి. జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ స్థానంలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్‌లను తీసుకోవాలి” అని వివరించాడు. ఆర్చర్ గాయం నుంచి కోలుకుంటుండగా, అట్కిన్సన్ లార్డ్స్‌లో 19 వికెట్లు (సగటు 10.94) తీసిన రికార్డుతో జట్టుకు బలం చేకూరుస్తాడని అథర్టన్ అంచనా వేశాడు.

## స్టోక్స్ ఫామ్‌పై ఆందోళన

స్టోక్స్ బ్యాటింగ్ ఫామ్ కూడా ఆందోళన కలిగిస్తోందని అథర్టన్ పేర్కొన్నాడు. తొలి రెండు టెస్ట్‌లలో స్టోక్స్ (20, 33, 0, 33) పెద్దగా రాణించలేదు, ముఖ్యంగా స్పిన్‌కు ఇబ్బంది పడ్డాడు. గత రెండేళ్లలో ఒక్క సెంచరీ (2023 లార్డ్స్‌లో ఆస్ట్రేలియాపై) మాత్రమే చేశాడు. “కేవలం టెస్ట్ క్రికెట్ ఆడే స్టోక్స్‌కు రిథమ్, ఫామ్ లోపిస్తున్నాయి. నాయకుడిగా ముందుండి నడపాల్సిన సమయంలో ఇది సవాల్” అని అథర్టన్ వ్యాఖ్యానించాడు.



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే మూడో టెస్ట్ మ్యాచ్ జూలై 10న మొదలవుతుంది. ఈ మ్యాచ్ క్రికెట్ మక్కాగా పిలుచుకునే లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టు సిరీస్‌లో పైచేయి సాధిస్తుంది కాబట్టి, రెండు జట్లకు ఈ మ్యాచ్ చాలా ముఖ్యం. మొదటి టెస్ట్‌లో ఇంగ్లాండ్ 5 వికెట్లతో గెలిచింది. కానీ రెండో టెస్ట్‌లో టీమిండియా ఇంగ్లాండ్‌ను 336 పరుగుల భారీ తేడాతో ఓడించి కొత్త రికార్డు సృష్టించింది. ఇప్పుడు రెండు జట్లు మూడో మ్యాచ్ కోసం రెడీ అవుతున్నాయి. లార్డ్స్‌లో మ్యాచ్ జరుగుతుంది కాబట్టి తామే గెలుస్తామని ఇంగ్లాండ్ టీమ్ నమ్మకంతో ఉంది. ఎందుకంటే, ఈ మైదానంలో టీమిండియా ఇప్పటివరకు కేవలం మూడు సార్లు మాత్రమే గెలిచింది. 1932 నుంచి లార్డ్స్‌లో టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతున్నా ఇప్పటివరకు మూడు విజయాలే వచ్చాయి.లార్డ్స్ మైదానంలో టీమిండియా ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 3 మ్యాచ్‌లలో గెలిచింది, 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. మిగిలిన 12 మ్యాచ్‌లలో భారత జట్టు ఓడిపోయింది. ఈ గణాంకాలను చూస్తే లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ గెలవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు అనిపిస్తుంది.

# సర్వత్రా ఉత్కంఠ

## లార్డ్స్ టెస్టు మూడో టెస్ట్.. అర్ దీప్ ఎంట్రీ

- ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు?
- లార్డ్స్‌లో జూలై 10న ప్రారంభం

భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో ఇప్పటివరకు బ్యాట్స్‌మెన్‌లు ఆధిపత్యం చెలాయించారు. రెండు టెస్ట్‌లలో భారీ స్కోర్లు, 11 సెంచరీలతో సిరీస్ 1-1తో సమంగా ఉంది. మొదటి టెస్ట్‌లో (లీడ్స్) భారత్ 471, ఇంగ్లాండ్ 465, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 364, ఇంగ్లాండ్ 373/5తో గెలిచింది, మొత్తం 1,673 పరుగులు నమోదయ్యాయి. రెండో టెస్ట్‌లో భారత్ 587, ఇంగ్లాండ్ 407, భారత్ రెండో ఇన్నింగ్స్ 427 (డిక్లేర్), ఇంగ్లాండ్ 271 ఆలౌట్‌తో 1,692 పరుగులు వచ్చాయి. రెండు మ్యాచ్‌లలో కలిపి 3,365 పరుగులు నమోదయ్యాయి. లార్డ్స్‌లో జూలై 10న ప్రారంభమయ్యే మూడో టెస్ట్‌లో పిచ్‌పై గడ్డి ఉండటంతో పేసర్లకు స్వింగ్, అసాధారణ బౌన్స్ లభించే అవకాశం ఉంది. మ్యాచ్ ప్రారంభంలో బ్యాటింగ్ కష్టం కాగా, పిచ్ పాతబడితే బ్యాటింగ్ సులభమవుతుంది. లార్డ్స్‌లో మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు 310, 344 పరుగులకు మించి ఛేదన జరగలేదు, పేసర్లకు అనుకూలమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

లార్డ్స్ పిచ్‌లో గడ్డి ఉండటం పేసర్లకు స్వింగ్, బౌన్స్ అందిస్తుంది. జస్ప్రీత్ బుమ్రా తిరిగి రావడంతో భారత బౌలింగ్ బలం పెరుగుతుందని, ఎడ్జ్‌బస్టన్ విజయంతో ఉత్సాహంగా ఉన్న శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత్ పైచేయి సాధించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. స్టోక్స్ ఈ సవాళ్లను అధిగమించి జట్టును నడిపిస్తాడా లేదా భారత్ మరో విజయం సాధిస్తుందా అన్నది ఉత్కంఠగా మారింది.

ఎడ్జ్‌బస్టన్‌లో విజయంతో ఉత్సాహంగా ఉన్న టీమ్ ఇండియా లార్డ్స్ టెస్ట్‌కు సిద్ధమవుతోంది. లార్డ్స్ పిచ్ పేసర్లకు అనుకూలమని, నలుగురు సీమర్లు, ఒక స్పిన్నర్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది. గతంలో 2014, 2021లో 4o1 కాంబినేషన్‌తో విజయం సాధించిన భారత్, 2018లో రెండు స్పిన్నర్లతో ఓడిపోయింది. జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రానుండగా, ప్రసిద్ధ కృష్ణ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం రావచ్చు. సిరాజ్, ఆకాశ్ దీప్ కొనసాగనున్నారు. రవీంద్ర జడేజా స్పిన్ ఆల్‌రౌండర్‌గా ఆడనుంది. బ్యాటింగ్‌లో ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లతో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనింగ్, శుభ్మన్ గిల్, రిషబ్ పంత్, కరుణ్ నాయర్, సాయి సుదర్శన్ లేదా అభిమన్యు ఈశ్వరన్ ఆడే అవకాశం ఉంది. నితీశ్ రెడ్డికి ఛాన్స్ అనుమానమే.


**భారత్ తుది జట్టు (అంచనా)**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్మన్ గిల్, రిషబ్ పంత్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

## ఓటమిపై స్టోక్స్ కుంటిసాకులు

ఇండియాతో జరిగిన రెండో టెస్టులో 336 పరుగుల భారీ తేడాతో ఇంగ్లాండ్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో బర్మింగ్ హామ్ వేదికపై తన ఫస్ట్ ఎవర్ విక్టరీని టీమిండియా నమోదు చేసింది. అయితే మ్యాచ్ ముగిశాక ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఓటమిపై తన అక్కసును వెళ్లగక్కాడు. బర్మింగ్ హామ్ పిచ్ ఉపఖండపు పిచ్ ను పోలి ఉందని, అందుకే తాము ఓడిపోయామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఉపఖండపు పిచ్‌లపై రెగ్యులర్‌గా టీమిండియా ప్లేయర్లు ఆడతారని, తమకు అంతగా అలవాటు లేకపోవడంతో తేలి పోయామని పేర్కొన్నాడు. నిజానికి తొలిటెస్టులో అనూహ్య విజయం తో రెండో టెస్టులో విజయగర్వంతో ఇంగ్లాండ్ బరిలోకి దిగింది. అయితే చక్కని ప్రణాళికతో బరిలోకి దిగిన భారత్ అద్భుత విజయం సాధించింది. తాజాగా ఇలా పిచ్ పై నిందలు వేసి, తమ తప్పు లేదని స్టోక్స్ చెప్పడంపై భారత ఫ్యాన్స్ మండి పడుతున్నారు. ఇండియాలో ఓడిపోయినా, ఇంగ్లాండ్ లో ఓడిపోయినా ఉపఖండపు పిచ్‌ల వల్లే ఓడామని ఎలా చెబుతున్నారని విమర్శించారు. నిజానికి బ్యాటింగ్ వైఫల్యంతోనే ఈ టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. కొంతమంది ఆటగాళ్లపై అతిగా ఆధారపడటం, పరిస్థితులకు సంబంధం లేకుండా బజ్ బాల్ తరహా ఆటతీరుతో చతికిల పడింది. తొలి టెస్టులో అరడజనుకు పైగా క్యాచ్‌లు జారవిడవడంతోనే ఇంగ్లాండ్ గెలిచింది. క్యాచ్‌లు సరిగ్గా పట్టినట్లయితే ఆ మ్యాచ్ లోనూ ఓడిపోయేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక వ్యూహం ప్రకారమే బ్యాటింగ్ పిచ్‌లు తయారు చేసి, ఇప్పుడు బొక్క బోర్లా పడటంతో ఆ పిచ్‌లను విమర్శించడం సరికాదని హితవు పలుకుతున్నారు. నిజానికి ఎడ్జ్‌బాస్టన్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా చేసి, బౌండరీలైన్‌ను కూడా 60 మీటర్లకు కుదించారు.

## క్రికెట్ కన్నా వింబుల్డన్‌లోనే ఎక్కువ ఒత్తిడి: విరాట్ కోహ్లి



లండన్‌లోని వింబుల్డన్ సెంటర్ కోర్ట్‌లో సోమవారం జరిగిన నొవాక్ జొకోవిచ్, అలెక్స్ డి మినార్ మధ్య మ్యాచ్‌ను విరాట్ కోహ్లి తన సతీమణితో కలిసి వీక్షించాడు. ఓ స్పోర్ట్స్ ఛానెల్‌తో మాట్లాడిన కోహ్లి, క్రికెట్ కన్నా వింబుల్డన్‌లో ఆటగాళ్లు ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటారని అభిప్రాయపడ్డాడు. “వరల్డ్ కప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఉండే తీవ్ర ఒత్తిడి, వింబుల్డన్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ కనిపిస్తుంది. క్రికెట్ మైదానంలో అభిమానులు దూరంగా ఉంటారు, కానీ వింబుల్డన్ సెంటర్ కోర్ట్‌లో ప్రేక్షకులు చాలా దగ్గరగా ఉండటం ఒత్తిడిని పెంచుతుంది. టెన్నిస్ ఆటగాళ్లు శారీరక, మానసిక ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం గొప్ప విషయం, వారిపై నాకు అపార గౌరవం ఉంది” అని కోహ్లి వివరించాడు. వరల్డ్ కప్‌లో భారత్-పాక్ మ్యాచ్‌లో కాళ్లు వణికే ఒత్తిడి ఉంటుందని, కానీ టెన్నిస్ ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్ నుంచి ఫైనల్ వరకు ఇలాంటి ఒత్తిడినే ఎదుర్కొంటారని పేర్కొన్నాడు.

## మూడో ర్యాంక్‌లో మంధాన...
# రెండో స్థానానికి దీప్తి



భారత మహిళల క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో మూడు వికెట్లు తీసి, ఆస్ట్రేలియా బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్‌ను అధిగమించి కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. గత ఆరేళ్లుగా టాప్-10లో నిలకడగా ఉన్న దీప్తి, పాకిస్థాన్ బౌలర్ సదియా ఇక్బాల్ (746 పాయింట్లు) కంటే కేవలం 8 పాయింట్ల వెనుక (738 పాయింట్లు) ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో బ్యాట్, బంతితో చెలరేగిన దీప్తి, ఇటీవలి ముక్కోణపు వన్డే సిరీస్ గెలుపులోనూ కీలక పాత్ర పోషించింది. ఇతర భారత బౌలర్లలో రేణుకా సింగ్ 6వ స్థానం, రాధా యాదవ్ 18వ స్థానం, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఇస్సీ వాంగ్ 57వ, లారెన్ ఫిలర్ 68వ స్థానంలో కొనసాగుతున్నారు.

**మంధాన టాప్-5లో నిలవడం**

బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఇంగ్లండ్‌తో సిరీస్ ఓపెనర్‌లో 112 పరుగుల సెంచరీతో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆమె 771 రేటింగ్ పాయింట్లతో ఆస్ట్రేలియా బ్యాటర్ బెత్ మూనీ (794), వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ (774) వెనుక ఉంది. జెమీమా రోడ్రిగ్స్ రెండు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో, షఫాలీ వర్మ 13వ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15వ స్థానంలో ఉన్నారు. భారత బ్యాటర్లలో మంధాన మాత్రమే టాప్-10లో ఉంది.

**ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టు**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. మంధాన సెంచరీ, దీప్తి బౌలింగ్ ప్రదర్శనలతో జట్టు ఆధిపత్యం చెలాయిస్తోంది. జెమీమా రోడ్రిగ్స్ బ్రిస్టల్‌లో 63 పరుగులతో రాణించగా, అరుంధతి రెడ్డి 3/32 ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సంపాదించింది.



## తాడిచెట్టుపై నుండి జారీ గీతా కార్మికునికి తీవ్ర గాయాలు

సైదాపూర్ (జనంసాక్షి) : మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు పూదరి అజయ్ సోమవారం రోజున ఎప్పటిలాగే సాయంత్రం ఎప్పటిలాగే తాడి చెట్టు ఎక్కి. దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందకు జారడంతో తీవ్రంగా తీవ్ర గాయలు అయ్యాయి. చికిత్స కోసం హుజురా బాద్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడి నుం డి హన్మకొండలో ప్రైవేట్టు ఆసుపత్రికి తరలించారు



# బోనమెత్తిన డిప్యూటీ మేయర్

### అమ్మవారి ఆశీస్సులు పొందిన మోతె శ్రీలత శోభన్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 08 (జనంసాక్షి) :** టీజేఏసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి పాల్గొన్నారు. లోవర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాలకట్ట మైసమ్మ అమ్మవారికి టీజేఏసీ యూనియన్ తరపున డిప్యూటీ మేయర్ భక్తిపూర్వకంగా బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. “తెలంగాణ రాష్ట్రం సాంప్రదాయాలకు, జానపద కళలకు నెలవుగా నిలుస్తోంది. బోనాల పండుగ మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగ. యువత తరాలు ఈ పండుగలో భాగస్వామ్యం కావడం అభినందనీయం,” అని పేర్కొన్నారు.



## సెమీస్‌లోకి సబలెంకా, ఫ్రిట్జ్

### అమెరికా స్టార్ తొలి వింబుల్డన్ సెమీస్

పురుషుల సింగిల్స్‌లో 5వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ అద్భుత ప్రదర్శనతో తొలిసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో 17వ సీడ్ రష్యా ఆటగాడు కరెన్ ఖచనోవ్‌ను 6-3, 6-4, 1-6, 7-6(4) స్కోరుతో ఓడించాడు. మ్యాచ్ మధ్యలో పాదం నొప్పితో ఇబ్బంది పడినప్పటికీ, ఫ్రిట్జ్ పట్టుదలతో పోరాడి విజయం సాధించాడు. తొలి రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించిన అతడు, మూడో సెట్‌లో కరెన్ 6-1తో గెలిచినా, నాలుగో సెట్‌లో టైబ్రేకర్‌లో అద్భుతంగా ఆడి సెమీస్ బెర్త్ ఖరారు చేశాడు. గత ఏడాది యూఎస్ ఓపెన్ రన్నరప్‌గా నిలిచిన ఫ్రిట్జ్, వింబుల్డన్ టైటిల్‌కు మరింత చేరువయ్యాడు. సెమీస్‌లో అతడు డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ లేదా అన్‌సీడెడ్ కామ్ నొర్రీతో తలపడనున్నాడు. ఫ్రిట్జ్ ఈ ఏడాది స్టట్‌గార్ట్, ఈస్ట్‌బోర్న్‌లో గ్రాస్ కోర్ట్ టైటిళ్లు గెలవడం అతడి ఫామ్‌ను సూచిస్తోంది.

**అరీనా సబలెంకా: మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్**

మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నంబర్ 1 అరీనా సబలెంకా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ మూడోసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్లో 37 ఏళ్ల అన్‌సీడెడ్ జర్మన్ ఆటగారిణి లారా సీగెముంద్‌ను 4-6, 6-2, 6-4 స్కోరుతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో సీగెముంద్ తన స్లైస్‌లు, డ్రాప్ షాట్లతో సబలెంకాను ఇబ్బంది పెట్టినప్పటికీ, సబలెంకా తన శక్తివంతమైన సర్వ్‌లు, గ్రౌండ్‌స్ట్రోక్‌లతో ఆధిక్యం సాధించింది. మొదటి సెట్‌ను కోల్పోయిన సబలెంకా, రెండో సెట్‌లో 6-2తో గెలిచి, నిర్ణయాత్మక మూడో సెట్‌లో 3-1, 4-3 వెనుకబడిన స్థితి నుంచి అద్భుతంగా పుంజుకొని విజయం సాధించింది. ఈ విజయంతో సబలెంకా తన మొదటి వింబుల్డన్ టైటిల్‌కు మరింత సమీపమైంది. సెమీస్‌లో ఆమె 13వ సీడ్ అమండా అనిసిమోవా లేదా అనస్తాసియా పావ్లుచెంకోవాతో తలపడనుంది. సబలెంకా ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు సెట్‌ను కూడా కోల్పోకుండా ఆడిన ఏకైక టాప్-6 సీడ్.

# ముగిసిన రాజన్న జోన్ స్థాయి తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు

### పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రకటన

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 08 (జనంసాక్షి) :**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా రాజన్న జోన్ స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమై, మంగళవారం ముగిశాయి. ఈ పోటీలు ఆరు విభాగాల్లోసైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాంటీ సబాటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్, పోలీస్ ఫోటోగ్రఫీ, పోలీస్ వీడియోగ్రఫీనిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్ వ్రాత పరీక్షలో కరీంనగర్ కమిషనరేట్ గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ బంగారు పతకం, కామారెడ్డి జిల్లా గాంధారి ఎస్సై ఆంజనేయులు వెండి పతకం, కరీంనగర్ కేశపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి కాంస్య పతకం సాధించారు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినల్ చట్టాల విభాగంలో సిద్దిపేట కమిషనరేట్ రాయపోల్ ఎస్సై రఘుపతి బంగారు పతకం, కరీంనగర్ కమిషనరేట్ ఎస్సై జి నరేందర్ రెడ్డి వెండి పతకం, కామారెడ్డి ఎస్సై కే విజయ్ కాంస్య పతకం సాధించారు. మెడికల్ లీగల్ టెస్ట్‌లో కరీంనగర్ చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ ప్రదీప్ కుమార్ బంగారు పతకం, సిద్దిపేట ఎస్సై రఘుపతి వెండి పతకం, కరీంనగర్ గంగాధర ఎస్సై వంశీకృష్ణ కాంస్య పతకం సాధించారు. లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్‌లో కామారెడ్డి ఎస్సై ఆంజనేయులు బంగారు పతకం, కరీంనగర్ ఎస్సై యూనస్ వెండి పతకం, మెదక్ ఎస్సై శంకర్ కాంస్య పతకం సాధించారు. ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో కరీంనగర్ ఎస్సై యూనస్ బంగారు పతకం, కామారెడ్డి ఎస్సై ఆంజనేయులు వెండి పతకం, కరీంనగర్ ఎస్సై బి వంశీకృష్ణ కాంస్య పతకం సాధించారు. క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీలో కామారెడ్డి ఎస్సై ఆంజనేయులు బంగారు పతకం, కరీంనగర్ ఎస్సై యూనస్ వెండి పతకం, రాజన్న సిరిసిల్ల ఎస్సై సిహెచ్ గణేష్ కాంస్య పతకం సాధించారు. పోలీస్ పోర్ట్రైట్ పరీక్షలో రాజన్న



సిరిసిల్ల పోలీస్ కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ బంగారు పతకం, కామారెడ్డి పోలీస్ కానిస్టేబుల్ ఎస్ లక్ష్మీనారాయణ వెండి పతకం, మెదక్ పోలీస్ కానిస్టేబుల్ ఎండి అశ్వక్ కాంస్య పతకం సాధించారు. యాంటీ సబాటేజ్ చెక్‌లో గ్రౌండ్ సర్చ్‌లో కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ కానిస్టేబుల్స్ వి సంతోష్, వి వెంకటేష్ బంగారు పతకం, మెదక్ పోలీస్ కానిస్టేబుల్స్ ఎస్ రవీందర్, జై నర్సింహులు వెండి పతకం సాధించారు. రూమ్ సర్చ్‌లో రాజన్న సిరిసిల్ల పోలీస్ కానిస్టేబుల్స్ ఎం శ్రవణ్ కుమార్, జి కిరణ్ కుమార్ బంగారు పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్స్ ఈ చంద్రమోహన్, బి కిరణ్ కుమార్ వెండి పతకం సాధించారు.

వెహికల్ సర్చ్‌లో సిద్దిపేట కమిషనరేట్ పోలీస్ కానిస్టేబుల్స్ బి శ్రీనివాస్, ఎం శంకర్ బంగారు పతకం, కామారెడ్డి పోలీస్ కానిస్టేబుల్స్ పి ఎల్లారెడ్డి, రామచంద్రం వెండి పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్స్ ఎస్ఎస్ శ్రీనివాస్, వి రాజు కాంస్య పతకం సాధించారు. యాక్సెస్ కంట్రోల్‌లో మెదక్ పోలీస్ కానిస్టేబుల్స్ ఎం దుర్గాప్రసాద్, కె సిద్ధిరాములు బంగారు పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్స్ టి రమేష్, ఏ మహేష్ వెండి పతకం, సిద్దిపేట పోలీస్ కానిస్టేబుల్ ఎస్ఎస్ శ్రీకాంత్ కాంస్య పతకం సాధించారు. డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్‌లో సిద్దిపేట కమిషనరేట్ డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ జి శంకర్ బంగారు పతకం, రాజన్న సిరిసిల్ల డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ జి శ్రీనివాస్ వెండి పతకం సాధించారు. నార్కోటిక్ లో సిద్దిపేట పోలీస్ కానిస్టేబుల్ పి అజయ్ బంగారు పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్ ఏ శంకర్ వెండి పతకం, మెదక్ పోలీస్ కానిస్టేబుల్ వి శ్రావణ్ కుమార్ కాంస్య పతకం సాధించారు. ఎక్స్‌ప్లోసివ్‌లో సిద్దిపేట డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ పి వెంకటేష్ బంగారు పతకం, కె శ్రీకాంత్ వెండి పతకం సాధించారు. కంప్యూటర్ అవేర్‌నెస్ ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో మెదక్ పోలీస్ కానిస్టేబుల్ ఎస్ సతీష్ కుమార్ బంగారు పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్ ఏం సతీష్ కుమార్ వెండి పతకం, కామారెడ్డి పోలీస్ కానిస్టేబుల్ ఏ చిరంజీవి కాంస్య పతకం సాధించారు. ఆఫీస్ ఆటోమేషన్‌లో సిద్దిపేట పోలీస్ కానిస్టేబుల్ యూ భాస్కర్ బంగారు పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్ జి అనిల్ కుమార్ వెండి పతకం, మెదక్ ఐటీ సెల్ పోలీస్ కానిస్టేబుల్ ఎస్ సతీష్ కుమార్ కాంస్య పతకం సాధించారు. ప్రోగ్రామింగ్ ఎబిలిటీలో కరీంనగర్ ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ జి సంతోష్ కుమార్ బంగారు పతకం, సిద్దిపేట ఐటీ సెల్ పోలీస్ కానిస్టేబుల్ పి రమేష్ వెండి పతకం, కామారెడ్డి రాజంపేట పోలీస్ ఏ చిరంజీవి కాంస్య పతకం సాధించారు. పోలీస్ ఫోటోగ్రఫీలో మెదక్ ఎం శ్రీధర్ గౌడ్ బంగారు పతకం, మెదక్ కె శ్రీధర్ వెండి పతకం, కరీంనగర్ పోలీస్ కానిస్టేబుల్ మల్లేశం కాంస్య పతకం సాధించారు. పోలీస్ వీడియోగ్రఫీలో మెదక్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్ గౌడ్ బంగారు పతకం, కె శ్రీధర్ వెండి పతకం సాధించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏ ఆర్ భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, వేణుగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 8 (జనంసాక్షి) :** విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహ న ఉండాలని వాటిలో పాల్గొనేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహాన్ని అందించాలని తద్వారా వారికి చదువు పట్ల శ్రద్ధ పెరుగుతుందని, విజయం పట్ల ఆసక్తి కలుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల చక్కటి శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తద్వారా వారికి వివిధ రంగాలలో ఆసక్తి పెరుగుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అవగాహన ఉండాలని తద్వారా వారికి విద్య పట్ల ఆసక్తి పెరుగుతుందని, పోటీతత్వాన్ని పెంపొందించుకుంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చాలా ఆలోచింపచేసాయని వేడుకలలో భాగంగా పలు పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారం లేకపోయేసరికి కెటిఆర్ నిలవడం లేదు

**డైరెక్ట్ ఎమెల్యే అయినోడికి రాజకీయాలు ఏం తెలుసు**

**పదేళ్ల పాలన వెలగబెట్టిన వారి చరిత్ర ప్రజలకు తెలుసు**

**రేవంత్‌ను గోకుడు ఎందుకు...తిట్లు తినడమెందుకు**

**మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ విదేశాల్లో చల్లదనం కోసం పోతున్నారని అన్నారు. నెలలో 20 రోజులు విదేశాల్లో కేటీఆర్‌కి ఏం పని అని ప్రశ్నించారు. కేసీఆర్ కోటాలో కేటీఆర్ డైరెక్ట్ ఎమ్మెల్యే అయిపోయాడని, రాజకీయ ఒడిదుడుకులు ఆయనకేం తెలుసని మండిపడ్డారు. తాము ఎన్నో వ్యవప్రయాసలతో రాజకీయ నేతలం అయ్యాం అని చెప్పారు. తమకున్న అనుభవాల ముందు కేటీఆర్ జీరో అని జగ్గారెడ్డి విమర్శించారు. 18 నెలలుగా అధికారం లేకపోయేసరికి కెటిఆర్‌కు మనసుకు పడతలేదన్నారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేటీఆర్ ఈ మధ్య తెలంగాణలో ఉండటం లేదు. నెలకోసారి విదేశాలకు వెళుతున్నాడు. నెలలో పది రోజులు ఇక్కడ, 20 రోజులు విదేశాల్లో ఉంటాడు. కాబట్టి సీఎం రేవంత్ రెడీ షెడ్యూల్ ఆయనకు తెలియదు. విదేశాల్లో తిరిగే కేటీఆర్‌కి సీఎం రేవంత్ ఏం చేస్తున్నది ఎందుకు తెలుస్తుంది. పదేళ్ళు మంత్రిగా నువ్వు, సీఎంగా మీ నాయన చేశాడు. ఢిల్లీకి ఎందుకు పోతారో ఆ మాత్రం తెలియదా కేటీఆర్ అని ప్రశ్నించారు. ఎరువులు, నిధులు, నీళ్ల పంచాయతీ కోసం సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లారు. కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయింది. హరీష్ రావు, కేటీఆర్‌లు ఈడీ ఆఫీస్ల కోసం ఢిల్లీ వెళ్ళారు. మా సీఎం కేంద్రం చుట్టు తిరుగుతున్నారు. కేటీఆర్‌కి సిస్టర్ స్ట్రోక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు ఢిల్లీ. మీ లాగా మాది గల్లి పార్టీ కాదు కదా. కేటీఆర్.. నీ స్ట్రోక్‌ల లొల్లి మాకెందుకు రుద్దుతున్నావు' అని అడిగారు. సన్నాసులు అనే మాటలు స్టార్ట్ చేసింది మీ అయ్యనే. మీరు తిట్టిన మాటలను కాస్త పాలిష్ చేసి తిడుతున్నారు. మేము సత్రం నడపడం లేదు, మీరు తిడితే మేము తిడతం. సీఎం రేవంత్ రెడ్డిని గోకుడు ఎందుకు, తన్నించుకోవడం ఎందుకు?. తిట్ల పురాణం మీదే.. మీరు ఒకటి అంటే మేం పది తిడుతున్నాం. కేటీఆర్ అమెరికాలో చదివి.. పదేళ్లు మంత్రిగా చేసాడు. చర్చ అసెంబ్లీలో చేయాలా?, కల్లు కాంపౌండ్‌లోనా?. కల్లు కాంపౌండ్‌కు రా అంటే ఎట్లా?. వెయ్యి కోట్లు పక్క రాష్ట్రాల ఎన్నికల్లో పంపింది కేసీఆర్ కుటుంబం. కేటీ-ఆర్ అబద్దాల కోరు. అందరికీ వడదెబ్బ తగిలితే.. ఆయనకు ఫ్యామిలీ దెబ్బలు తగులుతున్నాయి. కేటీఆర్‌కి అవగాహనలేక ఇబ్బందిపడుతున్నారని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

# సిటీసివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** నగరంలోని పాతబస్తీ సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఉదయం బాంబు బెదిరింపు ఫోన్ కాల్ కలకలం సృష్టించింది. ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. భద్రతా దళాలు, పోలీసులు అప్రమత్తమవుతూ, కోర్టులోని అన్ని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఫోన్ కాల్ వస్తూనే అధికారులు ఎలాంటి ప్రమాదం జరుగకుండా అతి వేగంగా స్పందించారు. చీఫ్ మెజిస్ట్రేట్ కోర్టును వెంటనే ఖాళీ చేయించి, తనిఖీలకు అనుమతిని ఇచ్చారు. అనంతరం కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులను మూసివేసి, అక్కడ ఉన్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కేసుల కోసం వచ్చిన ప్రజలను వెంటనే బయటకు పంపించారు. బాంబు బెదిరింపుతో అప్రమత్తమైన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు సిటీ సివిల్ కోర్టు ప్రాంగణానికి చేరుకొని తనిఖీలు ప్రారంభించాయి. ప్రతి కోణాన్ని సమీక్షిస్తూ, కోర్టు భవనం అంతటా జాగ్రత్తగా తనిఖీలు చేపట్టారు. కోర్టు సమీపంలోని పాత సీపీ కార్యాలయం ఉండటంతో భద్రతను మరింత కఠినంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ అనూహ్య ఘటనపై అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ, ఫోన్ కాల్ ఉద్భవించిన మూలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. ఈ బెదిరింపు కాల్ నకిలీగా ఉందా లేదా వాస్తవమైనదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. స్థానికులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగుల్లో భయాందోళనలు వ్యక్తమ య్యాయి. ఇలాంటి భద్రతా బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్ లో కోర్టుల భద్రతపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

# ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతా?

**ఎక్స్ వేదికగా ఎద్దేవా చేసిన అసద్**



**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాకిస్తాన్, ఇజ్రాయిల్ ప్రతిపాదించడాన్ని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇద్దరూ డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ప్రతిపాదించారని, అయితే మునీర్ భారతదేశంలో ఉగ్రవాదులను పంపించే కీలక వ్యక్తి అయితే, నెతన్యాహు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుండి పారిపోయిన వ్యక్తి, అని అతను పాలస్తీనియన్లపై బహిరంగంగా మారణహోమానికి పాల్పడ్డాడని అసదుద్దీన్ ఆరోపించారు. వీరిద్దరి చర్యలకు యుఎస్ఏ ఆమోదం ఉందని అసదుద్దీన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# దమ్ముంటే ఫాతిమా కాలేజీపై చర్యకు దిగు

**లీగల్ టీమ్‌తో హైకోర్టులో కొట్లాడాలి**

**బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావుకు రాజాసింగ్ సవాల్**



**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** తాను దమ్మిని కాదని బిజెపి కొత్త అధ్యక్షుడు రామచంద్రరావు నిరూపించుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దమ్మి కాదని నిరూపించుకునేందుకు రామ్ చందర్ రావుకు ఇది మంచి అవకాశమన్నారు. చెరువును ఆక్రమించి అక్బరుద్దీన్ కట్టిన ఫాతిమా కాలేజ్ పై లీగల్ టీమ్ ను ఏర్పాటు చేయాలని.. లీగల్ టీమ్ తో హై కోర్టులో పిటిషన్ దాఖలు చేసీ ఫాతిమా కాలేజ్ కూల్చేందుకు కొట్లాడాలని తెలిపారు. హైడ్రా వల్ల అనేక పేద కుటుంబాలు రోడ్ల పాలయ్యాయని.. పేదలకు ఒక న్యాయం, ఫాతిమా కాలేజ్ కు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫాతిమా కాలేజ్ కూల్చడానికి ధైర్యం చాలడం లేదా అని నిలదీశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్షపదవికి నామినేషన్ వెయ్యనివ్వలేదని అందుకే రాజీనామా చేస్తున్నట్లు- వెల్లడించారు. తన రాజీనామా లేఖను పూర్వ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించినట్లు- తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధ్యక్షుడి నియామకంపై ఎమ్మెల్యే రాజాసింగ్ గతంలో సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోందని, అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలని ఆయన అన్నారు. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఆయన రాజీనామా చేశారు.

# శాంతియుతంగా బోనాల జాతర

**బోనాల ఉత్సవాలపై సమీక్షలో మంత్రి పొన్నం**



**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలు శాంతియుతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్తు, జలమండలి ఇతర విభాగాల అధికారులు ఒక ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు- పూర్తి చేయాలని సూచించారు. అంబర్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు- వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దొంగతనాలు, శాని-టైజేషన్, మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు-కు మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పోలీసు ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# గరివిడి వెటర్నరీ కాలేజీకి శాశ్వత సభ్యత్వం

**మంత్రి అచ్చన్నాయుడుకు కేంద్రమంత్రి హామీ**

**న్యూఢిల్లీ, జూలై8 (జనంసాక్షి) :** విజయనగరం జిల్లా గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ కాలేజ్‌కి శాశ్వత సభ్యత్వం కొనసాగించేందుకు మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కాలేజ్‌లో చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సదుపాయం కూడా కల్పించాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. విద్యార్థులను మరో కాలేజ్‌కి తరలించి వెసులుబాటు- కల్పించేందుకు కేంద్రమంత్రి లలన్ సింగ్ అంగీకరించారు. గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో గరివిడి కాలేజ్‌కి అనుమతులని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కాలేజ్‌పై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఢిల్లీలో కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్ సింగ్‌తో ఇరువురు నేతలు ప్రత్యేకంగా భేటీ- అయ్యారు. గరివిడి కాలేజీకి ఉన్న ప్రాధాన్యతను కేంద్రమంత్రికి వివరించారు. 2018లో గరివిడి వెటర్నరీ కాలేజ్‌ని అప్పటి టీ-డీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ కాలేజ్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఐదేళ్లుగా ఈ కాలేజ్ ఎలాంటి పనులకి నోచుకోకపోవడంతో కేంద్ర అధికారులు తనిఖీలు నిర్వహించలేదు. 2023లో జరిగిన తనిఖీల్లో ఈ కాలేజ్‌లో నిబంధనలకు అనుగుణంగా పురోభివృద్ధి లేకపోవడంతో కేందప్రభుత్వం అనుమతులని రద్దు చేసింది. వచ్చే నాలుగైదు నెలల్లో ఈ కాలేజ్‌లో నిబంధనలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి లలన్ సింగ్‌కి రామ్మోహన్, అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఇరువురు నేతల హామీతో ఈ కాలేజ్‌కి అనుమతుల పునరుద్ధరణ చేస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ స్పష్టం చేశారు.

# సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటమ్ వ్యాలీ

**సాంకేతిక విప్లవంలో ఇదో గేమ్ ఛేంజర్**

**బిజినెస్ పార్కులో లోకేశ్ రోడ్ షో**



**బెంగుళూరు, జూలై8 (జనంసాక్షి) :** మరో ఆరు నెలల్లో సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్టు ఏపీ ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. క్వాంటమ్ వ్యాలీ భారత్ సాంకేతిక విప్లవంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆంధ్రప్రదేశ్ లో గ్లోబల్ కేపబిలిటీ- సెంటర్లపై పెట్టుబడులు పెట్టాలని కోరారు. దేశంలో పేరెన్నికగన్న దిగ్గజ జీసీసీ సంస్థల ప్రతినిధులతో కలిసి మంత్రి లోకేశ్ బెంగుళూరు మాన్యత ఎంబసీ బిజినెస్ పార్కులో రోడ్ షో నిర్వహించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం అన్నారు. టీసీఎస్, ఐబీఎం, ఎల్‌అండ్‌టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో దేశంలోనే తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతిలో మరో ఆరు నెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ ఆవిష్కృతం కాబోతోంది. ఇది భారత్ సాంకేతిక విప్లవంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంది. మరోవైపు విశాఖ మహానగరం ఐటీ హబ్‌గా తయారవుతోంది. విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ప్రస్తుతం ఏపీలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలు చేస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని విధంగా రాయితీలు అందజేస్తున్నాం. అధునాతన సాంకేతికతలకు నిలయంగా మారుతున్న ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# రిజర్వాయర్లకు చేరని వాననీరు

**చేపపిల్లల పంపిణీ పథకంపై ఆశ**

**మత్స్యకారుల ఎదురుచూపు**



**ఆదిలాబాద్, జూలై8 (జనంసాక్షి) :** ఈ యేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోయిన అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో చేప పిల్లలను వదలడం సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు రావడం లేదు. భారీ వర్షాలు కురుస్తే కానీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఏడు ఇప్పటి వరకు మోస్తారు స్థాయిలోనే వర్షాలు కురుస్తున్న భారీ వర్షాల జాడ కనిపించడం లేదు. బిఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఈ ఏడాది కూడా చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేస్తారా లేదా అన్న అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 220, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40మి.మీ. సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 మి.మీ. సైజు చేప పిల్లలను వదలనున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులు ఉన్నారు. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు కార్మికులకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించింది. అయితే ఈ వ్యవహారంలో అంతా అవినీతి చోటుచేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయయలేదని అంటున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న కట్ల, రోకు, బొచ్చ, బంగారుతీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో చేపల మార్కెట్‌ను నిర్మించేందుకు స్థలాలను గుర్తించి ఇస్తామని గత సర్కార్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న రిజర్వాయర్, ప్రాజెక్టులలో రొయ్యల పెంపకం పై అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే ఉపాధి పురుగుతుందని అంటున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు, చిక్‌మాన్ ప్రాజెక్టులలో చేప పిల్లల పెంపకంతో పాటుయ్యల పెంపకంపై దృష్టి సారించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఏడాదంతా సరిపడా నీటి నిల్వలు ఉండే అవకాశం ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే మార్కెట్‌లో రొయ్యలకు మంచి డిమాండ్ కూడా ఉండడమే వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రొయ్యల పెంపకంతో మత్స్య కార్మికులకు 3 కాలాల పాటు ఉపాధి దొరకడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ చేపలు పెంచే రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచితే సరైన దిగుబడులు రావని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు.

# రాష్ట్రపతి,మాజీ రాష్ట్రపతి పేర్లు తప్పుగా ఉచ్చారణ

**ఛత్తీస్‌గఢ్ పర్యటనలో ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి విమర్శలు**



**రాయ్‌పూర్, జూలై8 (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లోని ఓ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగిస్తూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పేర్లను తప్పుగా ఉచ్చరించారు. ఈ అంశంపై బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. రాయ్‌పూర్‌లోని సైన్స్ గ్రౌండ్‌లో జరిగిన ప్రసంగానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఖర్గే రాష్ట్రపతిని 'ముర్మా జీ' అని ఉచ్చరించారు. అయితే.. ఆయన వెంటనే సరిదిద్దుకుని 'ముర్ము' అని పలికారు. కొన్ని సెకన్ల తర్వాత.. మళ్ళీ మాజీ రాష్ట్రపతి పేరును తప్పుగా ఉచ్చరించారు. 'కోవింద్' ను 'కోవిడ్' అని పలికారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పెద్ద ఎత్తున చెట్ల నరికివేత అంశంపై మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే ఈ తప్పు చేశారు. బీజేపీ, దాని పారిశ్రామిక మిత్రులు భూమిని లాక్కుంటున్నారని ఆయన ఆరోపించారు.'మన నీరు, అడవి, భూమిని కాపాడుకోవాలి. మనం ఐక్యంగా ఉండాలి. వారు (బీజేపీ) (ద్రౌపది) ముర్మాను రాష్ట్రపతిగా, (రామ్ నాథ్) కోవిడ్ (కోవింద్)ను రాష్ట్రపతిగా చేశామని అంటున్నారు. కానీ మన వనరులను, మన అడవి, నీరు, భూమిని దొంగిలించడానికి ప్రయత్నిస్తున్నారు. నేడు, అదానీ, అంబానీ వంటి వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకుంటున్నారని ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చీఫ్ పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆయన చేసిన తప్పును మహిళా, దళిత, గిరిజన వ్యతిరేకి అని అభివర్ణించింది. బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ముపై అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించారు. మొత్తం గిరిజన సమాజం దీనిని ఖండిస్తోంది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ను ఉద్దేశించి కూడా ఆయన కోవిడ్ లాంటి పదాలను ఉపయోగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ముర్మా జీ అని, కోవింద్ జీని కోవిడ్ జీ అని పిలవడం కాంగ్రెస్‌కు ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల తీవ్ర ద్వేషాన్ని తెలియజేస్తుందని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370